

చారిత్రక ఘట్టంలో
సరైనవైపు నిలబడండి

- **మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజనతో మహిళా సాధికారతకు నిర్ణయాత్మక అడుగు**
- **రాజకీయ పార్టీలకు సీఎం చంద్రబాబు పిలుపు**

మహిళా సాధికారత దిశగా దేశం మరో కీలక ముందడుగు వేయబోతోందని సీఎం చంద్రబాబు నాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులను అన్ని రాజకీయ పార్టీలు ఏకాభిప్రాయంతో ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. సీట్ల సంఖ్యను 50 శాతం పెంచడం ద్వారా రాష్ట్రాల ప్రస్తుత ప్రాతినిధ్య వాటాకు రక్షణ కల్పించవచ్చని తెలిపారు. ఈ ప్రతిపాదన అమలైతే ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ స్థానాలు 25 నుంచి 38కి పెరుగుతాయని వెల్లడించారు. మహిళలకు న్యాయం జరగాలంటే ఈ బిల్లులకు రాజకీయ పార్టీలు మద్దతు తెలపాలని తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు.



3



లోక్ అదాలత్, ఆర్బిట్రేషన్ లాంటి ప్రత్యామ్నాయాలతో
సత్వర న్యాయం

కోర్టు కేసుల పరిష్కారానికి ప్రభుత్వంలో లీగల్ ఏఐ స్టాక్ వ్యవస్థ

భారతదేశంలో 4 వ్యవస్థలు బలంగా ఉండడం వల్లనే సంక్షోభాలను ఎదుర్కొని నిలబడ్డాం

తూర్పుగోదావరి జిల్లా కోర్టు 222వ, రాజమండ్రి బార్ అసోసియేషన్ 131 ఏళ్ల వేడుకల్లో సీఎం చంద్రబాబు

న్యాయ వ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించి కేసుల నిర్వహణను మరింత సమర్థంగా, వేగంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. లీగల్ గవర్నెన్స్, లిటిగేషన్ మేనేజ్‌మెంట్ కోసం త్వరలోనే లీగల్ ఏఐ స్టాక్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ప్రస్తుతం ఆన్‌లైన్ లిటిగేషన్ కేస్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ ద్వారా 8.4 లక్షల కేసులను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏఐ ఆధారంగా కేసుల విశ్లేషణ, కౌంటర్ అఫిడవిట్ల తయారీ, చట్టాలు, ప్రభుత్వ ఉత్తర్వులు, నిబంధనలు, కేసుల రికార్డులను ఒకే డిజిటల్ వేదికపైకి తీసుకురావడం ఈ వ్యవస్థ లక్ష్యమని వివరించారు.

2



ఓర్వకల్లు పారిశ్రామిక హబ్‌గా
అభివృద్ధి చెందుతోంది
- మంత్రి నారా లోకేష్

కర్నూలు జిల్లా ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్‌లో పారిశ్రామిక అభివృద్ధి వేగంగా కొనసాగుతోందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. స్థానిక యువతకు సొంత ప్రాంతంలోనే మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఓర్వకల్లులో జై రాజ్ ఇస్పాత్ పరిశ్రమ సాధించిన ప్రగతి, రాబోయే పెట్టుబడులపై ఆయన సోషల్ మీడియా వేదికగా వివరించారు.

4



పెట్టుబడులను
తరిమేసిన చరిత్ర జగన్‌ది

- ఐదేళ్లలో కియా, మిట్టల్‌లాంటి పరిశ్రమ ఒక్కటైనా తెచ్చారా?
- నేడు చంద్రబాబు విజన్, లోకేష్ కార్యాచరణతో రాష్ట్రానికి పెట్టుబడుల వెల్లువ
- పెట్టుబడులపై క్రెడిట్ చోరీకి వైసీపీ నేతల యత్నం
- మంత్రి టీజీ భరత్ ధ్వజం

- వివరాలు 6 లో..

స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఫండ్‌ను పూర్తిగా వినియోగించాలి

- **కరువు, తుపాన్లతో నష్టపోయిన రైతులకు త్వరగా ఇన్‌పుట్ సబ్సిడీ**
- **ఇన్‌పుట్ సబ్సిడీకి బీమా సాయం తోడైతే రైతుకు మేలు**
- **హార్టికల్చర్‌తో పాటు ప్రకృతి సేద్యానికీ జీ రామ్ జీ నిధులను వినియోగించుకోవాలి**
- **డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

ఒకవైపు కరువు, మరోవైపు తుపాన్ల బెడద ఉన్న రాష్ట్రంలో ప్రజలను ఆదుకోవడానికి డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నిధులను సద్వినియోగం చేసుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. కరువు, తుపాన్ల సమయంలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఫండ్ ద్వారా బాధితులకు అండగా నిలిచి, వారికి న్యాయం చేయాలన్నారు. ఈ నిధులను పూర్తిగా వినియోగించుకోవడంతోపాటు కేంద్రం నుంచి అదనపు నిధులు సాధించాలని చెప్పారు.



3



రెండో విడత పంచాయతీ ఎన్నికల్లోనూ
కూటమి అభ్యర్థుల విజయానికి కృషి

టీడీపీ వర్కింగ్ ప్రసిడెంట్ నారా లోకేష్ పిలుపు



రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కూటమి పార్టీలు

బలపరిచిన అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ సూచించారు. రెండో విడత ఎన్నికల సన్నద్ధతపై పార్టీ ముఖ్యనేతలతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఇప్పటికే జరిగిన పట్టణ, పరిషత్, పంచాయతీ ఎన్నికల్లో కూటమి పార్టీల అభ్యర్థుల విజయానికి నాయకులు అద్భుతంగా పనిచేశారని లోకేష్ అభినందించారు.

4

పల్లెలైనా, పట్టణాలైనా..
కూటమికే జనం జేజేలు

- **అన్ని ప్రాంతాలు, వర్గాల్లోనూ సడలని నమ్మకానికి నిదర్శనం**
- **ప్రజల్లో ఏకాభిప్రాయం రాష్ట్ర భవిష్యత్‌కు శుభపరిణామం**
- **సీఎం చంద్రబాబు సమర్థపాలనకు జనం పట్టం**
- **ఓటుతో బుద్ధి చెబుతున్నా మారని జగన్ పార్టీ తీరు**
- **ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు**



5

లోక్ అదాలత్, ఆర్బిట్రేషన్ లాంటి
ప్రత్యామ్నాయాలతో సత్వర న్యాయం

- కోర్టు కేసుల పరిష్కారానికి ప్రభుత్వంలో లీగల్ ఏఐ స్టాక్ వ్యవస్థ
- భారతదేశంలో 4 వ్యవస్థలు బలంగా ఉండడం వల్లనే సంక్షోభాలను ఎదుర్కొని నిలబడ్డాం
- తూర్పుగోదావరి జిల్లా కోర్టు 222వ, రాజమండ్రి బార్ అసోసియేషన్ 131 ఏళ్ల వేడుకల్లో సీఎం చంద్రబాబు







రాజమహేంద్రవరం (చైతన్య రథం): న్యాయ వ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించి కేసుల నిర్వహణను మరింత సమర్థంగా, వేగంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. లీగల్ గవర్నెన్స్, లిటిగేషన్ మేనేజ్‌మెంట్ కోసం త్వరలోనే లీగల్ ఏఐ స్టాక్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ప్రస్తుతం ఆన్‌లైన్ లిటిగేషన్ కేస్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ ద్వారా 8.4 లక్షల కేసులను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏఐ ఆధారంగా కేసుల విశ్లేషణ, కౌంటర్ అఫిడవిట్ల తయారీ, చట్టాలు, ప్రభుత్వ ఉత్తర్వులు, నిబంధనలు, కేసుల రికార్డులను ఒకే డిజిటల్ వేదికపైకి తీసుకురావడం ఈ వ్యవస్థ లక్ష్యమని వివరించారు.

తూర్పుగోదావరి జిల్లా కోర్టు 222 ఏళ్లు, రాజమండ్రి బార్ అసోసియేషన్ 131 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాజమహేంద్రవరంలోని మంజీరా సరోవర్ ప్రీమియర్ హోటల్‌లో నిర్వహించిన వేడుకల్లో సీఎం పాల్గొని ప్రసంగించారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎస్.వి.ఎన్. భట్టీ నారాయణ భట్టి, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ పి. నరసింహ, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసాగిల్, త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రామచంద్రరావు, పలువురు హైకోర్టు న్యాయమూర్తులు కార్యక్రమానికి హాజరయ్యారు. వారి సమక్షంలో వార్షికోత్సవ సావనీర్‌ను సీఎం విడుదల చేశారు. సీనియర్ న్యాయవాదులు, న్యాయమూర్తులు, విశ్రాంత న్యాయమూర్తులను సత్కరించారు.

ప్రజలకు సత్వర న్యాయం అందించాలి

ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థతో పాటు ప్రజాప్రతినిధుల వ్యవస్థ కూడా ప్రజల హక్కుల పరిరక్షణకు పనిచేస్తోందని చంద్రబాబు పేర్కొన్నారు. రాజ్యాంగం నిర్దేశించిన విలువలను కాపాడుతూ ప్రతి ఒక్కరికీ సకాలంలో న్యాయం అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. లోక్ అదాలత్‌లు, మధ్యవర్తిత్వం, ఆర్బిట్రేషన్ వంటి ప్రత్యామ్నాయ విధానాలను ప్రోత్సహించడం ద్వారా కేసుల పరిష్కారాన్ని వేగవంతం చేయవచ్చని చెప్పారు. కోర్టుల్లో ప్రభుత్వం కూడా ప్రతివాదిగా ఉన్న కేసులను న్యాయస్థానాల సహకారంతో త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు ప్రయోజనం కల్పించాలన్నది తమ ఆలోచనగా వెల్లడించారు.

తాటి చెట్ల ఆకులపై తీర్పుల ప్రతులు రాసిన రోజుల నుంచి నేటి కృత్రిమ మేధ వరకు న్యాయవ్యవస్థ ఎంతో రూపాంతరం చెందిందని సీఎం అన్నారు. ప్రజా కోర్టుగా పేరొందిన సీతానగరం రచ్చబండ కోర్టు 1849లోనే అధికారిక కోర్టుగా గుర్తింపు పొందిందని గుర్తుచేశారు. రాజమండ్రి బార్ అసోసియేషన్, తూర్పుగోదావరి జిల్లా కోర్టులు సుదీర్ఘకాలంగా ప్రజలకు న్యాయ సేవలు అందిస్తున్నాయని అభినందించారు. రాజమండ్రి బార్ అసోసియేషన్‌లో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసిన జస్టిస్ కోకా సుబ్బారావు దేశ తొమ్మిదో ప్రధాన న్యాయమూర్తిగా పనిచేయడం ఈ ప్రాంతానికి గర్వకారణమన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు వంటి న్యాయవాదులు బ్రిటిష్ పాలకులను ఎదిరించి నిలిచిన ధైర్యశాలులని కొనియాడారు. ఆదికవి నన్నయ్య, కందుకూరి వీరేశలింగం పంతులు వంటి మహనీయుల జన్మస్థలంగా, కార్యక్షేత్రంగా చారిత్రక ప్రాధాన్యం కలిగిన ప్రాంతమని పేర్కొన్నారు. ఆర్థర్ కాటన్ నిర్మించిన బ్యారేజీ ఉభయగోదావరి జిల్లాల డెల్టాను సస్యశ్యామలం చేసి ఈ ప్రాంతాన్ని అన్నపూర్ణగా మార్చిందని గుర్తుచేశారు.

అమరావతికి అండగా నిలిచిన తీర్పు

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా ఇచ్చిన తీర్పు రాష్ట్రాన్ని, అమరావతిని కాపాడిందని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఏపీ హైకోర్టు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ లీసాగిల్ చరిత్రలో నిలిచిపోయారని అభినందించారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లు కూడా త్వరలో అమల్లోకి వచ్చే అవకాశం ఉందన్నారు.

ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు సంక్షోభాలను ఎదుర్కొంటున్నా భారత్ మాత్రం స్థిరంగా ముందుకు సాగుతోందని సీఎం చెప్పారు. ప్రజాస్వామ్యంలోని నాలుగు స్తంభాలు పటిష్ఠంగా ఉండటమే దీనికి ప్రధాన కారణమన్నారు. 2047 నాటికి దేశాన్ని వికసిత్ భారత్‌గా, రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దడమే లక్ష్యమని చెప్పారు. పౌర పాలనలోనూ ఏఐ సాంకేతికతను వినియోగించి మెరుగైన సేవలు అందిస్తున్నామని, పన్నుల వసూళ్లలోనూ సాంకేతిక పరిజ్ఞానంతో మంచి ఫలితాలు సాధిస్తున్నామని వివరించారు. వచ్చే ఏడాది ఏపీ జీవనాడి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడంతో పాటు గోదావరి పుష్కరాలను నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. సీఎంగా మూడోసారి గోదావరి పుష్కరాలను నిర్వహించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. పుష్కరాలకు విచ్చేసి పుణ్యస్నానాలు ఆచరించాలని సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులను ముఖ్యమంత్రి ఆహ్వానించారు. 222 ఏళ్ల చరిత్ర కలిగిన తూర్పుగోదావరి జిల్లా కోర్టుకు, 131 ఏళ్ల ప్రస్థానం పూర్తి చేసుకున్న రాజమండ్రి బార్ అసోసియేషన్‌కు ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు.





స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఫండ్‌ను పూర్తిగా వినియోగించాలి

- కరువు, తుపాన్లతో నష్టపోయిన రైతులకు త్వరగా ఇన్‌పుట్ సబ్సిడీ
- ఇన్‌పుట్ సబ్సిడీకి బీమా సాయం తోడైతే రైతుకు మేలు
- హార్టికల్చర్‌తో పాటు ప్రకృతి సేద్యానికీ జీ రామ్ జీ నిధులను వినియోగించుకోవాలి
- డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు





అమరావతి (చైతన్య రథం): ఒకవైపు కరువు, మరోవైపు తుపాన్ల బెడద ఉన్న రాష్ట్రంలో ప్రజలను ఆదుకోవడానికి డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నిధులను సద్వినియోగం చేసుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. కరువు, తుపాన్ల సమయంలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఫండ్ ద్వారా బాధితులకు అండగా నిలిచి, వారికి న్యాయం చేయాలన్నారు. ఈ నిధులను పూర్తిగా వినియోగించుకోవడంతో పాటు కేంద్రం నుంచి అదనపు నిధులు సాధించాలని చెప్పారు.

ఎల్ నినో కారణంగా ఏర్పడిన కరువు, అర్నబ్, మురసు తుపాన్లతో రైతులకు జరిగిన నష్టం, ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లింపులపైనా సీఎం సమీక్షించారు. నష్టపోయిన రైతులకు సాధ్యమైనంత త్వరగా ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలని ఆదేశించారు. ఎన్డీఆర్ఎఫ్ నిబంధనల ప్రకారం కరువు, రెండు తుపాన్ల వల్ల వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక రంగాల్లో జరిగిన నష్టానికి గాను ఎస్డీఆర్ఎఫ్ నుంచి రూ.2,459 కోట్లు చెల్లించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. ఇందులో ఒక్క వ్యవసాయ రంగానికి ఎల్ నినో కారణంగా ఏర్పడిన కరువుకు రూ.1,721 కోట్లు, అర్నబ్ తుపానుకు రూ.602 కోట్లు, మురసు తుపానుకు రూ.97 కోట్లు ప్రతిపాదించినట్లు వివరించారు. ఎస్డీఆర్ఎఫ్ నిధుల నుంచి ప్రభుత్వం అందించే ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు ప్రతి రైతుకూ బీమా సాయం అందేలా చూడాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఇందుకు అవసరమైన వివరాలను పక్కాగా సేకరించి, నిధులను నేరుగా బాధిత రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు బీమా సొమ్ము కూడా రైతులకు చేరితే వారికి న్యాయం జరుగుతుందని సీఎం చెప్పారు. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో అందుబాటులో ఉన్న నిధులను రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు కార్యాచరణ చేపట్టాలని సీఎం సూచించారు. హార్టికల్చర్‌కు జీ రామ్ జీ నిధుల వినియోగానికి ఇప్పటికే ఆమోదం ఉందని పేర్కొన్నారు. ప్రకృతి సేద్యానికీ ఈ నిధులను వినియోగించేందుకు అవసరమైన అనుమతులు సాధించాలని అధికారులకు సూచించారు.

అణగారిన వర్గాల విద్యాభివృద్ధికి జీవితాంతం కృషి చేసిన
మహనీయుడు పూలే

సీఎం చంద్రబాబు నివాళి



అమరావతి (చైతన్య రథం): అణగారిన వర్గాల విద్యాభివృద్ధి, మహిళా సాధికారత, సామాజిక సమానత్వ సాధనకు జీవితాంతం కృషి చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతి రావు పూలే అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొనియాడారు. పూలే వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి సోషల్ మీడియా వేదికగా తన సందేశాన్ని పంచుకున్నారు. బాలికల కోసం ప్రత్యేకంగా పాఠశాలను ప్రారంభించి, విద్య ద్వారానే సమాజంలో మార్పుసాధ్యమని పూలే చాటిచెప్పారని చంద్రబాబు పేర్కొన్నారు. కుల వివక్షకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటం, సామాజిక సంస్కరణల కోసం అందించిన సేవలు తరతరాలకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. భారత సామాజిక విప్లవానికి శ్రీకారం చుట్టిన మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలు, ఆదర్శాలు సమాజానికి ఎప్పటికీ మార్గదర్శకంగా నిలుస్తాయని సీఎం చంద్రబాబు తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

పూలే సేవలు భావితరాలకు ఆదర్శనీయం: లోకేష్

పమఖ సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఘన నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, మహిళా విద్యకు తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప మానవతావాది జ్యోతిరావు పూలే అని కొనియాడారు. కుల వ్యవస్థ, అంటరానితనానికి వ్యతిరేకంగా పూలే చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం, విద్యాభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. పూలే వర్ధంతి సందర్భంగా ఆయన చేసిన సేవలను స్మరించుకోవాలని మంత్రి నారా లోకేష్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజనతో
మహిళా సాధికారతకు నిర్ణయాత్మక అడుగు

రాజకీయ పార్టీలకు సీఎం చంద్రబాబు పిలుపు



అమరావతి (చైతన్య రథం): మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లుల ద్వారా మహిళా సాధికారత దిశగా కీలక ముందడుగు పడబోతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఈ దిశగా నిర్ణయాత్మక అడుగు పడనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ రెండు బిల్లులను అన్ని రాజకీయ పార్టీలు ఏకాభిప్రాయంతో ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి సోషల్ మీడియా వేదికగా స్పందించారు.

1986లోనే స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించి ఆంధ్రప్రదేశ్ దేశానికి మార్గదర్శకంగా నిలిచిందని చంద్రబాబు గుర్తుచేశారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో దాదాపు 60 శాతం సీట్లు మహిళలకే దక్కాయని తెలిపారు. మహిళా రిజర్వేషన్లకు మద్దతుగా రాష్ట్ర అసెంబ్లీ ఇప్పటికే కేంద్రానికి తీర్మానం పంపిన విషయాన్ని ప్రస్తావించారు. మహిళా రిజర్వేషన్లతో పాటు నియోజకవర్గాల పునర్విభజనలోనూ రాష్ట్రాల ప్రాతినిధ్యానికి భరోసా కల్పించేలా సీట్ల సంఖ్యను 50 శాతం పెంచాలని ప్రతిపాదించినట్లు సీఎం వివరించారు. ఈ విధానం వల్ల ప్రతి రాష్ట్రం ప్రస్తుత ప్రాతినిధ్య వాటాకు రక్షణ లభిస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రతిపాదన ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ స్థానాలు 25 నుంచి 38కి పెరుగుతాయని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్య వాటా కూడా చెక్కుచెదరకుండా ఉంటుందని స్పష్టం చేశారు.

1971లో ఒక ఎంపీ సుమారు 10 లక్షల మంది ప్రజలకు ప్రాతినిధ్యం వహించేవారని, ప్రస్తుతం ఆ సంఖ్య దాదాపు 27 లక్షలకు చేరిందని చంద్రబాబు పేర్కొన్నారు. సీట్ల సంఖ్య పెరిగితే ఈ సంఖ్య సుమారు 18 లక్షలకు తగ్గుతుందని, తద్వారా ప్రజాప్రతినిధులు ప్రజలకు మరింత చేరువయ్యే అవకాశం ఉంటుందని వివరించారు. మహిళా రిజర్వేషన్లకు మద్దతు తెలుపుతూ రాష్ట్ర అసెంబ్లీ ఇప్పటికే కేంద్రానికి తీర్మానం పంపిందని గుర్తుచేశారు. గతంలో జరిగిన తప్పిదాలను పునరావృతం చేయకుండా అన్ని రాజకీయ పార్టీలు ఏకాభిప్రాయంతో ఈ బిల్లులను ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. మహిళలకు దక్కాల్సిన న్యాయాన్ని నిరాకరించడమే ఈ బిల్లులను వ్యతిరేకించడం అవుతుందని సీఎం చంద్రబాబు తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

సోల్స్‌బర్గ్ ఫెస్టివల్ వేదికపై
అన్నమయ్య కీర్తన..

చాంటిక్లియర్ బృందంపై సీఎం చంద్రబాబు ప్రశంసలు

అమరావతి (చైతన్య రథం): స్విట్జర్లాండ్‌లో జరిగిన సోల్స్‌బర్గ్ ఫెస్టివల్-2026 వేదికపై గ్రామీ అవార్డు విజేత చాంటిక్లియర్ బృందం ఆలపించిన అన్నమయ్య కీర్తన సోషల్ మీడియాలో వైరల్ కావడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించారు. 15వ శతాబ్దపు వాగ్గేయకారుడు తాళ్లపాక అన్నమాచార్యులు రచించిన 'బ్రహ్మమొక్కటే' కీర్తనను అద్భుతంగా ఆలపించిన చాంటిక్లియర్ అకాపెల్లా బృందాన్ని సీఎం ప్రశంసించారు. ఈ కీర్తనను అంతర్జాతీయ వేదికపై ఆలపించడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందని చంద్రబాబు తన ట్వీట్‌లో పేర్కొన్నారు. సకల జీవులూ ఒక్కటేననే అన్నమయ్య కీర్తనలోని సందేశం ప్రపంచవ్యాప్తంగా అందరినీ ఆకర్షించిందని తెలిపారు. సరిహద్దులు, భాషలు, తరాలకు అతీతంగా నిలిచే తెలుగు సంస్కృతి, వారసత్వ గొప్పతనాన్ని ఈ అజరామరమైన కీర్తన మరోసారి గుర్తుచేస్తోందని సీఎం పేర్కొన్నారు. తెలుగు సాహిత్య, సంగీత వైభవాన్ని అంతర్జాతీయ వేదికపై చాటిచెప్పిన చాంటిక్లియర్ బృందం ప్రదర్శనను అభినందించారు.

రామాయపట్నంలో
బీపీసీఎల్ రిఫైనరీకి ఆమోదం..

దక్షిణ కోస్తా అభివృద్ధికి కీలక ముందడుగు: మంత్రి నారా లోకేష్

అమరావతి (చైతన్య రథం): ప్రకాశం జిల్లా రామాయపట్నంలో ఏర్పాటు కానున్న భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) అత్యాధునిక రిఫైనరీకి ఆమోదం లభించడంపై రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఏటా 9 మిలియన్ మెట్రిక్ టన్నుల శుద్ధి సామర్థ్యంతో నిర్మించనున్న రిఫైనరీ దేశ ఇంధన శుద్ధి సామర్థ్యాన్ని పెంపొందించడంతో పాటు ఇంధన భద్రతను బలోపేతంచేయడానికి దోహదపడుతుందని లోకేష్ పేర్కొన్నారు. ముఖ్యంగా దక్షిణ ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలో ఈ భారీ పరిశ్రమ ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు, సమగ్ర అభివృద్ధికి చోదకశక్తిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కైలాసగిరి బస్సు ప్రమాదంలో
ఇద్దరు విద్యార్థులు, ఉపాధ్యాయుడికి గాయాలు..
అంతా సురక్షితం: మంత్రి నారా లోకేష్

అమరావతి (చైతన్య రథం): విశాఖపట్నంలోని కైలాసగిరి ఘాట్ రోడ్డులో జరిగిన స్కూల్ బస్సు ప్రమాదంపై రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆరా తీశారు. పిఠాపురంలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు విజ్ఞాన యాత్రలో భాగంగా విశాఖపట్నం కైలాసగిరికి వెళ్లిన సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఘాట్ రోడ్డులో బస్సు కిందికి దిగుతున్న సమయంలో ప్రమాదం చోటుచేసుకుందని, ఇద్దరు విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడు గాయపడినట్లు తెలిపారు. క్షతగాత్రులకు మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారని, అంతా సురక్షితంగా ఉన్నారని అధికారులు వెల్లడించారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని లోకేష్ భరోసా ఇచ్చారు. దూర ప్రాంతాలకు, విజ్ఞాన యాత్రలకు విద్యార్థులను తీసుకెళ్లే సమయంలో వాహనాల ఫిట్‌నెస్‌ను తప్పనిసరిగా తనిఖీ చేయాలని మంత్రి సూచించారు. అనుభవం, నైపుణ్యం కలిగిన డ్రైవర్లను ఎంపిక చేసుకోవడంతో పాటు విద్యార్థుల భద్రతకు సంబంధించిన అన్ని జాగ్రత్తలను పాఠశాల యాజమాన్యాలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.

ఓర్వకల్లు పారిశ్రామిక హబ్‌గా అభివృద్ధి చెందుతోంది: మంత్రి నారా లోకేష్

అమరావతి (చైతన్య రథం): కర్నూలు జిల్లా ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్‌లో పారిశ్రామిక అభివృద్ధి వేగంగా కొనసాగుతోందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. స్థానిక యువతకు సొంత ప్రాంతంలోనే మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఓర్వకల్లులో జై రాజ్ ఇస్పాత్ పరిశ్రమ సాధించిన ప్రగతి, రాబోయే పెట్టుబడులపై ఆయన సోషల్ మీడియా వేదికగా వివరించారు.

2016లో జై రాజ్ ఇస్పాత్ సంస్థకు ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్‌లో భూములు కేటాయించగా, 2018 మేలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిశ్రమకు శంకుస్థాపన చేశారని లోకేష్ గుర్తుచేశారు. నాడు ఖాళీగా ఉన్న భూముల్లో నేడు ఆసియాలోనే తొలిసారిగా ఎండ్‌లెస్ కాస్టింగ్ అండ్ రోలింగ్ సాంకేతిక పరిజ్ఞానంతో సమీకృత ఉక్కు పరిశ్రమ కార్యకలాపాలు నిర్వహిస్తోందన్నారు. సుమారు 430 ఎకరాల్లో రూ.2,100 కోట్లకు పైగా పెట్టుబడితో ఈ పరిశ్రమ ఏర్పాటైందని వెల్లడించారు. పరిశ్రమ ప్రాంగణంలో మూడో వంతు భూమిని పచ్చదనానికి కేటాయించారని, నీటి అవసరాల కోసం 45



ఎకరాల్లో వర్షపు నీటి నిల్వ జలాశయాన్ని నిర్మించారని తెలిపారు. రెండో దశలో మరో 600 ఎకరాల్లో రూ.3,378 కోట్ల పెట్టుబడితో పరిశ్రమను విస్తరించనున్నారని, తద్వారా మరో 934 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ప్రస్తుతం పరిశ్రమలో పనిచేస్తున్న వారిలో 65 శాతం మంది స్థానికులే కావడం సంతోషకరమన్నారు. ఎస్. శ్రీనివాసు మేనేజర్‌గా, డి. సింధూజ ఇంజనీర్‌గా సొంత ప్రాంతంలోనే ఉద్యోగాలు పొందడం స్థానిక ఉపాధి అవకాశాలకు నిదర్శనమని వివరించారు. జై రాజ్ ఇస్పాత్ పరిశ్రమ ఓర్వకల్లులో పారిశ్రామిక అభివృద్ధికి పునాది వేసిందని, ఇతర సంస్థలకు పెట్టుబడుల అవకాశాలను పరిచయం చేసిందని లోకేష్ పేర్కొన్నారు. రిలయన్స్ సంస్థ కేవలం 12 నెలల్లో ఆసియాలోనే అతిపెద్ద పానీయాల తయారీ పరిశ్రమను అందుబాటులోకి తీసుకురాగా, జాక్సన్, అగస్త్య గ్రీన్ ఎనర్జీ వంటి సంస్థలు సౌర విద్యుత్ పరికరాల తయారీ పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్నాయని తెలిపారు. మరోవైపు ఓర్వకల్లు డ్రోన్ సిటీగా రూపుదిద్దుకుంటోందన్నారు.

వివిధ రంగాలకు చెందిన పరిశ్రమల రాకతో ఓర్వకల్లు దేశంలోనే కీలక పారిశ్రామిక ఉత్పత్తి కేంద్రంగా ఎదుగుతోందని మంత్రి అభిప్రాయపడ్డారు. పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం, పెట్టుబడులను ఆకర్షించడం, స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలను పెంచడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. రాయలసీమను ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసి కృషి చేయాలని మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు.

రెండో విడత పంచాయతీ ఎన్నికల్లోనూ
కూటమి అభ్యర్థుల విజయానికి కృషి
టీడీపీ వర్కింగ్ ప్రసిడెంట్ నారా లోకేష్ పిలుపు

అమరావతి (చైతన్య రథం): రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కూటమి పార్టీలు బలపరిచిన అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ సూచించారు. రెండో విడత ఎన్నికల సన్నద్ధతపై పార్టీ ముఖ్యనేతలతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఇప్పటికే జరిగిన పట్టణ, పరిషత్, పంచాయతీ ఎన్నికల్లో కూటమి పార్టీల అభ్యర్థుల విజయానికి నాయకులు అద్భుతంగా పనిచేశారని లోకేష్ అభినందించారు. కూటమి పట్ల



ప్రజలు సానుకూలంగా ఉన్నారని పేర్కొంటూ, రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను కూడా ప్రతిఒక్కరూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు. ప్రతి ఎన్నిక కీలకమేనని, నాయకులు తమ పరిధిలోని బూత్‌లలో క్రియాశీలకంగా వ్యవహరించాలని చెప్పారు. ఎన్నికల వ్యూహరచన పకడ్బందీగా ఉండాలని, ప్రతి ఓటు కీలకమైనందున ప్రజలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. రెబల్స్ సమస్యల పరిష్కారానికి స్థానిక నాయకత్వంతో చర్చించాలని తెలిపారు. కూటమి పార్టీల మధ్య వంద శాతం ఓట్ల బదిలీ జరిగేలా నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని లోకేష్ స్పష్టం చేశారు. కూటమిలోని అన్ని పార్టీల నాయకులు, శ్రేణులను కలుపుకొని ఎన్నికల కార్యాచరణను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే నాయకులకు భవిష్యత్తులో తగిన అవకాశాలు కల్పిస్తామని, నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇస్తామని భరోసా ఇచ్చారు. మొదటి విడత కంటే రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మరింత మెరుగైన ఫలితాలు సాధించేలా అందరూ సమష్టిగా కృషి చేయాలని నారా లోకేష్ పిలుపునిచ్చారు.

దుర్గమ్మ ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి
- మంత్రి అచ్చెన్నాయుడు ఆకాంక్ష

విజయవాడ (చైతన్యరథం): రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శనివారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీకనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో జీవించాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలతో రైతుల కుటుంబాల్లో ఆనందం నిండాలని అమ్మవారిని ప్రార్థించానని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అన్నిరంగాల్లో అభివృద్ధిసాధించాలని ఆకాంక్షించారు.



అబద్ధాన్ని నిజం చేసేందుకు వైసీపీ వక్రమార్గాలు

- టీడీపీ కార్యకర్త మృతిపై జగన్ పార్టీ తప్పుడు ప్రచారం
- రాజేంద్రన్ హత్యకు కారణమైన వాళ్లపై క్రిమినల్ కేసు రిజిస్టర్ చేయాలి
- ఆయన వైసీపీ కార్యకర్త అయితే.. ఆ కుటుంబాన్ని ఎందుకు పట్టించుకోలేదు
- దగ్గరుండి అంత్యక్రియలు జరిపించిన టీడీపీ నాయకులు
- పార్టీ తరఫున రూ.10లక్షల సాయం అందించామన్న ఎమ్మెల్సీ వర్ల రామయ్య
- వానగుట్టపల్లి ఘటనపై ఎస్ఈసీకి టీడీపీ నేతల ఫిర్యాదు

అమరావతి (చైతన్యరథం): కుప్పం నియోజకవర్గం వానగుట్టపల్లి గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా జరిగిన గొడవల్లో రాజేంద్రన్ మృతి ఘటనపై వాస్తవాలను వక్రీకరించకుండా నిష్పక్షపాతంగా విచారణ జరిపి, ఆయన మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఎమ్మెల్సీ వర్ల రామయ్య డిమాండ్ చేశారు. అధికారులపై దాడికి పాల్పడిన వారిని గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని కోరారు. ఈ మేరకు ఎమ్మెల్సీ వర్ల రామయ్య నేతృత్వంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఛైర్మన్ ఎస్. రాజశేఖర్, ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్ కుమార్ శనివారం రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) కార్యదర్శి ఎ. మల్లికార్జునను కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఘటనకు సంబంధించిన వీడియోలు, ఫొటోలతో కూడిన పెన్‌డ్రైవ్‌ను కూడా అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వర్ల రామయ్య మాట్లాడుతూ.. రాజేంద్రన్ గత 20 ఏళ్లుగా తెలుగుదేశం పార్టీలో క్రియాశీలక కార్యకర్తగా పనిచేస్తున్నారని, ఆయనకు సంబంధించిన అసలైన పార్టీ సభ్యత్వ ఆధారాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. ఆయన పార్టీ సభ్యత్వ సంఖ్య 19023144 అని స్పష్టం చేశారు. అయితే రాజకీయ లబ్ధి, సానుభూతి కోసం రాజేంద్రన్‌ను వైసీపీ కార్యకర్తగా చిత్రీకరిస్తూ నకిలీ గుర్తింపు కార్డులతో తప్పుడు ప్రచారం చేయడం దుర్మార్గమని విమర్శించారు. సాక్షి పత్రికలో నకిలీ ఐడీ కార్డును ప్రచురించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, అబద్ధాలను నిజాలుగా చూపించాలనే ధోరణిని జగన్ మానుకోవాలని హితవు పలికారు. రాజేంద్రన్ నిజంగా వైసీపీ కార్యకర్త అయితే ఆయన మృతి తర్వాత ఆ పార్టీ నాయకుల్లో ఒక్కరైనా కుటుంబ సభ్యులను పరామర్శించారా? అంత్యక్రియల్లో పాల్గొన్నారా? ఆర్థిక సాయం చేశారా? అని ప్రశ్నించారు. రాజేంద్రన్ టీడీపీ కార్యకర్త కాబట్టే పార్టీ నాయకులు దగ్గరుండి అంత్యక్రియలు నిర్వహించారని, పార్టీ తరఫున రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించామని, ప్రభుత్వం తరఫున మరో రూ.10 లక్షలు అందించనున్నట్లు తెలిపారు.

అధికారులపై వైసీపీ దాడుల్లో రాజేంద్రన్ బలి

ఈ నెల 26న వానగుట్టపల్లి గ్రామ పంచాయతీ ఎన్నికల ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత వైసీపీ మద్దతుతో పోటీ చేసిన అభ్యర్థి అనిత 40కి పైగా ఓట్ల మెజారిటీతో విజయం సాధించారని వర్ల రామయ్య వివరించారు. ఓడిపోయిన అభ్యర్థి రీకౌంటింగ్ కోరడంతో సమస్యను పరిష్కరించేందుకు జోనల్ అధికారిణి సంధ్య, రూట్ ఆఫీసర్ వెంకటేష్ అక్కడికి వెళ్లారని తెలిపారు. అయితే అధికారులు ఫలితాలను మార్చేందుకు వచ్చారనే అపోహతో వైసీపీ కార్యకర్తలు కర్రలు, ఇనుప రాడ్లతో అధికారుల వాహనంపై దాడికి దిగారని ఆరోపించారు. ఈ దాడుల నుంచి అధికారులను కాపాడే క్రమంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయని, జోనల్ అధికారిణి సంధ్యను ఒక గదిలో ఉంచి తాళం వేసి రక్షించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. మరోవైపు, రూట్ ఆఫీసర్ వెంకటేష్ కారులో ఉండగానే ఆందోళనకారులు రాళ్లు, కర్రలతో దాడి చేయడంతో డ్రైవర్ ప్రాణభయంతో వాహనాన్ని వేగంగా ముందుకు తీసుకెళ్లారని తెలిపారు. ఈ క్రమంలో రోడ్డుపక్కన ఉన్న రాజేంద్రన్‌ను కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయారని వివరించారు. ఈ ఘటనలో పలువురు పోలీసులకు కూడా గాయాలయ్యాయని పేర్కొన్నారు. అధికారులపై వైసీపీ కార్యకర్తలు దాడులకు దిగకపోయి ఉంటే ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదని, రాజేంద్రన్ ప్రాణాలు కోల్పోయేవారు కాదని వర్ల రామయ్య అన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన వైసీపీకి మళ్లీ అధికారం వస్తుందనే జగన్ ఆశలు కేవలం భ్రమలేనని, రాజకీయంగా నిలదొక్కుకునేందుకు నకిలీ పత్రాలు, తప్పుడు ప్రచారాలను ఆశ్రయించడం మానుకోవాలని సూచించారు. నిజాన్ని నిజంగా అంగీకరించాలని హితవు పలికారు. రాజేంద్రన్ మృతి ఘటనపై పోలీసు ఉన్నతాధికారులతో నిష్పక్షపాతంగా, సమగ్ర విచారణ జరిపించాలని, అధికారులపై దాడులకు పాల్పడిన వారితో పాటు ఆయన మృతికి కారణమైన బాధ్యులందరిపై హత్య కేసు సహా తగిన క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కోరినట్లు వర్ల రామయ్య తెలిపారు.

సామాజిక విప్లవ పితామహుడు పూలే

కొనియాడిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా - పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా నివాళులు

అమరావతి (చైతన్యరథం): అణగారిన వర్గాల అభ్యున్నతి, మహిళా విద్య, సామాజిక సమానత్వం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కొనియాడారు. మహాత్మజ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విగ్రహానికి పార్టీ ముఖ్య నాయకులతో కలిసి పూలమాల వేసి పల్లా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ బాలికల విద్యకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, విద్య ద్వారానే సమాజంలో సమూల మార్పు సాధ్యమని ఆచరణలో చాటిచెప్పారన్నారు. కుల వివక్షకు వ్యతిరేకంగా, సమాన హక్కులు, సామాజిక న్యాయం కోసం ఆయన సాగించిన పోరాటం తరతరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఆ మహనీయునికి ఘన నివాళులు అర్పించి స్మరించుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్‌రావు, వెలగపూడి రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్‌బాబు, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



పల్లెలైనా, పట్టణాలైనా..

కూటమికే జనం జేజేలు

- అన్ని ప్రాంతాలు, వర్గాల్లోనూ సడలని నమ్మకానికి నిదర్శనం
- ప్రజల్లో ఏకాభిప్రాయం రాష్ట్ర భవిష్యత్‌కు శుభపరిణామం
- సీఎం చంద్రబాబు సమర్థ పాలనకు జనం పట్టం
- ఓటుతో బుద్ధి చెబుతున్నా మారని జగన్ పార్టీ తీరు
- ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలంతా కూటమి ప్రభుత్వానికి అండగా నిలుస్తున్నారని విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు అన్నారు. స్థానిక ఎన్నికల ఫలితాలు మరోసారి ప్రజాభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లడించాయన్నారు. ఈవీఎంలు, బ్యాలెట్లు, పోస్టల్ బ్యాలెట్లు ఏ విధంగా ఎన్నికలు జరిగినా ప్రజల తీర్పు కూటమికి అనుకూలంగానే ఉందని పేర్కొన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తన 30 ఏళ్ల రాజకీయ అనుభవంలో ఎన్నో రకాల ఎన్నికల ఫలితాలు, ప్రజాభిప్రాయాలను చూశానన్నారు. గతంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాలతో పాటు ఉద్యోగులు, నిరుద్యోగులు, విద్యావంతులు ఇలా ఒక్కో వర్గంలో ఒక్కో అభిప్రాయం ఉండేదని.. కానీ 2024 ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలు ఏకతాటిపైకి వచ్చి కూటమికి చారిత్రాత్మక విజయాన్ని అందించారన్నారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత, జగన్ నాయకత్వాన్ని తిరస్కరించాలన్న ప్రజల నిర్ణయం 2024 ఎన్నికల్లో స్పష్టంగా వెల్లడైందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న స్థానిక ఎన్నికల్లోనూ అదే ప్రజాభిప్రాయం ప్రతిబింబిస్తోందని, కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని తమ ఓటు ద్వారా మరోసారి చాటుతున్నారని గద్దె రామ్మోహన్ రావు పేర్కొన్నారు.

ప్రజల్లో నమ్మకం పెరిగింది

గత జగన్ మోహన్ రెడ్డి పాలనలో పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా రాష్ట్రంలోని రోడ్లన్నీ పూర్తిగా ధ్వంసమై, అడుగడుగునా గోతులమయంగా మారాయని గుర్తు చేశారు. కానీ, చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి రోడ్డు రూపురేఖలు మారిపోయాయన్నారు. ముఖ్యమంత్రి మారితే ఇంత మార్పు సాధ్యమా.. అని సామాన్య ప్రజలు సైతం ఆశ్చర్యపోతున్నారని తెలిపారు. ఇంకా చాలా రోడ్లు బాగు చేయాల్సి ఉన్నప్పటికీ, ఐదేళ్ల వైసీపీ పాలనలో అనుభవించిన నరకాన్ని మళ్లీ చూడకూడదనే స్పష్టమైన అభిప్రాయం నేడు ప్రజల్లో బలంగా ఉందని పేర్కొన్నారు. అభివృద్ధితో పాటు సంక్షేమ కార్యక్రమాలను కూడా కూటమి ప్రభుత్వం అత్యంత చిత్తశుద్ధితో అమలు చేస్తోందని, దీనివల్ల ప్రజల్లో ప్రభుత్వం పట్ల ప్రగాఢమైన నమ్మకం ఏర్పడిందని తెలిపారు. కేంద్రంలో, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు అధికారంలో ఉన్నాయని, ఇప్పుడు స్థానిక సంస్థల్లోనూ 75 శాతం నుండి 90-92 శాతం వరకు ప్రజలు కూటమికే పట్టం కడుతున్నారని అన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్‌కు స్థానిక సంస్థల రూపంలో మూడో ఇంజన్ కూడా తోడైతే అభివృద్ధి మరింత వేగంగా దూసుకువెళ్తుందని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారని, దానికి తగ్గట్టుగానే ప్రజలు కూడా 'మాకు మూడు ఇంజన్ల బండే కావాలి' అని ఈ తీర్పు ద్వారా స్పష్టం చేశారని పేర్కొన్నారు. గతంలో గ్రామాల్లో ఒక రకంగా, పట్టణాల్లో మరో రకంగా ప్రజల ఆలోచనా విధానం ఉండేదని, కానీ నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారిందని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. చదువుకున్న వారు, నిరక్షరాస్యులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, రైతులు, కార్మికులు, గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలు.. ఇలా సమాజంలోని అన్ని వర్గాల ఆలోచనా శక్తి నేడు అభివృద్ధి వైపే ఒకే విధంగా పయనిస్తోందని ఈ ఎన్నికలు నిరూపించాయన్నారు. ప్రజలందరిలో ఇలాంటి ఏకాభిప్రాయం రావడం ప్రజాస్వామ్యానికి, రాష్ట్ర భవిష్యత్తుకు ఎంతో అవసరమని, ఇది ఒక శుభపరిణామమని గద్దె రామ్మోహన్ రావు ఆశాభావం వ్యక్తం చేశారు.



దౌర్జన్యాలకు స్థానం లేదు

గత పాలనలో జరిగిన దౌర్జన్యాలకు భిన్నంగా, నేడు కూటమి ప్రభుత్వంలో ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకుంటున్నారని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాస్వామ్యబద్ధంగా కూటమికి అఖండ విజయాన్ని అందించిన ప్రజలకు ఆయన మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు, పాదాభివందనాలు తెలియజేశారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నికలను ఏకగ్రీవం చేసుకోవడానికి ఎన్నో దౌర్జన్యాలు చేశారని, కనీసం వయసులో పెద్దవారనే గౌరవం కూడా లేకుండా హింసకు పాల్పడ్డారని ఆయన విమర్శించారు. కానీ నేడు ప్రజలంతా ప్రశాంతతనే కోరుకుంటున్నారని, వ్యాపారవేత్త నుండి సామాన్యుడి వరకు ప్రతి ఒక్కరూ దౌర్జన్యాలకు తావులేని పాలన కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. ప్రజలు ఇస్తున్న ప్రతి విజయం ముఖ్యమంత్రి చంద్రబాబుపై, కూటమి ప్రభుత్వంపై బాధ్యతను మరింత పెంచుతోందన్నారు. ప్రజల కష్టాలను విని, వాటిని పరిష్కరిస్తూ ప్రతి ఒక్కరికీ జవాబుదారీగా ఉండే పాలన అందించడమే చంద్రబాబు లక్ష్యమని, ప్రజలు కూడా ఈ విషయాన్ని గమనిస్తున్నారని చెప్పారు. సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైనప్పటికీ, జగన్ మోహన్ రెడ్డిలో గాని, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో గాని ఆత్మపరిశీలన కరువైందని వ్యాఖ్యానించారు. ఓటమికి కారణాలను సమీక్షించుకుని మార్చుకోవడానికి బదులు, ఇంకా మాది రౌడీయిజమే.. చంపేస్తాం, నరికేస్తాం, రఫా రఫా అని చూపిస్తాం అనే ధోరణితోనే వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని అన్నారు. వైసీపీ ర్యాలీలో స్వయంగా జగన్ మోహన్ రెడ్డి వాహన చక్రాల కిందే ఆ పార్టీ కార్యకర్త, మెడలో కండువా వేసుకుని జెండా పట్టుకుని నలిగిపోయి మరణిస్తే కనీస పశ్చాత్తాపం లేకుండా ఆ నెపాన్ని ఇతరులపైకి నెట్టే ప్రయత్నం చేశారని, గతంలో వివేకానంద రెడ్డి హత్య విషయంలోనూ చంద్రబాబు నాయుడుపై ఇలాగే తప్పుడు ప్రచారం చేశారని గుర్తు చేశారు. నేటికీ ప్లెక్సీల ముందు జంతువులను బలి ఇచ్చి రక్తం చిమ్మే మానసిక స్థితిలో వారు ఉన్నారని, ఎన్నికల ఓటమిని కప్పిపుచ్చుకోవడానికి "మేము తలచుకుంటే ఎన్నికలు జరగనివ్వం" అంటూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నాయకులు, కార్యకర్తల్లో ఇలాంటి హింసాత్మక ఆలోచనలు ఉన్నంత కాలం ప్రజలు వారిని ఈసడించుకుంటూనే ఉంటారని, అదే కూటమి ప్రభుత్వానికి శ్రీరామరక్షగా మారుతోందని పేర్కొన్నారు. రానున్న రెండున్నరేళ్ల కాలంలో ప్రజలు కోరుకున్న ప్రశాంతతను కాపాడుతూ, మరింత బాధ్యతతో, మెరుగైన పాలన అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. గ్రామీణ, మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో ఒకే విధమైన తీర్పుతో కూటమిని ఆశీర్వదించిన ప్రజలందరికీ గద్దె రామ్మోహన్ రావు కృతజ్ఞతలు తెలిపారు.

పెట్టుబడులను తరిమేసిన చరిత్ర జగన్‌ది

- ఐదేళ్లలో కియా, మిట్టల్‌లాంటి పరిశ్రమ ఒక్కటైనా తెచ్చారా?
- నేడు చంద్రబాబు విజన్, లోకేష్ కార్యాచరణతో రాష్ట్రానికి పెట్టుబడుల వెల్లువ
- పెట్టుబడులపై క్రెడిట్ చోరీకి వైసీపీ నేతల యత్నం
- మంత్రి టీజీ భరత్ ధ్వజం

కర్నూలు (చైతన్యరథం): వైఎస్సార్‌సీపీ నేతలు పెట్టుబడులపై మాట్లాడే ముందు వాస్తవాలను తెలుసుకోవాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ హితవు పలికారు. కర్నూలులో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... 2019-24 మధ్య రాష్ట్రానికి భారీ పరిశ్రమలను తీసుకురావడంలో విఫలమైన వైసీపీ నేతలు ఇప్పుడు కూటమి ప్రభుత్వం సాధిస్తున్న ప్రగతిని చూసి జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. పెట్టుబడులు ఒక్కరోజులో రావని, వాటి వెనుక పారిశ్రామికవేత్తలతో చర్చలు, డీపీఆర్‌ల తయారీ, భూముల ఎంపిక, అనుమతులు, మౌలిక సదుపాయాల కల్పన వంటి అనేక దశలు ఉంటాయని స్పష్టం చేశారు.

నిరంతర ఫాలోఅప్ వల్లే రాష్ట్రానికి పెట్టుబడులు

2019కు ముందు రాష్ట్రానికి కియా పరిశ్రమను తీసుకొచ్చింది చంద్రబాబు నాయకత్వంలోని ప్రభుత్వమే. ఇప్పుడు అదే కియా సంస్థ మరో 2 బిలియన్ డాలర్ల పెట్టుబడితో విస్తరణకు ముందుకొచ్చింది. ఇటీవల జరిగిన పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌లో దీనికి సంబంధించిన ఎంఓయూ కూడా కుదిరింది. కేబినెట్ ఆమోదం, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రక్రియ పూర్తయింది. తదుపరి ప్రక్రియ కూడా ముందుకు సాగుతుంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆర్సెలర్ మిట్టల్ వంటి భారీ పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకురాలేకపోయారు. గతంలో ఒడిశాలో పరిశ్రమ ఏర్పాటు చేయాలని భావించిన ఆర్సెలర్ మిట్టల్ సంస్థను కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి తీసుకురావడంలో కీలకంగా వ్యవహరించింది. ముఖ్యంగా మంత్రి నారా లోకేష్ పారిశ్రామికవేత్తలతో నిరంతరం సంప్రదింపులు జరిపి పెట్టుబడులు ఆకర్షిస్తున్నారు. కడపలో జేఎస్‌డబ్ల్యూ, సిమెంట్ కంపెనీల విస్తరణ, మై హోమ్ సంస్థ గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టు వంటి అనేక కార్యక్రమాలు ముందుకు సాగుతున్నాయని వివరించారు.

ఓర్వకల్లు పారిశ్రామిక పార్కులో రిలయన్స్ పరిశ్రమ

కర్నూలు జిల్లా ఓర్వకల్లు పారిశ్రామిక పార్కులో రిలయన్స్ పరిశ్రమను తీసుకొచ్చి పనులు ప్రారంభిం చాం. అవసరమైన నీటి సదుపాయాన్ని కూడా కల్పించాం. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఓర్వకల్లు పారిశ్రామిక పార్కుకు కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేకపోయింది. గూగుల్ డేటా సెంటర్ వంటి భారీ పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురావడం లోనూ కూటమి ప్రభుత్వం కృషిచేసింది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న డేటా సెంటర్ సంస్థలకు విశాఖ పట్నం, ఆంధ్రప్రదేశ్‌పై ప్రత్యేక గుర్తింపు కల్పించిన ఘనత మంత్రి నారా లోకేష్‌దే. రాయలసీమలో గ్రీన్ ఎనర్జీ వనరులు సమృద్ధిగా ఉండటంతో అక్కడ కూడా డేటా సెంటర్ల ఏర్పాటుకు అవకాశాలను పరిశీలిస్తున్నారని మంత్రి భరత్ తెలిపారు.

రూ.22.60 లక్షల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు

పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ నాటికి రూ.22.60 లక్షల కోట్లకు పైగా పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయి. వీటిలో రూ.17 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు ప్రభుత్వ ఉత్తర్వుల స్థాయికి చేరాయి. ప్రభుత్వ ఉత్తర్వులు పొందిన ప్రాజెక్టులు కేవలం కాగితాలపై ఉండేవి కావు. వాటి వెనుక పారిశ్రామికవేత్తల నిర్దిష్ట ప్రణాళికలు, డీపీఆర్‌లు, భూముల ఎంపిక, పెట్టుబడులపై స్పష్టమైన ఆసక్తి ఉంటాయి. పెట్టుబడుల ప్రతిపాదనలను పరిశ్రమలుగా మార్చడమే మా ప్రధాన లక్ష్యం. వైసీపీ నేతలు పెట్టుబడులపై శాతాల లెక్కలు చెబుతున్నారు. కానీ ఐదేళ్ల పాలనలో వారు ఎన్ని భారీ పరిశ్రమలను కార్యరూపంలోకి తీసుకొచ్చారో చెప్పాలని భరత్ దుయ్యబట్టారు.

పరిశ్రమల ఏర్పాటుపై వారానికోసారి సమీక్ష

పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా వాటిని వాస్తవ రూపంలోకి తీసుకురావడానికి నిరంతరం కృషి చేస్తున్నాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో పాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ప్రాధాన్యత ఇస్తున్నాం. ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయిన ప్రతి పరిశ్రమ పురోగతిని వారానికోసారి సమీక్షిస్తున్నాం. పారిశ్రామికవేత్తలు, సంబంధిత మంత్రులు, ఉన్నతాధికారులు, కలెక్టర్లతో ప్రత్యేక వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేశాం. పరిశ్రమల ఏర్పాటులో ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించేలా చర్యలు



తీసుకుంటున్నాం. భూముల కేటాయింపులు, అనుమతులు, ఇతర సమస్యలను వేగంగా పరిష్కరించడం ద్వారా పరిశ్రమలు త్వరగా కార్యరూపం దాల్చేలా పనిచేస్తున్నామని భరత్ తెలిపారు.

భారీ పరిశ్రమల ఏర్పాటుకు సమయం పడుతుంది

విశాఖ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు ఎన్నో సంవత్సరాలు పట్టింది. భారీ పరిశ్రమల ఏర్పాటు అనేది సుదీర్ఘ ప్రక్రియ అని వైసీపీ నేతలు గుర్తించాలి. పెట్టుబడులపై ప్రకటన వచ్చిన వెంటనే మరుసటి రోజు పరిశ్రమలు ప్రారంభమవుతాయని భావించడం సరికాదు. కొన్ని ప్రాజెక్టులు దశలవారీగా పూర్తవుతాయి. మరికొన్ని ప్రాజెక్టులకు దీర్ఘకాలిక పెట్టుబడి ప్రణాళికలు ఉంటాయి. ఆర్సెలర్ మిట్టల్‌కు భూమి కేటాయించాం. అక్కడ పనులు జరుగుతున్నాయి. కడపలో జేఎస్‌డబ్ల్యూ పరిశ్రమ పనులు, సిమెంట్ కంపెనీల విస్తరణ, మై హోమ్ గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టు వంటి కార్యక్రమాలు కూడా ముందుకు సాగుతున్నాయని పేర్కొన్నారు.

వైసీపీ పాలనలో పారిశ్రామికవేత్తల్లో నమ్మకం సన్నగిల్లింది

వైసీపీ పాలనలో పారిశ్రామికవేత్తల్లో రాష్ట్రంపై నమ్మకం దెబ్బతింది. విదేశాల్లో పెట్టుబడిదారుల సమావేశాలకు వెళ్లిన రాష్ట్ర అధికారులకు కూడా ప్రతికూల పరిస్థితులు ఎదురయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టవద్దనే అభిప్రాయం పారిశ్రామిక వర్గాల్లో ఏర్పడింది. రాష్ట్రానికి చెందిన అమరరాజా సంస్థ తెలంగాణలో పరిశ్రమ ఏర్పాటు చేయాల్సిన పరిస్థితిని వైసీపీ ప్రభుత్వం కల్పించింది. అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే పీపీఏలను రద్దు చేయడం ద్వారా పెట్టుబడిదారుల్లో అభద్రతాభావాన్ని సృష్టించారు. అలాంటి చరిత్ర ఉన్న వైసీపీ నేతలు ఇప్పుడు పెట్టుబడుల గురించి మాట్లాడటం హాస్యాస్పదమని భరత్ తప్పుబట్టారు.

అభివృద్ధి వికేంద్రీకరణ మా మంత్రం

రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు సమానంగా పరిశ్రమలు తీసుకెళ్లాలనే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందిస్తున్నాం. శ్రీహరికోటలో దేశానికి కీలకమైన అంతరిక్ష ప్రయోగ కేంద్రం ఉన్న నేపథ్యంలో అక్కడ స్పేస్ సిటీ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. అంతర్జాతీయ అంతరిక్ష రంగ సంస్థలు, ప్రైవేటు కంపెనీలు రాష్ట్రంలో తమ కార్యకలాపాలు ప్రారంభించేలా అవసరమైన పారిశ్రామిక వాతావరణాన్ని కల్పించాలన్నది మా ఉద్దేశం. ఆటోమొబైల్, కెమికల్, డిఫెన్స్, ఎగుమతుల రంగాలకు ప్రత్యేక పారిశ్రామిక క్లస్టర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. జపాన్ తరహాలో నిర్దిష్ట రంగాలకు ప్రత్యేక పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేస్తే పరిశ్రమలకు అవసరమైన అనుబంధ సంస్థలు, మౌలిక సదుపాయాలు ఒకేచోట అందుబాటులోకి వస్తాయి. దీనివల్ల పరిశ్రమల స్థాపన సులభతరమవడంతో పాటు ఉత్పత్తి, ఎగుమతులకు కూడా అనుకూల వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు.

20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం

కూటమి ప్రభుత్వం 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పనిచేస్తోంది. అందుకు అనుగుణంగానే పెట్టుబడులను ఆకర్షిస్తూ పరిశ్రమల ఏర్పాటును వేగవంతం చేస్తున్నాం. వైసీపీ హయాంలో వచ్చిన పెట్టుబడులతో పోలిస్తే ప్రస్తుత ప్రభుత్వ హయాంలో పెట్టుబడుల కార్యరూపం దాల్చే వేగంలో ఎంతో వ్యత్యాసం ఉంది. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా పెట్టుబడులను పరిశ్రమలుగా మార్చేందుకు చంద్రబాబు నాయకత్వంలో నిరంతరం పనిచేస్తున్నాం. రెండున్నరేళ్లలో కూటమి ప్రభుత్వం పారిశ్రామిక రంగంలో గణనీయమైన పురోగతి సాధించిందని వివరించారు.

వైసీపీ నేతలు హోంవర్క్ చేసుకుని మాట్లాడాలి

వైసీపీ నేతలు విమర్శలు చేసే ముందు కనీసం హోంవర్క్ చేసుకోవాలి. పెట్టుబడులపై పూర్తి వివరాలు తెలుసుకుని మాట్లాడాలి. మా ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రానికి భారీ పరిశ్రమలు వస్తున్నాయి. పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారు. ప్రజలు కూడా స్థిరమైన ప్రభుత్వానికి మద్దతు ఇస్తేనే రాష్ట్రంలో అభివృద్ధి, పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన సాధ్యమవుతాయని గుర్తించాలని మంత్రి భరత్ కోరారు.

గుంతల రహిత రహదారులే లక్ష్యం..

- ప్రజా భాగస్వామ్యంతో వినూత్న కార్యక్రమం
- మనమిత్ర వాట్సాప్ ద్వారా ఫిర్యాదులకు అవకాశం..
- ఫొటో, లొకేషన్ పంపితే చాలు

అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో గుంతల రహిత రహదారుల సాధనే లక్ష్యంగా ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రోడ్లపై గుంతలు కనిపిస్తే ప్రజలే నేరుగా ప్రభుత్వానికి ఫిర్యాదు చేసేలా మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌లో ప్రత్యేక సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రజలను పాలనలో భాగస్వాములను చేస్తూ, సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించే దిశగా ఈ కార్యక్రమాన్ని రూపొందించింది. పౌరులు తమ ప్రాంతాల్లో రోడ్లపై గుంతలు కనిపిస్తే వాటి ఫొటోతో పాటు లొకేషన్‌ను మనమిత్ర వాట్సాప్ నంబరు 9552300009కు పంపించాలని ప్రభుత్వం కోరింది.

ఈ సదుపాయాన్ని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) మనమిత్రలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. ఇందుకోసం ముందుగా 9552300009 నంబరుకు 'హాయ్' అని వాట్సాప్ సందేశం పంపాలి. అనంతరం అందులోని 'సేవలు' ఆప్షన్‌ను ఎంపిక చేసుకుని, 'పాట్‌హోల్ గ్రీవెన్సెస్'ను క్లిక్ చేయాలి. ఆ తర్వాత 'రిజిస్టర్ పాట్‌హోల్ గ్రీవెన్స్' ఆప్షన్‌ను ఎంచుకోవాలి. తదుపరి వచ్చే ఫిర్యాదు ఫారాన్ని ఓపెన్ చేసి, అందులో అడిగిన వివరాలను నమోదు చేయాలి. ఫిర్యాదుదారుడి గుర్తింపు ధ్రువీకరణ కోసం ఆధార్ నంబరు నమోదు చేసి, మొబైల్‌కు వచ్చే ఓటీపీని ఎంటర్ చేయాలి. అనంతరం రోడ్డుపై ఉన్న గుంత ఫొటో తీసి అప్‌లోడ్ చేయడంతో పాటు, ఆ గుంత ఉన్న ప్రాంతం ప్రస్తుత లొకేషన్‌ను షేర్ చేయాలి. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఫొటో, ఇతర వివరాలతో ఫిర్యాదు నమోదైనట్లు సంబంధిత వ్యక్తికి సమాచారం అందుతుంది.

నమోదైన ఫిర్యాదు వెంటనే సంబంధిత శాఖకు చేరుతుంది. అధికారులు సమస్యను పరిశీలించి, గుంతలను పూడ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటారు. తద్వారా రోడ్లపై ఏర్పడిన గుంతలను వేగంగా గుర్తించి, మరమ్మతులు చేపట్టేందుకు వీలవుతుంది. ప్రజలు ఎక్కడి నుంచైనా తమ ప్రాంతంలోని రహదారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే అవకాశం కలగనుంది. గుంతల కారణంగా వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించి, సురక్షితమైన ప్రయాణానికి అనువైన రహదారులను అందుబాటులోకి తీసుకురావడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ సాధనలో ప్రజల భాగస్వామ్యం కీలకమని ప్రభుత్వం భావిస్తోంది. ఈ బృహత్తర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, తమ పరిసరాల్లో రోడ్లపై గుంతలు కనిపిస్తే వెంటనే మనమిత్ర ద్వారా ఫిర్యాదు చేయాలని ప్రభుత్వం పిలుపునిచ్చింది.



రాజకీయ ప్రాతినిధ్యంతోనే మహిళా సాధికారత

- హోంమంత్రి వంగలపూడి అనిత



అమరావతి (చైతన్యరథం): మహిళా సాధికారతకు రాజకీయ ప్రాతినిధ్యమే కీలకమని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఈనెల 30న లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును కేంద్రం ప్రవేశపెట్టనుంది. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. మహిళా సాధికారత కేవలం సంక్షేమ పథకాలకే పరిమితం కాకూడదన్నారు. రాజకీయాల్లోనూ మహిళలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించినప్పుడే నిజమైన సాధికారత సాధ్యమనేది కూటమి ప్రభుత్వ ఉద్దేశమన్నారు.

దానిని ఆచరణలో పెడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లను కల్పించామన్నారు. ఏపీలో మహిళా నాయకత్వానికి సర్కార్ బాటలు వేసిందని హోంమంత్రి అన్నారు. పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే ప్రయత్నాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. మహిళా రిజర్వేషన్ల దిశగా కేంద్రం మరో అడుగు వేయడంపై హర్షం వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ల ప్రయత్నం విజయవంతం కావాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే నిర్ణయాల్లో మహిళలు భాగస్వాములుగా మాత్రమే కాకుండా నిర్ణయాధికారులుగా ఎదగాలన్నారు. 'మహిళలు మార్పులో భాగం కావాలి.. మార్పుకు మార్గదర్శకులు కావాలి' అంటూ ఎక్స్‌లో హోంమంత్రి అనిత పోస్ట్ చేశారు.

జగన్ హయాంలో యువత ఆశలకు పాతర..

నేడు కొలువుల జాతర

- ఐదేళ్ల పాలనలో నిరుద్యోగులను మోసం చేసిన వైసీపీ
- 2.30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని..ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించకుండా దగా
- కూటమి ప్రభుత్వంలో వరుసగా ఉద్యోగాల భర్తీ
- ఒకే ఏడాది విభిన్న రంగాల్లో నోటిఫికేషన్లు చారిత్రాత్మకం
- నిరుద్యోగ యువత వైసీపీ తప్పుడు ప్రచారాన్ని నమ్మకుండా వాస్తవాలను గమనించాలి
- ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు



అమరావతి (చైతన్యరథం): నిరుద్యోగ యువత జీవితాల్లో కొత్త ఆశలు నింపుతూ, వారు కోరుకున్న రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగ నియామకాల చరిత్రలో సరికొత్త అధ్యాయానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న వివిధ ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్లను విడుదల చేయడంతో పాటు, జాబ్ క్యాలెండర్‌ను అమలు చేయడం నిరుద్యోగ యువతకు ఎంతో ఊరటనిచ్చిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో ఉద్యోగ నియామక ప్రక్రియ ముందుకు సాగుతోందని చెప్పారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 1956లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు 70 ఏళ్ల రాష్ట్ర చరిత్రలో ఒకే ఏడాదిలో ఇన్ని విభిన్న రంగాల్లో ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల కావడం ఇదే ప్రథమమని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికత, మంత్రి నారా లోకేష్ నిరంతర కృషితోనే ఈ స్థాయిలో ఉద్యోగ నియామకాలు చేపట్టడం సాధ్యమైందని పేర్కొన్నారు.

అన్ని రంగాల్లోనూ ఉద్యోగ అవకాశాలు

ఉన్నత విద్యను అభ్యసించి విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకులుగా స్థిరపడాలనుకునే అభ్యర్థుల కోసం 2026 మే నెలలోనే 1,500 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారని, నియామక ప్రక్రియ కూడా వేగంగా కొనసాగుతోందని తెలిపారు. రాష్ట్రంలో అత్యున్నత స్థాయి ఉద్యోగాలైన ఏపీపీఎస్సీ గ్రూప్-1తో పాటు, మధ్యతరగతి యువత ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న గ్రూప్-2లో 700కు పైగా పోస్టులకు నోటిఫికేషన్లు విడుదలయ్యాయని వివరించారు. దశాబ్దాలుగా భర్తీకి నోచుకోని డైట్ లెక్చరర్లు, సీనియర్ లెక్చరర్లు, ఎస్సీఈఆర్టీ లెక్చరర్ పోస్టులకు కూడా నోటిఫికేషన్లు ఇవ్వడం ద్వారా విద్యా వ్యవస్థలో ఖాళీల భర్తీకి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఉపాధ్యాయ వృత్తిని ఆశయంగా పెట్టుకున్న అభ్యర్థుల కోసం 2,700కు పైగా పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిందని చెప్పారు. ఇంజనీరింగ్ విద్యను పూర్తిచేసి ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు 500కు పైగా ఏఈఈ పోస్టులతో పాటు అటవీ శాఖలోనూ ఉద్యోగ అవకాశాలు కల్పించారని తెలిపారు. ఆర్థిక స్థోమతతో సంబంధం లేకుండా పోలీసు యూనిఫాం ధరించాలని కలలు కనే పేద, మధ్యతరగతి యువత కోసం కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాల భర్తీకి పూర్తి స్థాయి నోటిఫికేషన్ విడుదల చేయడం అభినందనీయమన్నారు. సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 15 మధ్య వరుసగా విడుదలైన ఉద్యోగ నోటిఫికేషన్లు నిరుద్యోగ యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపాయని చెప్పారు. ఉన్నత విద్య, బోధన, ఇంజనీరింగ్, పోలీసు, అటవీ శాఖలు ఇలా వివిధ రంగాల్లో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు వారి అర్హతలు, ఆశయాలకు అనుగుణంగా అవకాశాలు కల్పిస్తున్నామని వివరించారు. 2026 సంవత్సరం నిరుద్యోగ యువత జీవితాల్లోనే కాకుండా, ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ నియామకాల చరిత్రలోనూ ఒక మైలురాయిగా నిలిచిపోతుందని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి అభిప్రాయపడ్డారు. కేవలం హామీలకే పరిమితం కాకుండా, జాబ్ క్యాలెండర్‌ను కార్యరూపంలోకి తీసుకొచ్చి ఉద్యోగ నియామక ప్రక్రియను ముందుకు తీసుకెళ్తున్న ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నిరుద్యోగ యువతకు మరిన్ని అవకాశాలు కల్పిస్తూ వారి భవిష్యత్తుకు భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

వైసీపీ, కూటమి పాలనకు తేడాను యువత గమనించాలి

నిరుద్యోగుల సంక్షేమం, ఉద్యోగ కల్పన విషయంలో ఐదేళ్ల వైసీపీ పాలనకు, ప్రస్తుత ఎన్డీఏ కూటమి ప్రభుత్వ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను విద్యావంతులైన నిరుద్యోగులు బేరీజు వేసుకోవాలని చిరంజీవి రావు పిలుపునిచ్చారు. 2014-19 ఎన్డీఏ పాలన, 2019-24 వైసీపీ పాలన, 2024 తర్వాత ఏర్పడిన కూటమి ప్రభుత్వ పనితీరును ఒకసారి సరిపోల్చుకోవాలని ఆయన కోరారు. పేద, మధ్యతరగతి విద్యార్థులు వేలాది రూపాయలు ఖర్చుపెట్టి ప్రైవేట్ కోచింగ్ తీసుకోలేరనే ఉద్దేశంతో 2014-19లో ఎన్డీఏ ప్రభుత్వం స్టడీ సర్కిళ్ల ద్వారా నాణ్యమైన శిక్షణ అందించింది. కానీ వైసీపీ ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేసి రద్దు చేస్తే, ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం మళ్లీ స్టడీ సర్కిళ్లను పునఃప్రారంభించింది. 2019లో 2.30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని నమ్మబలికిన వైసీపీ, ఐదేళ్లలో కేవలం క్యాలెండర్లు మార్చిందే తప్ప నిరుద్యోగుల తలరాతలు మార్చలేదు. కానీ 70 ఏళ్ల రాష్ట్ర చరిత్రలో మొదటిసారిగా 2026 ఉగాదికి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో 10,060 పైచిలుకు పోస్టులతో జాబ్ క్యాలెండర్ ప్రకటించడమే కాకుండా, చిత్తశుద్ధితో అన్ని నోటిఫికేషన్లు విడుదల చేసి చేసి చూపించాము. అందుకే నేడు పట్నం నుండి పల్లెల వరకు (మున్సిపల్, పరిషత్, పంచాయతీ ఎన్నికల్లో) ప్రజలు, యువత ఎన్డీఏ కూటమిని ఆశీర్వదిస్తున్నారు. రాష్ట్ర చరిత్రలో జరిగిన 15 డీఎస్సీలలో 11 డీఎస్సీలు నిర్వహించిన ఘనత తెలుగుదేశం పార్టీది. గత ప్రభుత్వం 23 వేల పోస్టులని చెప్పి ఒక్కటీ భర్తీ చేయకుండా, ఎన్నికల ముందు తప్పుడు నోటిఫికేషన్‌తో మోసం చేసింది. కానీ కూటమి ప్రభుత్వం రాగానే తొలి సంతకంతో 16,347 పోస్టులతో మెగా డీఎస్సీని పూర్తి చేయడమే కాకుండా, ఏటా డీఎస్సీ నిర్వహిస్తామన్న మాట ప్రకారం నేడు రెండో డీఎస్సీ నోటిఫికేషన్ కూడా ఇచ్చింది. ఉపాధ్యాయ పోస్టుల భర్తీతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్య నాణ్యత పెరిగి, గతేడాది ప్రైవేట్ స్కూళ్ల నుండి సుమారు లక్ష మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరారు.

2022లో వైసీపీ ప్రభుత్వం 6,100 కానిస్టేబుల్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి, న్యాయపరమైన చిక్కులను పరిష్కరించలేక వదిలేసింది. రెండు నెలల్లో మీరు ఎమ్మెల్యేలు, మంత్రులు కావచ్చు కానీ, రెండేళ్లయినా మేము కానిస్టేబుల్ కాలేమా" అని అభ్యర్థులు పంపిన సందేశం తన హృదయాన్ని కదిలించిందని చిరంజీవి రావు తెలిపారు. ఈ విషయాన్ని మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన ప్రత్యేక శ్రద్ధతో న్యాయపరమైన అడ్డంకులన్నీ తొలగించి 6,100 మందికి శిక్షణ పూర్తి చేయించి ఉద్యోగాలు కల్పించారు. తాజాగా మరో పూర్తి స్థాయి కానిస్టేబుల్, ఎస్సై నోటిఫికేషన్ కూడా ఇచ్చాము. గత ప్రభుత్వ హయాంలో గ్రూప్-1 పేపర్లను హాయిలాండ్‌లో 85 రోజులు ఉంచి, ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించి ఏపీపీఎస్సీని అవినీతికి నిలయంగా మార్చారని ఆయన విమర్శించారు. నేడు కూటమి ప్రభుత్వం ఏపీపీఎస్సీని ప్రక్షాళన చేసి, గ్రూప్-1, గ్రూప్-2, అసిస్టెంట్ ప్రొఫెసర్ నోటిఫికేషన్లతో నిరుద్యోగుల్లో కోల్పోయిన విశ్వాసాన్ని తిరిగి నింపుతోందని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు స్పష్టం చేశారు.

గతంలో హామీల క్యాలెండర్లు..

నేడు ఉద్యోగాల క్యాలెండర్

2026వ సంవత్సరం నిరుద్యోగుల జీవితాల్లో ఒక నూతన అధ్యాయంగా, ఉద్యోగ నియామకాల చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోయిందని ఆయన తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నోటిఫికేషన్లు ఇచ్చినా ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలు ఎప్పుడు జరుగుతాయో తెలియక నిరుద్యోగులు ఏళ్ల తరబడి గందరగోళానికి గురయ్యేవారని ఆయన విమర్శించారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రూప్-1, గ్రూప్-2, పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై, డీఎస్సీ వంటి అన్ని పోస్టులకు నోటిఫికేషన్ తో పాటు ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షల తేదీలను కూడా స్పష్టంగా ప్రకటిస్తుండటంతో అభ్యర్థులు ప్రణాళికాబద్ధంగా సిద్ధమవుతున్నారని తెలిపారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో పరిశ్రమలు రాష్ట్రం నుండి తరలిపోవడంతో యువత ఉపాధి కోసం చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ నగరాలకు వలస వెళ్లారని ఆయన అన్నారు. ప్రస్తుతం సీఎం చంద్రబాబు నాయుడు బ్రాండ్, ఐటీ మంత్రి నారా లోకేష్ అవిరళ కృషి వల్ల గత రెండున్నరేళ్లలో రాష్ట్రానికి రూ. 31 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, తద్వారా సుమారు 20 లక్షల ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని పేర్కొన్నారు. విశాఖకు గూగుల్ డేటా సెంటర్, టీసీఎస్, అనకాపల్లికి ఆర్సెలార్ మిట్టల్ ఉక్కు పరిశ్రమ, భోగాపురం విమానాశ్రయం, రైల్వే జోన్, రాయలసీమలో రెన్యూవబుల్ ఎనర్జీ, రాయల్ ఎన్ఫీల్డ్, రక్షణ పరిశ్రమలు, దక్షిణాంధ్రలో అమరావతి రాజధాని, పోర్టుల అభివృద్ధితో వలస వెళ్లిన యువత తిరిగి రాష్ట్రానికి వస్తున్నారని తెలిపారు. గతంలో మూతపడిన స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లను తిరిగి తెరిచి, ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కళాశాలలను పరిశ్రమలతో అనుసంధానం చేసి యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. అలాగే, గత ప్రభుత్వంలో యువతను నిర్వీర్యం చేసిన గంజాయి, డ్రగ్స్ మహమ్మారిని 'ఈగల్ టాస్క్ ఫోర్స్' ఏర్పాటు ద్వారా ఎన్డీఏ ప్రభుత్వం సమర్థవంతంగా కట్టడి చేసిందని వివరించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఈ ప్రభుత్వంలో భాగస్వామ్యం అయినందుకు తాను ఎంతో గర్వపడుతున్నానని చిరంజీవి రావు అన్నారు. వైసీపీ తప్పుడు ప్రచారాల వలలో పడవద్దని యువతకు సూచించారు. "కలలు కనండి, కష్టపడండి, సాధించండి.. మీ కలల రెక్కలకు ఎన్డీఏ ప్రభుత్వం మద్దతుగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. కేంద్రం, రాష్ట్రంలో ఉన్న డబుల్ ఇంజన్ సర్కారుకు తోడుగా, పట్టణ, పరిషత్, మొదటి దశ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు కూటమిని ఆశీర్వదించారని ఆయన గుర్తు చేశారు. రెండు, మూడు దశల గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ యువత, విద్యార్థులు ఎన్డీఏ అభ్యర్థులకు మద్దతు తెలిపి 'ట్రిపుల్ ఇంజన్ సర్కారు' ఏర్పాటుకు, గ్రామీణాభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు కోరారు.

జగన్ హయాంలో.. జే ట్యాక్స్ కోసం పోర్టుల నిర్వీర్యం

- రామాయపట్నం పోర్టుకు వైసీపీ పభుత్వం చేసిందేమీ లేదు
- నేడు కూటమి పాలనలో శరవేగంగా పనులు
- కస్టమ్స్ హోదా రాగానే గొడ్డలిపార్టీ 'క్రెడిట్ చోరీ' ప్రేలాపనలు
- ఏపీని అగ్రగామి లాజిస్టిక్స్ హబ్‌గా తీర్చిదిద్దాలనే సంకల్పంతో సీఎం చంద్రబాబు
- రూ.15 వేల కోట్లతో వేగంగా పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణ పనులు
- విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

అమరావతి (చైతన్యరథం): కనీసం పోర్టుకి, ఎయిర్‌పోర్టుకి మధ్య ఉన్న తేడా కూడా తెలియని వైసీపీ నేతలు ఈ రోజు పోర్టుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామి లాజిస్టిక్స్ హబ్‌గా తీర్చిదిద్దాలనే దృఢసంకల్పంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అడుగులు వేస్తున్నారని పేర్కొన్నారు. సుదీర్ఘ సముద్ర తీర ప్రాంతాన్ని సంపద సృష్టికి కేంద్రంగా మార్చడం ద్వారా రాష్ట్ర ఆదాయాన్ని పెంచడమే కాకుండా, ఆయా ప్రాంతాల్లో వాణిజ్యాన్ని అభివృద్ధి చేసి యువతకు భారీగా ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో చంద్రబాబు నాయుడు ఎన్నో కీలక నిర్ణయాలు తీసుకున్నారని తెలిపారు. అంతర్జాతీయ కార్గో రవాణాలో రాష్ట్రాన్ని ముందుంచేందుకు అనేక జీవోలు జారీ చేసి పోర్టుల అభివృద్ధికి బాటలు వేశారని గుర్తు చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2014-19 మధ్యకాలంలోనే చంద్రబాబు ప్రభుత్వం రామాయపట్నం గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు అవసరమైన అన్ని అనుమతులు తీసుకువచ్చిందన్నారు. 2019లోనే దీనికి శంకుస్థాపన చేసి పనులు కూడా ప్రారంభించారు. కానీ, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి ప్రభుత్వం కేవలం ప్రచారం కోసం 2022లో మళ్లీ అదే పోర్టుకు భూమిపూజ పేరుతో రెండోసారి శంకుస్థాపనచేసింది. గత ఐదేళ్లలో అక్కడ కట్టిన పోర్టు ఏమీ లేదు కానీ, ప్రాజెక్టు వ్యయాన్ని మాత్రం విపరీతంగా పెంచేసి రాష్ట్రంపై ఏకంగా రూ. 3,938 కోట్ల అదనపు అప్పు భారాన్ని మోపారు. విశాఖపట్నంలోని గంగవరం పోర్టులో గతంలో రాష్ట్ర ప్రభుత్వానికి వాటా ఉండేది. వైసీపీ హయాంలో ఆ ప్రభుత్వ వాటాను కూడా లేకుండా చేసి, పోర్టును పూర్తిగా ఒక ప్రైవేటు సంస్థకు ధారాదత్తం చేశారు. ఇలా రాష్ట్రానికి, ప్రజలకు తీరని నష్టం చేసిన వైసీపీ నేతలు, ఇప్పుడు 'క్రెడిట్ చోరీ' అంటూ మాట్లాడటం సరికాదని ఎమ్మెల్యే గణబాబు అభిప్రాయపడ్డారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, అభివృద్ధి చేసే నాయకుడు ఎవరో, రాష్ట్ర ఆస్తులను ప్రైవేటుపరం చేసిన వారెవరో వారికి స్పష్టంగా తెలుసని పేర్కొన్నారు.

కమీషన్ల కోసం అదనపు భారం మోపిన జగన్

పని చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబు బ్రాండ్ అయితే, ఆగిపోయిన పనులకు స్టిక్కర్లు అంటించి ప్రచారం చేసుకోవడం జగన్ బ్రాండ్ అని ఎమ్మెల్యే గణబాబు ఎద్దేవా చేశారు. రామాయపట్నం పోర్టుకు ఇటీవల కేంద్ర ఆర్థికశాఖ కస్టమ్స్ హోదా కల్పించగానే, వైసీపీ నేతలకు 'క్రెడిట్ చోరీ' చేసే ఆలోచన కలిగిందని విమర్శించారు. 2026 నవంబర్ 16న కేంద్ర ఆర్థికశాఖ నోటిఫికేషన్ నెం.93 ద్వారా రామాయపట్నం పోర్టుకు కస్టమ్స్‌క్లియరెన్స్ హోదా దక్కింది. పోర్టుకు శాశ్వత కార్గో రవాణా ఉండాలనే దూరదృష్టితో, 2026 అక్టోబర్ 27న పర్యావరణ అనుమతులు పొందిన రూ.1.27లక్షల కోట్ల బీపీసీఎల్ రిఫైనరీ ప్రాజెక్టుతో రామాయపట్నం పోర్టును అనుసంధానిస్తూ ఒప్పందం కుదిరిందని, దీనిని మా యువనాయకుడు, మంత్రి నారా లోకేష్ ప్రకటించారని తెలిపారు. పెట్టుబడిదారులను బెదిరించి వెళ్లగొట్టిన గత పాలకులకు, నేడు పెట్టుబడులను ఆకర్షిస్తున్న కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేసే నైతిక హక్కు లేదన్నారు. చంద్రబాబు హయాంలో పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలో ప్రైవేట్‌సంస్థలే మౌలిక సదుపాయాలు నిర్మించి ప్రభుత్వానికి వాటా ఇచ్చేవని గుర్తు చేశారు. కానీ, జగన్ రెడ్డి ప్రభుత్వం 'ల్యాండ్‌లార్డ్' విధానం పేరుతో నిర్మాణ భారాన్ని పూర్తిగా ప్రభుత్వంపైనే వేసి, కమీషన్ల కోసం రాష్ట్ర ఖజానాపై అదనపు అప్పుల భారం



మోపిందని ఆరోపించారు.గతంలో భూసేకరణ కూడా పూర్తి చేయకుండా, జీవోలనే మళ్లీ మళ్లీ ఇస్తూ కాలయాపన చేయడం వల్ల రాష్ట్రం వేలకోట్ల రూపాయలు నష్టపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రామాయపట్నం పోర్టు పనులు అత్యంత వేగంగా జరుగుతున్నాయని, ఇప్పటివరకు మొత్తం 84శాతం పనులు పూర్తయ్యాయని ఎమ్మెల్యే వెల్లడించారు. ఆర్థిక పురోగతి రూ.1,796.65కోట్ల నుండి రూ.3,476 కోట్లకు (85.67%)చేరుకుందని తెలిపారు. బ్రేక్ వాటర్స్ 99.12%, నాలుగు బెర్త్‌ల నిర్మాణం, 97.60%, జాతీయ రహదారికి కలిపే 5.5 కి.మీ. ఫోర్-లైన్ రోడ్డు 81%, డ్రెడ్జింగ్, రిక్లమేషన్ 70.74%, ఆన్‌షోర్ ఎక్స్‌టర్నల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ 46.55%, ఇంటర్నల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ 43.50% పనులు జరిగాయన్నారు. రాష్ట్రంలో సుమారు రూ.15,000 కోట్ల వ్యయంతో గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల పనులు శరవేగంగా జరుగుతున్నాయని గణబాబు వివరించారు. పోర్టులు-రామాయపట్నం (84%), మూలపేట (76.13%), మచిలీపట్నం (60%), కాకినాడ గేట్‌వే పోర్టు (33%), ఫిషింగ్ హార్బర్లు- జువ్వలదిన్నె (97.98%), ఉప్పాడ (86.15%), నిజాంపట్నం (81.61%), మచిలీపట్నం (71.90%) పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. మూడున్నరేళ్ల పాటు కేవలం శంకుస్థాపనలకే పరిమితమై, ప్రాజెక్టుల వ్యయాన్ని అమాంతం పెంచిన వైసీపీ నేతలకు నేడు పోర్టుల క్రెడిట్ గురించి మాట్లాడే అర్హత లేదని ఎమ్మెల్యే గణబాబు స్పష్టం చేశారు.

వైసీపీలో అభద్రతా భావం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో, యువనేత లోకేష్ ఘనతతో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాలతో పాటు పారిశ్రామిక, లాజిస్టిక్స్ రంగాల్లో పరుగులు పెడుతోందని, ఈ అభివృద్ధిని చూసి తట్టుకోలేక వైసీపీలో అభద్రతా భావం మొదలైందని విమర్శించారు. 2014-19 మధ్య చంద్రబాబు హయాంలో భూసేకరణ, అవసరమైన అనుమతుల ప్రక్రియ పూర్తి చేయడంతోనే విశాఖపట్నంలోని హెచ్‌పీసీఎల్ రిఫైనరీ విస్తరణకు మార్గం సుగమమైందని గుర్తుచేశారు. దీంతో గతంలో ఏడాదికి 90 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉన్న రిఫైనరీ శుద్ధి సామర్థ్యం 1.5 నుంచి 1.6 కోట్ల మెట్రిక్ టన్నులకు పెరిగిందని తెలిపారు. ఆ నిర్మాణ సమయంలోనే సుమారు 10 వేల మందికి ఉపాధి లభించగా, నేడు రాష్ట్రానికి ప్రతి ఏటా భారీగా ఆదాయం వస్తోందన్నారు. అదే తరహాలో నేడు యువనేత లోకేష్ లక్షల కోట్ల రూపాయల భారీ పెట్టుబడితో కూడిన బీపీసీఎల్ రిఫైనరీ ప్రాజెక్టును ప్రకటించారని, దీనివల్ల నిర్మాణ సమయం నుంచే ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఇంతటి బృహత్తర ప్రాజెక్టుల విషయంలోనూ వైసీపీ నేతలు క్రెడిట్ చోరీకి ప్రయత్నించడం విడ్డూరంగా ఉందన్నారు. గత పాలకుల హయాంలో రాష్ట్రం నుండి పెట్టుబడిదారులు బయటకు వెళ్లిపోయే పరిస్థితి ఉండేదని, నేడు కూటమి ప్రభుత్వం 30కి పైగా అత్యుత్తమ పారిశ్రామిక పాలసీలను తీసుకురావడంతో దేశ, విదేశీ ఇన్వెస్టర్లు ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తున్నారని తెలిపారు. విశాఖపట్నంలో జరిగిన పెట్టుబడుల సదస్సు ద్వారా కేవలం ఎంఓయూలకే పరిమితం కాకుండా, ప్రాజెక్టులను క్షేత్రస్థాయిలో గ్రౌండింగ్ చేసే దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందన్నారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం వైసీపీ నేతలు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, కానీ ప్రజాస్వామ్యంలో ప్రజా తీర్పే అంతిమమని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల్లోనే వారి గ్రాఫ్ ఇప్పటికే 10 శాతం పడిపోయిందని, ప్రజలు ఏ అభివృద్ధిని కోరుకుంటున్నారో కూటమి ప్రభుత్వం అదే దిశగా ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే గణబాబు పేర్కొన్నారు.

పల్లెల్లో 26 శాతం సీట్లకే వైసీపీ పరిమితం

- ఈవీఎంలు.. బ్యాలెట్ ఏదయినా కూటమి వైపే జనం తీర్పు
- సీఎం చంద్రబాబు నాయకత్వంపై ప్రజా విశ్వాసానికి నిదర్శనం
- ఓటమిని జీర్ణించుకోలేక గొడ్డలిపార్టీ అల్లర్లు, దాడులు
- మాజీ మంత్రి పీతల సుజాత

అమరావతి (చైతన్యరథం): గ్రామాలు ఆర్థికంగా, సామాజికంగా బలపడినప్పుడే రాష్ట్రం,దేశం అభివృద్ధి చెందుతాయని మాజీ మంత్రి, ఏపీ మహిళా సహకార ఆర్థిక సంస్థ చైర్‌పర్సన్ పీతల సుజాత అన్నారు. మహాత్మా గాంధీ ఆశయాలకు అనుగుణంగా గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు సమర్థవంతమైన నాయకత్వం ఉంటేనే అభివృద్ధి వేగంగా జరుగుతుందని, ఇటీవల జరిగిన స్థానికసంస్థల ఎన్నికల ఫలితాలు దీనిని మరోసారి నిరూపించాయని పేర్కొన్నారు. బ్యాలెట్ అయినా, ఈవీఎం అయినా ప్రజల తీర్పు కూటమి ప్రభుత్వానికి అనుకూలంగానే ఉందని, రాష్ట్ర ప్రజలంతా కూటమి పాలనపై విశ్వాసం ఉంచారని అన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని



నిలబెట్టుకుంటూ గ్రామాల సమగ్రాభివృద్ధికి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. ఘన విజయాన్ని అందించిన ప్రజలందరికీ కూటమి ప్రభుత్వం తరఫున పీతల సుజాత హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

నాడు అరాచక ఎన్నికలు..నేడు ప్రజాస్వామ్యబద్ధం

2021లో వైసీపీ పాలనలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలు అరాచకాలు, దాడులు, బెదిరింపుల మధ్య జరిగితే.. నేడు కూటమి ప్రభుత్వంలో ఎన్నికలు పూర్తి ప్రజాస్వామ్యబద్ధంగా, రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా ప్రశాంతవాతావరణంలో జరుగుతున్నాయని పీతల సుజాత అన్నారు. ప్రజాదరణ కోల్పోయి ఎన్నికల్లో పరాజయం పాలవుతున్న వైసీపీ నేతలు ఓటమిని జీర్ణించుకోలేక అల్లర్లు, దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు.ప్రస్తుతఎన్నికల్లో మహిళలు, యువతతో పాటు అన్ని సామాజికవర్గాల ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకుని కూటమికి మద్దతు తెలిపారని అన్నారు.ప్రజలతీర్పును గౌరవించాల్సిన వైసీపీ నాయకులు దాడులకు దిగడం దుర్మార్గమని మండిపడ్డారు. గొడ్డలి పార్టీ అధ్యక్షుడి ప్రేరణతోనే రాష్ట్రంలో ఇలాంటి దాడులు జరుగుతున్నాయనే అనుమానాలు కలుగుతున్నాయని విమర్శించారు. కుప్పం మండలం వానగుట్టపల్లెలో వైసీపీ నేతల దాడులు, దౌర్జన్యాలకు టీడీపీకార్యకర్త రాజేంద్రన్ బలయ్యారని పీతల సుజాత ఆరోపించారు. మృతిచెందింది టీడీపీ కార్యకర్త రాజేంద్రన్ అని, ఇందుకు ఆయన టీడీపీ సభ్యత్వ గుర్తింపు కార్డునంబర్ 19023144 (2024-2026) కూడా ఆధారంగా ఉందనితెలిపారు. అయితే వాస్తవాలను వక్రీకరిస్తూ వారి పార్టీ కార్యకర్త చనిపోయినట్లు వైసీపీ సోషల్ మీడియా, అనుకూల మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేయడం సిగ్గుచేటని ఖండించారు. వైసీపీ ఎమ్మెల్సీ భరత్ గతంలో 'వైసీపీ కోసం చంపడానికైనా, చావడానికైనా సిద్ధంగా ఉండాలి' అంటూ చేసిన రెచ్చగొట్టే వ్యాఖ్యలు కార్య కర్తలను హింస వైపు ప్రేరేపించేలా ఉన్నాయని విమ ర్శించారు. ఇలాంటి వ్యాఖ్యలు, దాడులను తీవ్రంగా పరిగణించాలని, రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలప్రాణాలతో చెలగాట మాడటంతగదని అన్నారు.ఎన్నికల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడాలే తప్పదాడులు, దుష్ప్రచారంతో ప్రజల తీర్పును మార్చలేరని పీతల సుజాత స్పష్టం చేశారు.

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

ప్రజలు కూటమి ప్రభుత్వంపై ఉంచిన నమ్మకాన్ని బాధ్యతగా తీసుకుని, వారికి ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్.. ప్రజాప్రతినిధులు, నాయకులకు నిరంతరం ఇదే దిశానిర్దేశం చేస్తున్నారని తెలిపారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను పరిష్కరిస్తూ, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ఎజెండా అని స్పష్టం చేశారు. అమరావతి రాజధాని నిర్మాణం వేగం పుంజుకోవడం, విశాఖపట్నాన్ని ఐటీ హబ్‌గా అభివృద్ధిచేయడం వంటి కార్యక్రమాలతో రాష్ట్ర ప్రగతికి బాటలు వేస్తున్నామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు పింఛన్లు, అన్న క్యాంటీన్లు, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్ల వంటి సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత విస్తృతం చేసి ప్రజల అభిమానాన్ని చూరగొంటామని అన్నారు. ప్రజలు కూటమి ప్రభుత్వానికి బ్రహ్మరథం పడుతుంటే వైసీపీ నాయకులు ఓర్వలేక దాడులకు, అరాచకాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రజల మద్దతు లేదని గుర్తించి ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ హింసను ప్రోత్సహించడం సరికాదన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు కేవలం 11 సీట్లకే పరిమితం చేసినా వైసీపీ నాయకుల తీరులో ఏమాత్రం మార్పురాలేదు. ఫలితంగా నేటి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీ బలం ఏకంగా 26 శాతానికి దిగజారిపోయింది. నానాటికీ పాతాళానికి పడిపోతున్న తమపార్టీ గ్రాఫ్‌ను చూసైనా జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికైనా కళ్లు తెరిచి,ఆత్మవిమర్శ చేసుకుని బుద్ధి తెచ్చుకోవాలని హితవు పలికారు. దాడులు,దుష్ప్రచారాలతో ప్రజల అభిమానాన్ని పొందలేరని,ప్రజలకు సేవచేయడం ద్వారానే రాజకీయాల్లో ఆదరణ లభిస్తుందని పీతల సుజాత స్పష్టం చేశారు.

చైతన్యరథం

అమరావతి నిర్మాణాలపై జగన్ తప్పుడు ప్రచారం

- ఉద్దేశపూర్వకంగానే వాస్తవాల వక్రీకరణ
- నిర్మాణ విస్తీర్ణాన్ని తక్కువగా చూపించి, చదరపు అడుగు ఖర్చు ఎక్కువంటూ దుష్ప్రచారం
- జాతీయ, ప్రాంతీయ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లతో పోలిస్తే హేతుబద్ధంగా అమరావతి రేట్లు
- వాస్తవ వ్యయం చ.అడుగుకు రూ.17,339 మాత్రమే
- రూ.30 వేలకు పైగా ఖర్చు చేస్తున్నారంటూ వైసీపీ అసత్య ప్రచారం
- ఫ్యాక్ట్ చెక్ ద్వారా ప్రభుత్వం వివరణ

అమరావతి (చైతన్యరథం): రాజధాని అమరావతిలో ఐకానిక్ ప్రభుత్వ భవనాల నిర్మాణ వ్యయంపై వైసీపీ చేస్తున్న ఆరోపణలను కూటమి ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. రాజధాని భవనాల నిర్మాణంపై వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టింది. నిర్మాణాల విస్తీర్ణాన్ని తక్కువగా చూపిస్తూ, చదరపు అడుగుకు అయ్యే ఖర్చును ఎక్కువగా ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించింది. రాజధానిపై ఉద్దేశపూర్వకంగానే వాస్తవాలను వక్రీకరిస్తూ వైఎస్ జగన్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఫ్యాక్ట్ చెక్ ద్వారా ప్రభుత్వం వివరణ ఇచ్చింది. ఇటీవల రుషికొండ ప్యాలెస్‌ను ప్రజల సందర్శనార్థం అందుబాటులోకి తీసుకురావాలని కేబినెట్ నిర్ణయించింది. దీంతో అమరావతి నిర్మాణాలపై రాజకీయ వివాదానికి వైసీపీ తెరలేపింది. రుషికొండ ప్యాలెస్ నిర్మాణ వ్యయాన్ని ప్రస్తావిస్తూ రాజధాని నిర్మాణాలపై తప్పుడు ప్రచారం చేస్తోంది.

అమరావతిలో ఐదు ఐకానిక్ ప్రభుత్వ టవర్ల నిర్మాణం మొత్తం 71.43 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో జరుగుతోందని ప్రభుత్వం వెల్లడించింది. అయితే, ఈ విస్తీర్ణాన్ని 52.20 లక్షల చదరపు అడుగులుగా వైసీపీ నేతలు చూపిస్తూ నిర్మాణ వ్యయాన్ని అధికంగా లెక్కిస్తున్నారని తెలిపింది. మొత్తం నిర్మాణ విస్తీర్ణాన్ని పరిగణనలోకి తీసుకుని బడ్జెట్‌ను లెక్కిస్తే చదరపు అడుగుకు అయ్యే వ్యయం రూ.17,339 మాత్రమేనని ప్రభుత్వం పేర్కొంది. చదరపు అడుగుకు రూ.29,340 నుంచి రూ.30 వేల వరకు ఖర్చు చేస్తున్నారంటూ వైసీపీ చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేసింది. అమరావతి నిర్మాణ వ్యయాన్ని జాతీయ స్థాయిలోని ప్రతిష్టాత్మక నిర్మాణాలతో పోల్చి చూడాలని ప్రభుత్వం సూచించింది. నాలుగు అంతస్తులతో నిర్మించిన కేంద్ర పార్లమెంట్ భవనానికి చదరపు అడుగుకు రూ.16,916 ఖర్చయిందని పేర్కొంది. ఈ గణాంకాలను పరిగణనలోకి తీసుకుంటే అమరావతి నిర్మాణాల వ్యయం హేతుబద్ధంగానే ఉందని ఫ్యాక్ట్ చెక్ తెలిపింది. ప్రతి మూడు నెలలకోసారి నిర్మాణ అంచనాలు పెరిగిపోయాయంటూ ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేస్తున్నారని, వాస్తవ విస్తీర్ణాన్ని పరిగణనలోకి తీసుకోకుండా లెక్కలు చూపడం సరికాదని హెచ్చరించింది.

మరోవైపు, వైసీపీ తప్పుడు ప్రచారంపై కూటమి నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రుషికొండ ప్యాలెస్ నిర్మాణానికి చదరపు అడుగుకు రూ.30 వేలకు పైగా ఖర్చు చేశారని గుర్తు చేస్తున్నారు. నిర్మాణ సమయంలో పర్యావరణ నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ విధించిన రూ.200 కోట్ల జరిమానా అంశాన్నీ ప్రస్తావిస్తున్నారు. ఈ వ్యవహారంపై వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. రుషికొండ ప్యాలెస్‌లోకి సందర్శకులను అనుమతిస్తే తన బండారం బయటపడుతుందని భయపడుతున్న జగన్.. అందుకే తన సొంత మీడియా ద్వారా అమరావతిపై ఫేక్ ప్రచారానికి తెర లేపారని కూటమి నేతలు విమర్శిస్తున్నారు.

అడ్డుకునేది 'అమరావతిని' కాదు
'ఆంధ్రుల వైభవాన్ని'!

అమరావతి అభివృద్ధికి అడ్డుపడాలని చూడటం జగన్ రాజకీయ దుర్బుద్ధికి నిదర్శనం. ఒక వ్యక్తిపై ఉన్న అసూయతో అమరావతి అభివృద్ధిని అడ్డుకుంటున్న నాయకుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోతారు. రాజకీయాల్లో నాయకుల మధ్య పోటీ ఉండటం సహజం. కానీ ఒక నాయకుడికి ప్రజల్లో వస్తున్న గుర్తింపును, ఆయన చేపట్టిన ఒక చారిత్రాత్మక అమరావతి రాజధానిని చూసి ఓర్వలేక అడ్డుకోవాలని చూడటం ఏ విధమైన రాజకీయమో అర్థం కావడం లేదు. రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కంటే, చంద్రబాబు కి దక్కనున్న 'క్రెడిట్ ను ఎలా అడ్డుకోవాలన్న దుర్బుద్ధే జగన్ రెడ్డిలో కనిపిస్తోంది. అసూయ, ఈర్ష్య, ద్వేషం, అక్కసు తో ఐదు కోట్ల ప్రజల రాజధానిని బలిపెట్టే జగన్ వైఖరి చూస్తుంటే రాష్ట్రం పట్ల ఆయనకీ ఎంత బాధ్యత ఉందో ప్రజలే అర్థం చేసుకోవాలి. జగన్ కుట్ర, కుళ్ళు రాజకీయాలు రాష్ట్రానికి శాపంగా మారాయి. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకులకు పదేపదే ఫిర్యాదులు చేయ్యడం పై సీఎం చంద్రబాబు వ్యక్తం చేసిన ఆగ్రహం.. జగన్ రాజకీయ ధోరణికి అద్దం పడుతోంది. ప్రజల ఆకాంక్షలతో నిర్మితమవుతున్న రాజధానిని రాజకీయ ప్రత్యర్థి సాధిస్తున్న విజయంగా చూడటం ఎంతటి సంకుచిత మనస్తత్వమో అర్థం అవుతుంది. స్వార్థ రాజకీయంతో రాష్ట్ర ప్రయోజనాలను బలిపెట్టాలని చూడటం రాజకీయ ఆత్మహత్యతో సమానం. ప్రపంచం దృష్టిని ఆకర్షించే విధంగా రాజధాని అమరావతి నిర్మాణం జరిగితే అది భారత దేశానికే తలమానికం అవుతుందని, అటువంటి గొప్ప నగరాన్ని నిర్మించిన ఘనత చంద్రబాబుకి దక్కుతుందన్న అక్కసుతో అమరావతికి అడ్డుపడుతూ ఒక ఫాసిస్టులా వ్యవహరిస్తున్నారు జగన్.

అమరావతి వెలిగితే అది రాష్ట్రానికి గర్వకారణం!

చారిత్రాత్మకమైన అమరావతి నిర్మాణం పూర్తయితే, అది దేశానికే తలమానికంగా నిలుస్తుందన్నది కాదన లేని నిజం. అలాంటి మహానగరాన్ని నిర్మించిన ఘనత, ఆ చారిత్రక విజయం చంద్రబాబుకు దక్కుతుందన్న ఏకైక అక్కసు తోనే అమరావతికి అడ్డుపడుతున్నారనేది స్పష్టంగా అర్థం అవుతుంది. రాజధాని అనేది ఏ ఒక్క నాయకుడి సొంత ఆస్తి కాదు. అది ఐదు కోట్ల మంది ప్రజల ఆకాంక్ష, భవిష్యత్తు. దాన్ని రాజకీయ ప్రత్యర్థి విజయంగా భావించి అడ్డుకోవడం అత్యంత సంకుచిత ధోరణికి అద్దం పడుతుంది. సొంత రాష్ట్ర రాజధాని అభివృద్ధికి నిధులు రాకుండా ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడిబి) వంటి అంతర్జాతీయ సంస్థలకు పదేపదే ఫిర్యాదులు చేయడం ఏ విధమైన బాధ్యత? సొంత రాజకీయ ఉనికి కోసం, ప్రత్యర్థిని దెబ్బతీయడం కోసం అమరావతి అభివృద్ధికి అడ్డుపడుతూ కుళ్ళు రాజకీయాలతో రాష్ట్రానికి శాపంగా మారిన జగన్‌రెడ్డి వైఖరిని ప్రజలు ఎప్పటికీ క్షమించరు. నిజంగా బాధ్యత గల రాజకీయ నాయకుడు అయితే రాష్ట్ర హితం కోసం ఆలోచించాలి. అమరావతి వెలిగితే అది రాష్ట్రానికి గర్వకారణం, దేశానికి ఆదర్శం. ఆ వాస్తవాన్ని జీర్ణించుకోలేక రాజధానికి అడ్డుపుల్లలు వేసే మనస్తత్వం మార్చుకోపోతే ప్రగతి రథం ఆశించిన వేగంతో సాగడం కష్టం. ఇప్పటికే విభజనతో ఆర్థికంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు ఒక బలమైన రాజధాని అత్యవసరం. ఈ వాస్తవాన్ని రాజకీయాలకు అతీతంగా గుర్తించాల్సిన అవసరం ఉంది. గతంలో చేసిన తప్పులను సమీక్షించుకుని, రాష్ట్రానికి మేలు జరిగే నిర్ణయాలకు మద్దతు ఇవ్వాల్సిన బాధ్యత ప్రతిపక్షంపై ఉంది. కానీ అమరావతి విషయంలో మాత్రం జగన్ తీరు అందుకు భిన్నంగా ఉంది. అమరావతి పూర్తయితే దాని ప్రయోజనాలు తరతరాలకు అందుతాయి. ఒక నాయకుడికి దక్కే పేరు తాత్కాలికం మాత్రమే. కానీ ఒక గొప్ప రాజధాని రాష్ట్రానికి అందించే ఆర్థిక, సామాజిక ప్రయోజనాలు శాశ్వతంగా నిలుస్తాయి. ఈ రెండింటి మధ్య తేడాను గుర్తించలేని సంకుచిత రాజకీయ దృక్పథం రాష్ట్రానికి మేలు చేయదు. అమరావతి నిర్మాణం వేగం పుంజుకుంటున్న తరుణంలో వికృత ఫిర్యాదులను పక్కనపెట్టి రాష్ట్ర ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. రాజధాని నిర్మాణం వెనుక వేలాది మంది రైతుల త్యాగం ఉంది. తమ భూములను సమీకరణకు ఇచ్చి, తమ పిల్లల భవిష్యత్తుపై ఆశలు పెట్టుకున్న రైతులు ఉన్నారు. అమరావతి అభివృద్ధి చెందితే తమ ప్రాంతం కూడా అభివృద్ధి చెందుతుందని ఆశిస్తున్న గ్రామీణ ప్రజలు ఉన్నారు. రాజధాని నిర్మాణంతో ఉపాధి, వ్యాపార అవకాశాలు వస్తాయని ఎదురుచూస్తున్న యువత ఉన్నారు. వీరందరి ఆశలను రాజకీయ వివాదంలో బందీ చేయడం ఎంతవరకు సమర్థనీయం?

అసలు జగన్ రెడ్డి అభ్యంతరాలు ఏమిటి?

ప్రపంచ పటంలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక గుర్తింపు తీసుకురాగల సామర్థ్యం అమరావతికి ఉంది. సమర్థవంతమైన ప్రణాళిక, పారదర్శక పాలన, ఆర్థిక క్రమశిక్షణ, పర్యావరణ పరిరక్షణతో నిర్మాణం జరిగితే అమరావతి దేశంలోని ఇతర నగరాలకు ఆదర్శంగా నిలిచే అవకాశం ఉంది. అలాంటి నగరం అభివృద్ధి చెందాలంటే రాజకీయ స్థిరత్వం అత్యవసరం. అధికారంలో ఎవరున్నా రాజధాని విషయంలో ఒక నిరంతర విధానం ఉండాలి. ఒక నాయకుడు చేపట్టిన మంచి పనిని అడ్డుకోవడం కన్నా, అంతకంటే మెరుగైన అభివృద్ధి నమూనాను ప్రజలముందుంచడం మరో నాయకుడు లక్ష్యం కావాలి. అమరావతి విషయంలోనూ అదే స్ఫూర్తి అవసరం. నిర్మాణంలో లోపాలుంటే ఎత్తిచూపాలి. ఖర్చులపై ప్రశ్నించాలి. అంతే కానీ రాజధాని నిర్మాణాన్నే అడ్డుకోవాలని చూడటం క్షమించరానిది. చంద్రబాబుకు పేరు వస్తుందన్న అక్కసుతో అమరావతిపై వ్యతిరేకత పెంచుకున్నారు అన్న విమర్శలకు జగన్ సమాధానం చెప్పాల్సి ఉంది. అసలు అమరావతి విషయంలో జగన్ రెడ్డి అభ్యంతరాలు ఏమిటి? ప్రత్యామ్నాయంగా రాష్ట్రానికి ఎలాంటి ఆర్థిక ప్రయోజనాలు కలిగే నమూనాను ప్రతిపాదిస్తున్నారు? అమరావతి ఒక పార్టీకి చెందిన ఆస్తి కాదు. ఒక నాయకుడి రాజకీయ వారసత్వం కాదు. అది ఆంధ్రుల వైభవానికి, భవిష్యత్తు తరాల ఆశలకు ప్రతీక. చంద్రబాబుతో రాజకీయ పోరాటం చెయ్యండి. కానీ ఐదు కోట్ల ఆంధ్రుల భవిష్యత్తును పణంగా పెట్టి కాదు! అమరావతిని అడ్డుకోవడం అంటే ఒక నాయకుడిని అడ్డుకోవడం కాదు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని, ఆంధ్రుల వైభవాన్ని అడ్డుకోవడమే అవుతుంది.

రైతుల పోరాటానికి శాశ్వత గుర్తింపుగా స్మారక నిర్మాణం!

ప్రభుత్వానికి నిర్మాణ బాధ్యత ఉంటే, ప్రతిపక్షానికి నిర్మాణాత్మక సూచనలు చేసే బాధ్యత ఉండాలి. కానీ రాజధాని నిర్మాణం ముందుకు సాగితే రాజకీయంగా చంద్రబాబుకు పేరు వస్తుందనే ఆలోచనతో రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెట్టడానికి జగన్ రెడ్డి వెనకాడటం లేదు. 2026 ఆగస్టులో అసెంబ్లీలో ప్రభుత్వం వెల్లడించిన వివరాల ప్రకారం అమరావతిలో 119 ప్రధాన ప్రాజెక్టుల అంచనా వ్యయం రూ.66,802 కోట్లు. వాటిలో 97 ప్రాజెక్టుల పనులు ప్రారంభమయ్యాయి. వీటిలో నాలుగు పూర్తికాగా, 93 ప్రాజెక్టుల పనులు కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ ఆర్థిక సంస్థల సహకారంతో అమరావతిలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే, వాటికి ఫిర్యాదులు చేయడం ద్వారా నిర్మాణ పనులపై అనిశ్చితి సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు సమాచారంతో అమరావతిని దెబ్బతీయాలని ప్రయత్నిస్తే అది రాష్ట్రానికి నష్టదాయకం. రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు, ఆర్థిక సంస్థల సహకారం దెబ్బతిసేలా వ్యవహరించడం బాధ్యతాయుతమైన ప్రతిపక్ష లక్షణం కాదు. మహిళలు, వృద్ధులు, రైతులు రోడ్లపైకి వచ్చి 1,631 రోజుల పాటు ఉద్యమించారు. అమరావతి కోసం రైతులు చేసిన పోరాటానికి శాశ్వత గుర్తింపుగా ఒక స్మారక నిర్మాణం చేపట్టాలన్న మంత్రి నారా లోకేశ్ సూచన కూడా సముచితమైనది. రాజధాని నిర్మాణంలో రైతుల పాత్రను చరిత్రలో చిరస్థాయిగా నిలిపేలా ప్రభుత్వం చర్యలు తీసుకోనున్నది. అమరావతికి పునాది వేసింది కేవలం ప్రభుత్వ ఉత్తర్వులు కాదు. రైతుల నమ్మకంతో చేసిన త్యాగం చరిత్రలో నిలిచిపోతుంది. అలాంటి రైతుల ఆశలపై నీళ్లు చల్లడం, వారి పోరాటాన్ని ఎగతాళి చేయడం ఏ విధమైన రాజకీయ సంస్కృతి? ఏది ఏమైనా రాజధాని నిర్మాణం వేగం పుంజుకోవడం జగన్‌రెడ్డికి మింగుడుపడటం లేదు. తాను ఐదేళ్ల పాలనలో అమరావతికి మరణ శాసనం రాసిన తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తిరిగి నిర్మాణం చేపడితే దానికి కూడా అడ్డంకులు సృష్టించాలనుకోవడం అంటే జగన్ మనస్తత్వం ఎటువంటిదో ప్రజలే అర్థం చేసుకోవాలి..

- నీరుకొండ ప్రసాద్

జోన్ - 1

(శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అరకు)

చైతన్యరథం

వణికిస్తున్న చలి... పర్యాటకులు ఇబ్బందులు



అల్లూరి (చైతన్యరథం) :అల్లూరి జిల్లాను చలి తీవ్రత వణికిస్తోంది. ఒకవైపు దట్టంగా అలుముకున్న పొగ మంచు మరోవైపు ఎముకలు కొరికే చలితో స్థానికులతో పాటు దూరప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా ప్రతి ఏటా నవంబర్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతూ ఉంటాయి. ఈ ఏడాది తుపాన్లు, వాయుగుండం కారణంగా వాతావరణంలో మార్పులు ఏర్పడి చలి తీవ్రత కాస్త తగ్గింది. ఇప్పుడు పొడి వాతావరణం ఏర్పడడంతో ఒక్కసారిగా చలి తీవ్రత పెరిగి తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆదిలక్ష్మి తెలిపారు. శనివారం నమోదైన 9.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత ఈ ఏడాదికి రికార్డు స్థాయి ఉష్ణోగ్రతగా గుర్తించినట్లు ఆమె తెలిపారు.

ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారు : ఎమ్మెల్యే కోండ్రు



రాజాం (చైతన్యరథం): రాజాం ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని రాజాం ఎమ్మెల్యే కోండ్రుమురళీమోహన్, పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పేర్కొన్నారు. రాజాం 32 వార్డులతో పాటు మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని కూటమి కైవసం చేసుకోవడం ఖాయమని, రెండో విడత పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి విజయపరంపర కొనసాగుతుందని ధీమా వ్యక్తంచేశారు. ప్రజల ఆదరణ, పార్టీ శ్రేణుల సమష్టి కృషి కూటమికి విజయాన్ని అందిస్తాయన్నారు. రాజాం మండలం శ్యాంపురంలోని టీడీపీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఇద్దరు ఎమ్మెల్యేలు మున్సిపల్ ఎన్నికల పరిస్థితులు, కూటమి విజయావకాశాలు, రెండో విడత పంచాయతీ ఎన్నికలపై చర్చించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ మాట్లాడుతూ.. రాజాం మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్ అభ్యర్థితో పాటు మొత్తం 32 వార్డుల్లోనూ కూటమి అభ్యర్థులు విజయబావుటా ఎగరవేస్తారని ధీమా వ్యక్తంచేశారు. మున్సిపల్ ఎన్నికల్లో విజయంతో పాటు రెండోవిడత పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి విజయకేతనం ఎగురవేయడం ఖాయమన్నారు. జనసేన పార్టీ చైర్మన్ అభ్యర్థి భర్త షణ్ముఖ, కోటగిరి నారాయణరావు, మురళీ మాస్టర్, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి



భామిని (చైతన్యరథం): గ్రామ పంచాయతీ, వార్డు ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఎస్.వసంతకుమారి అన్నారు. భామినిలో రెండో విడత పంచాయతీ, వార్డు ఎన్నికలు జరుగుతున్నందున 27 పంచాయతీలకు సంబంధించి ఇప్పటికే 8 పంచాయతీలు ఏకగ్రీవాలు కాగా మిగిలిన 19 పంచాయతీల్లో సర్పంచి, వార్డులకు పోటీ జరుగుతుందన్నారు. శనివారం ఉదయం పలు మండలాల నుంచి ఎన్నికలకు కేటాయించిన సిబ్బంది బస్సులు ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నాయి. ఇటీవల జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కీసర గ్రామంలో జరిగిన గొడవల నేపథ్యంలో పంచాయతీ ఎన్నికలకు గట్టి బందోబస్తు ఏర్పాటుచేశామని బత్తిలి ఎస్సై రవీంద్ర అన్నారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ.. ఆరుగురు ఎస్సైలు, ఏఎస్సైలు, 120 మందిని ఏర్పాటుచేశామని ఇప్పటికే సమస్యాత్మక, అతిసమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక నిఘాతో పాటు గట్టి బందోబస్తు ఏర్పాటుచేశామని వివరించారు.

కోడూరు సర్పంచ్‌గా చిన్న యంకు నాయుడిని గెలిపించాలి

●కత్తెర గుర్తుపై ఓటు వేయాలని కిమిడి నాగార్జున విజ్ఞప్తి



గరివిడి (చైతన్యరథం): గరివిడి మండలం కోడూరు గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న యలకల చిన్న యంకు నాయుడిని కత్తెర గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజయనగరం జిల్లా టీడీపీ అధ్యక్షులు కిమిడి నాగార్జున గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కోడూరు గ్రామ అభివృద్ధి, ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పనిచేసే అభ్యర్థికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. గ్రామంలో ప్రతి కుటుంబానికి అందుబాటులో ఉండే నాయకత్వాన్ని ఎన్నుకోవాలని సూచించారు. కోడూరు గ్రామ అభివృద్ధి కోసం కత్తెర గుర్తుకు ఓటు వేసి యలకల చిన్న యంకు నాయుడిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నాగార్జున కోరారు.

గ్రామాభివృద్ధికి ప్రజల మద్దతు.. ఏకగ్రీవ సర్పంచులకు, గ్రామ ప్రజలకు మంత్రి అచ్చెన్నాయుడు అభినందనలు

● టెక్కలి నియోజకవర్గంలో టీడీపీ మద్దతుదారుల ఏకగ్రీవ విజయం.. అభివృద్ధికి ప్రజామోదం!

●136 గ్రామ పంచాయతీలకు గాను 35 పంచాయతీలు ఏకగ్రీవం.. గ్రామాల్లో పసుపు జెండా రెపరెపలు

● రాష్ట్ర వ్యవసాయ శాఖ కింజరాపు మంత్రి అచ్చెన్నాయుడు నాయకత్వంపై ప్రజల్లో విశ్వాసం

●ఏకగ్రీవ సర్పంచులతో గ్రామాభివృద్ధికి కొత్త ఊతం.. ప్రోత్సాహక నిధులతో పల్లెలకు మరింత ప్రయోజనం



కోటబొమ్మాళి (చైతన్యరథం): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న టెక్కలి నియోజకవర్గంలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మద్దతుదారులు సత్తా చాటారు. నియోజకవర్గ పరిధిలోని 136 గ్రామ పంచాయతీలకు గాను 35 పంచాయతీల్లో టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికై గ్రామాల్లో తమ ఆధిపత్యాన్ని చాటారు. మంత్రి అచ్చెన్నాయుడు నాయకత్వం, ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో ఉన్న విశ్వాసానికి ఈ ఏకగ్రీవ విజయాలు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, రహదారుల నిర్మాణం, తాగునీటి వసతి, పారిశుద్ధ్యం, విద్య, వైద్యం తదితర రంగాల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యమిస్తోంది. మరోవైపు టెక్కలి నియోజకవర్గంలో మంత్రి అచ్చెన్నాయుడు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి పనుల అమలుకు ప్రత్యేక చొరవ చూపుతున్నారు.

నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలనే లక్ష్యంతో మంత్రి చేస్తున్న కృషికి ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణ ఈ ఏకగ్రీవ ఎన్నికల్లో స్పష్టంగా కనిపిస్తోంది. రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలనే ఆకాంక్షతో ప్రజలు టీడీపీ మద్దతుదారులకు పట్టం కట్టారు. ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహక నిధులు ఆయా గ్రామాల అభివృద్ధికి అదనపు బలాన్ని ఇవ్వనున్నాయి. ఈ నిధులతో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేసేందుకు అవకాశం కలగనుంది. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, గ్రామాల సమగ్ర అభివృద్ధికి ఏకగ్రీవ సర్పంచులు కృషి చేయాల్సిన అవసరం ఉంది. టెక్కలి నియోజకవర్గంలో టీడీపీ మద్దతుదారులు సాధించిన ఈ ఏకగ్రీవ విజయాలు మంత్రి అచ్చెన్నాయుడు నాయకత్వానికి, కూటమి ప్రభుత్వ పాలనకు గ్రామీణ ప్రాంతాల్లో లభిస్తున్న ప్రజాదరణను ప్రతిబింబిస్తున్నాయి. ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచులందరికీ అభినందనలు తెలియజేస్తూ, గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములై ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని ఆకాంక్షించారు.

ఎన్డీఏ పాలనలో ప్రగతి పథంలో పల్లెలు : మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్



అరకు (చైతన్యరథం): మన గ్రామాలు అభివృద్ధి మన చేతుల్లోనే ఉందని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి, సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకోవడానికి ప్రతి ఒక్కరు బాధ్యతగా పంచాయతీ ఎన్నికలలో పాల్గొవాలని అరకు నియోజకవర్గం పెదబయలు మండలంలో గ్రామ పంచాయితీలు పెదకోడపల్లి, కిముడుపల్లి, గోమంగి, గుల్లేలి, బొండపల్లి ఇంటింటి ప్రచార కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ సియ్యరి దన్నుదొర, మాజీ ఎమ్మెల్సీ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అరకు పరిశీలకులు బుద్ధ నాగ జగదీశ్వరరావు ఎన్నికల ప్రచార సభలు నిర్వహించి సర్పంచి వార్డు సభ్యులు మంచి వ్యక్తులను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నాగ జగదీష్ మాట్లాడుతూ... డబ్బు, మద్యానికి, ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీగా ఓట్లు వేస్తేనే మన ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని, ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కుమనకుంటుందని నాగ జగదీష్ అన్నారు. గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ కొప్పుల వెలమ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పి.వి.జి.కుమార్ మాట్లాడుతూ... వైసీపీ ఐదు సంవత్సరాలు పాలనలో గిరిజన గ్రామాలను పట్టించుకోలేదని అక్కడ శాసనసభ్యులను వైసీపీ గెలిపించినప్పటికీ ఈ ప్రాంతాలను నిర్లక్ష్యం చేశారని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్ శాఖ ప్రక్షలన చేసి 4600 కోట్లతో ఒకే రోజు గ్రామాలు అభివృద్ధి పనులు కోసం తీర్మానాలు చేయించి, వాటిని అమలపరిచి రోడ్లు పాడేరు అరకు నియోజకవర్గాలలో మారుమూల ప్రాంతాలకు రోడ్లు వేయించారని ఆ ఘనత కూటమి ప్రభుత్వానికే చెందుతుందని శ్రావణ్ కుమార్ విజయ్‌కుమార్ అన్నారు. మన గ్రామాల అభివృద్ధి కోసం మన పిల్లల భవిష్యత్తు కోసం కూటమి బలపరిచిన తెలుగుదేశం జనసేన బిజెపి మద్దతుతో పోటీ చేస్తున్న సర్పంచులను వార్డ్ మెంబర్లను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

పల్లెల ప్రగతే ప్రతి ఒక్కరి ప్రధాన లక్ష్యం కావాలి : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

●30 పంచాయతీల్లో కూటమి పార్టీలు బలపరిచిన అభ్యర్థులు సర్పంచ్‌లుగా విజయం సాధించిన సరికొత్త రాజకీయ చరిత్రకు నాంది



చిలకలూరిపేట (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటినుంచీ పల్లెల్లో అభివృద్ధి పనులు జోరందుకున్నాయని, జగన్ పాలనలో సమస్యలు, వర్గ వైషమ్యాలు, నిత్య వివాదాలతో గ్రామాలు పూర్తిగా అభివృద్ధికి దూరమయ్యాయని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. పంచాయతీల్లో కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు విజయం సాధించడంతో గ్రామాల్లో నూతన ప్రగతి అధ్యాయం మొదలు కానుందని ఆయన చెప్పారు. పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా గెలుపొందిన పలువురు కొత్త సర్పంచ్ లు శనివారం ప్రత్తిపాటిని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తమ విజయం కోసం ఎమ్మెల్యే ప్రత్తిపాటి చేసిన కృషి, ఆయన అందించిన సహాయసహకారాన్నిఎప్పటికీ మరువలేమన్నారు. తనను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సర్పంచ్ లను పేరుపేరునా అభినందించిన ప్రత్తిపాటి, వారికి శుభాకాంక్షలు తెలియచేశారు. ప్రతి ఒక్కరూ కూటమి ప్రభుత్వ ఆలోచనలు, నిర్ణయాలకు అనుగుణంగా పనిచేయాలని, గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, తమను గెలిపించిన పల్లెల అభివృద్ధే ప్రతి ఒక్కరి ప్రధాన లక్ష్యం కావాలని ప్రత్తిపాటి వారికి సూచించారు. నియోజకవర్గంలో మొత్తం 55 సర్పంచ్ స్థానాలుండగా, వాటిలో 30 పంచాయతీల్లో కూటమి పార్టీలు బలపరిచిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికవడం సరికొత్త రాజకీయ చరిత్రకు నాంది పలికిందని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు.

ఏపీలో కొత్తగా నాలుగు లైన్ల నేషనల్ హైవే రెడీ.. కాకినాడ పోర్టుకు దూసుకెళ్లొచ్చు, ట్రాఫిక్ కష్టాలు తీరినట్లే

● సామర్లకోట-కాకినాడ పోర్టు నేషనల్ హైవే... 12.25 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి



కాకినాడ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో నేషనల్ హైవే ప్రాజెక్టుల పనులు ఒక్కొక్కటిగా కొలిక్కివస్తున్నాయి. సామర్లకోట నుంచి కాకినాడ పోర్టుకు భారత్‌మాల నేషనల్ హైవే పనులు ముగింపు దశకు వచ్చాయి. రూ.408 కోట్లతో పెద్దాపురం ఏడీబీరోడ్డులోని రాక్ సిరామిక్ నుంచి అచ్చంపేట కూడలి వరకు 12.25 కిలోమీటర్ల మేర నాలుగు లైన్ల హైవే నిర్మాణ పనులు డిసెంబర్ నెలాఖరుకు పూర్తి కానున్నాయి. కాకినాడ పోర్టుకు కోల్‌కతా– చెన్నై నేషనల్ హైవే 16కు అనుసంధానం చేస్తూ ఈ రోడ్డు నిర్మిస్తుండటంతో రవాణా, ఎగుమతులు, దిగుమతులు మరింత మెరుగుపడనున్నాయి. మొత్తం హైవే ప్రాజెక్టులో 12.25 కిలోమీటర్ల దూరంలో 27 బ్రిడ్జిలు నిర్మించారు. గోదావరి కాలువ, ఏలేరు కాలువ, ప్రధాన కూడళ్లు ఉండటంతో భారీగా బ్రిడ్జిలు నిర్మించార. ఈ హైవే ప్రాజెక్టుల రాక్ సిరామిక్ దగ్గర 1.78 కిలోమీటర్ల మేర భారీ బ్రిడ్జిని నిర్మాణం చేశారు. అచ్చంపేట కూడలి దగ్గర మరో భారీ వంతెన వచ్చింది. మూడుచోట్ల భారీ అండర్ పాస్‌లు.. ఉండూరు, కొప్పవరం దగ్గర చిన్న అండర్‌పాస్‌లు ఉన్నాయి. ఈ నాలుగు వరుసల రోడ్డుతో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టినట్లే అంటున్నారు.

రూ.408 కోట్లతో చేపట్టిన నాలుగు లైన్లుగా

కాకినాడ పోర్టుకు ఇతర రాష్ట్రాల నుంచి రాజమహేంద్రవరం మీదుగా వచ్చే భారీ వాహనాలు.. ధవళేశ్వరం నుంచి కెనాల్ రోడ్డు మీదుగా వచ్చే వాహనాలు కెనాల్‌రోడ్డు, ఏడీబీరోడ్డు మీదుగానే పోర్టుకు చేరుకుంటూ సామర్లకోట దగ్గరకు వచ్చేసరికి రోడ్లు ఇరుకుగా ఉన్నాయి. అంతేకాదు రాజమహేంద్రవరానికి మెయిన్ రోడ్డు కావడంతో పాటుగా భారీ వాహనాల రాకపోకలు కొనసాగిస్తుండటంతో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ కొత్త రోడ్డు ద్వారా భారీ వాహనాలు రాజమహేంద్రవరం రాకుండా నేరుగా పోర్టుకు వెళ్లొచ్చు. అప్పుడు ట్రాఫిక్ సమస్యలు ఉండవు. కేంద్రం భారత్‌మాల పరియోజన కింద సామర్లకోట–కాకినాడ పోర్టు జాతీయ రహదారి నిర్మిస్తున్నారు. రాజానగరం దగ్గర నేషనల్ హైవే 16 నుంచి సామర్లకోట, అచ్చంపేట జంక్షన్ మీదుగా కాకినాడ పోర్టు వరకు నిర్మిస్తున్నారు. దాదాపు రూ.408 కోట్ల అంచనాతో పనులు చేపట్టారు. ఈ హైవేతో సామర్లకోట, కాకినాడలోకి భారీ సరుకు వాహనాలు బైపాస్ ద్వారా పోర్టుకు వెళ్లొచ్చు.

సమసమాజ స్థాపన కోసం పోరాడిన వ్యక్తి పూలే



కాకినాడ (చైతన్యరథం): అణగారిన వర్గాల ఆశాజ్యోతి, మహిళా విద్యకు మార్గదర్శి, గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావ్ ఫూలే 136వ వర్ధంతి సందర్భంగా రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కుల వివక్షకు తావులేని సమసమాజ స్థాపన, మహిళా విద్యాభివృద్ధి, అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం మహాత్మా జ్యోతిరావ్ ఫూలే చేసిన పోరాటం చిరస్మరణీయమని ఎంపీ సానా సతీష్ బాబు పేర్కొన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చూపిన మార్గం నేటికీ సమాజానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. మహాత్మా జ్యోతిరావ్ ఫూలే ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమానత్వం, విద్య, సామాజిక న్యాయం దిశగా ముందుకు సాగడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని ఎంపీ పేర్కొన్నారు.

అంతర్జాతీయ నైపుణ్య శిక్షణకు వేదిక కావడం గర్వకారణం

● సీఎం చంద్రబాబు దూరదృష్టితో నగరానికి మరో కీలక గుర్తింపు : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



రాజమహేంద్రవరం (చైతన్యరథం): నగర పరిసరా (బొమ్మూరు)ల్లో స్కిల్ ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్ ఏర్పాటు చేయడం నగరానికి గర్వకారణమని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కేంద్రం ఏర్పాటుతో రాజమహేంద్రవరం అంతర్జాతీయ స్థాయి నైపుణ్య శిక్షణకు చిరునామాగా మారడంతో పాటు, స్థానిక యువతకు దేశవిదేశాల్లో మెరుగైన ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకునే సువర్ణావకాశం లభించనుందని పేర్కొన్నారు. యువతకు అంతర్జాతీయ స్థాయిలో ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం అభినందనీయమని తెలిపారు. కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ సహకారంతో బొమ్మూరులోని నైపుణ్య అకాడమీ ఆఫ్ కస్ట్రక్షన్ (NAC) -- అడ్వాన్స్‌డ్ స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ద్వారా రాజమహేంద్రవరం ప్రాధాన్యత మరింత పెరగనుందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య సంరక్షణ, ఇంజినీరింగ్, నిర్మాణ, లాజిస్టిక్స్, ఆతిథ్య తదితర రంగాల్లో నైపుణ్యం కలిగిన మానవ వనరులకు డిమాండ్ పెరుగుతోందని, ఈ అవసరాలకు అనుగుణంగా మన యువతకు అంతర్జాతీయ ప్రమాణాలతో శిక్షణ అందించడం ఈ కేంద్రం ప్రధాన ఉద్దేశమని ఎమ్మెల్యే వాసు వివరించారు. ఈ కేంద్రం ద్వారా అభ్యర్థుల గుర్తింపు, కౌన్సెలింగ్, నైపుణ్య శిక్షణ, విదేశీ భాషల బోధన, నైపుణ్య పరీక్షలు, ధ్రువపత్రాల జారీతో పాటు వైద్య పరీక్షలు, వీసా ప్రక్రియలో సహాయం, విదేశాలకు వెళ్లే ముందు అవసరమైన అవగాహన కల్పించడం వంటి సేవలు ఒకే వేదికపై అందుబాటులోకి రావడం విశేషమన్నారు. ముఖ్యంగా విదేశాల్లో సురక్షితమైన, చట్టబద్ధమైన ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఈ విధానం దోహదపడుతుందని తెలిపారు. రాష్ట్రంలోని ఐటీఐలు, పాలిటెక్నిక్, నర్సింగ్, ఇంజినీరింగ్ కళాశాలలు, నైపుణ్యాభివృద్ధి సంస్థల మౌలిక సదుపాయాలను సమన్వయం చేసుకుంటూ యువతకు అవసరమైన శిక్షణ అందించడం ద్వారా వారి నైపుణ్యాలకు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నగరాన్ని విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలతో పాటు ఉపాధి, నైపుణ్యాభివృద్ధి రంగాల్లోనూ ముందంజలో నిలపాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వాసు పేర్కొన్నారు. ఇప్పటికే నగరంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, ఇప్పుడు అంతర్జాతీయ నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటుతో నగరానికి మరో ప్రత్యేక గుర్తింపు లభించనుందన్నారు. యువత కేవలం ఉద్యోగాల కోసం ఎదురుచూసే స్థాయి నుంచి అంతర్జాతీయ అవకాశాలను అందిపుచ్చుకునే స్థాయికి ఎదగాలని, అందుకు అవసరమైన నైపుణ్యాలు, శిక్షణ, మార్గదర్శకత్వం ఒకే వేదికపై అందుబాటులోకి రావడం ఎంతో సంతోషకరమని, రాజమహేంద్రవరం యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రపంచ స్థాయిలో తమ ప్రతిభను చాటుకోవాలని పిలుపునిచ్చారు. యువత భవిష్యత్తుకు బాటలు వేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర ప్రభుత్వానికి ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కొల్లు రవీంద్ర సోదరికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్సీ వై.వీ.బీ

రాజమహేంద్రవరం (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌కు మరో కేంద్రం నుంచి మరో కీలక ప్రాజెక్ట్ ఖాయమైంది. అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రానికి చెందిన యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే దిశగా కీలక ముందడుగు పడింది. కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక మంత్రిత్వ శాఖ ఎస్ఐఐసీ (స్కిల్ ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్) ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. ఈ ఎస్ఐఐసీ తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం బొమ్మూరులోని న్యాక్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్)– ఏఎస్‌టీఐ (అడ్వాన్స్‌డ్ స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్)లో ఏర్పాటుకానుంది. రాష్ట్ర యువతకు ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో పెరుగుతున్న మానవ వనరుల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందించేందుకు కేంద్రం దీనిని ఏర్పాటు చేయనుంది. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం విదేశాల్లో సురక్షితమైన, చట్టబద్ధమైన ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా.. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ ఇస్తుంది. ఈ సెంటర్ ద్వారా ప్రభుత్వం యువతకు అవసరమైన శిక్షణతో పాటుగా, సమగ్ర సేవలు అందిస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇంజినీరింగ్ కాలేజీలు, ఐటీఐలు, పాలిటెక్నిక్, నర్సింగ్ కాలేజీలు.. ఎన్ఏసీ నైపుణ్యాభివృద్ధి సంస్థల మౌలిక సదుపాయాల ద్వారా ఇంజినీరింగ్, లాజిస్టిక్స్, ఆతిథ్యం, నిర్మాణ, ఆరోగ్య సంరక్షణ వంటి ఆయా రంగాల్లో అంతర్జాతీయ ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా అడుగులు వేయనున్నారు.

కొల్లు రవీంద్ర సోదరికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్సీ వై.వీ.బీ

మచిలీపట్నం (చైతన్యరథం): రాష్ట్ర ఎక్సైజ్ మరియు మైనింగ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర సోదరి, దివంగత మాజీ మంత్రి నడికుదుటి నరసింహారావు సతీమణి నడికుదుటి శేష నాగమల్లీశ్వరి ఇటీవల స్వర్గస్తులైన నేపథ్యంలో ఎమ్మెల్సీ వై.వీ.బీ రాజేంద్రప్రసాద్ శుక్రవారం మచిలీపట్నంలోని వారి స్వగృహంలో పరామర్శించి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మంత్రి కొల్లు రవీంద్రని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మల్లీశ్వరి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని మాజీ ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం మాజీ మేయర్ మొటమర్రి బాబా ప్రసాద్, టీడీపీ నగర సాధికార రాష్ట్ర కన్వీనర్ జంపన శ్రీనివాస్, సయ్యద్ అజ్మతుల్లా, కౌన్సిలర్ అబ్దుల్ సగీర్, పరిమి సజిత్ తదితరులు పాల్గొన్నారు.



మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలు సమాజానికి స్ఫూర్తిదాయకం

●బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి, సమానత్వ సాధనకు పూలే చేసిన సేవలు చిరస్మరణీయం : కేశినేని శివనాథ్



విజయవాడ (చైతన్యరథం): ప్రముఖ సంఘ సంస్కర్త, సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ శనివారం విజయవాడలోని ఎంపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహాత్మా జ్యోతిరావు పూలే సమాజానికి చేసిన విశేష సేవలను, ఆయన ఆశయాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ... మహాత్మా జ్యోతిరావు పూలే భారతదేశ సామాజిక చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన మహోన్నత సంఘ సంస్కర్త అని కొనియాడారు. సమాజంలో నెలకొన్న కులవివక్ష, అసమానతలు, మూఢనమ్మకాలపై ఆయన అలుపెరుగని పోరాటం చేశారని పేర్కొన్నారు. అణగారిన వర్గాలు, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతే లక్ష్యంగా తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప సామాజిక దార్శనికుడని అన్నారు. ముఖ్యంగా మహిళా విద్యకు ప్రాధాన్యతనిస్తూ, బాలికలకు విద్యను అందించేందుకు తన సతీమణి సావిత్రిబాయి పూలేతో కలిసి విశేష కృషి చేశారని గుర్తుచేశారు. విద్య ద్వారానే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమని విశ్వసించి, అణగారిన వర్గాలకు విద్యావకాశాలు కల్పించేందుకు ఆయన చేసిన కృషి నేటి తరాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం, విద్య, మానవ హక్కుల కోసం మహాత్మా జ్యోతిరావు పూలే సాగించిన ఉద్యమ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీ చిన్ని పిలుపునిచ్చారు.

ఇద్దరు సీఐలు, ఆరుగురు ఎస్సైలు, 150 పోలీసుల బందోబస్తు

గండేపల్లి (చైతన్యరథం): ఎన్నికల వేళ 144, 30 సెక్షన్లు అమలులో ఉన్నాయని, ఏటువంటి అల్లర్లకు పాల్పడిన, గొడవలు సృష్టించినా కఠిన చర్యలు తీసుకోవాలని అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్ అన్నారు. గండేపల్లి పోలీస్ స్టేషన్ వద్ద ఎన్నికల్లో నిర్వహించే సిబ్బందికి, పోలీస్ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ.. 15 పంచాయతీల్లో 150 మంది పోలీసులతో పాటుగా ఇద్దరు సీఐలు, ఆరుగురు ఎస్సైలు పటిష్టబందోబస్తు నిర్వహించనున్నారన్నారు. సమస్యాత్మక గ్రామాలైన తాళ్లూరు, ఉప్పలపాడు, ఎన్టీ రాజపురం గ్రామాల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐలు తిరుపతిరావు, సూర్య అప్పారావు, ఎస్సై శివనాగబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా తీర్పును ఓర్వలేక బ్రహ్మానాయుడు అసత్య ప్రచారాలు

●చీఫ్ విప్ జీవీ ఆంజనేయులుపై ఎంఎన్ ప్రసాద్ వ్యాఖ్యలను ఖండించిన టీడీపీ నాయకులు



వినుకొండ (చైతన్యరథం): ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులుపై వైసీపీ నాయకుడు ఎంఎన్ ప్రసాద్ చేసిన వ్యాఖ్యలను తెలుగుదేశం పార్టీ (టీడీపీ) నాయకులు తీవ్రంగా ఖండించారు. స్థాయిని మరిచి నిరాధారమైన ఆరోపణలు చేస్తే తీవ్ర పరిణామాలు తప్పవని వారు హెచ్చరించారు. శనివారం వినుకొండలోని చీఫ్ విప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు మాట్లాడారు. వినుకొండలో రౌడీయిజాన్ని ప్రోత్సహించి, గతంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద గొడవలు, దాడులు సృష్టించడమే కాకుండా, తొడగొట్టి మీసాలు మెలేస్తూ రెచ్చగొట్టే చర్యలకు పాల్పడింది మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, ఆయన అనుచరుడైన ఎంఎన్ ప్రసాద్ అని టీడీపీ నాయకులు ఆరోపించారు. 30 ఏళ్లుగా ప్రజలకు సేవ చేస్తున్న జీవీ ఆంజనేయులు ఎన్నడూ రౌడీయిజాన్ని ప్రోత్సహించలేదని, గత ఐదేళ్ల వైసీపీ పాలనలో భూకబ్జాలు, దౌర్జన్యాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి రౌడీలను తయారు చేసింది బ్రహ్మనాయుడేనని విమర్శించారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో బ్రహ్మనాయుడు కవ్వింపు చర్యలకు పాల్పడటమే కాకుండా, నాటి సీఐ చిన్నమల్లయ్య, పోలీసులను అడ్డుపెట్టుకుని నామినేషన్లు వేసిన టీడీపీ అభ్యర్థులతో బలవంతంగా ఉపసంహరణ (విత్‌డ్రా) చేయించారని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఇటీవల ప్రశాంతంగా జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు కూటమి అభ్యర్థులను గెలిపించి అభివృద్ధికి పట్టం కట్టారని తెలిపారు. శావల్యాపురంలో వైసీపీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి జుజ్జూరి శ్రీరామ్మూర్తి (ఐరామ్మూర్తి) తన ఓటమిని జీర్ణించుకోలేక, కౌంటింగ్ హాల్ వద్ద అనుచరులను రెచ్చగొట్టి గొడవ సృష్టించారని స్పష్టం చేశారు. గొడవకు పాల్పడిన వారిని అదుపు చేసిన పోలీసులపై తప్పుడు ప్రచారం చేయడం తగదని అన్నారు. ప్రజా తీర్పును జీర్ణించుకోలేక బొల్లా బ్రహ్మనాయుడు చేస్తున్న ఆరోపణలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, అసత్య ప్రచారాలు మానుకోకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని టీడీపీ నాయకులు పేర్కొన్నారు.

హజ్ యాత్రికులకు కూటమి అండ : ఎమ్మెల్యే నసీర్

●ప్రతి హజీకి లక్ష రూపాయలు ప్రోత్సాహం... ఆరోగ్యం, భద్రత విషయాల్లో ప్రత్యేక శ్రద్ధ

●హజ్ యాత్రికులకు శిక్షణ కార్యక్రమం... హాజరైన ఎంపీ భాష్యం రామకృష్ణ, నగర మేయర్ లక్ష్మీఅపర్ణ, ఎమ్మెల్యే గళ్లా



గుంటూరు (చైతన్యరథం): పవిత్ర హజ్ యాత్రకు వెళ్తున్న వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ భరోసానిచ్చారు. స్థానిక మౌలానా అబుల్ కలాం ఆజాద్ షాదీఖానాలో రాష్ట్ర హజ్ కమిటీ ఆధ్వర్యంలో హజ్ యాత్రికులకు నిర్వహించిన ప్రత్యేక అవగాహన, శిక్షణ శిబిరానికి రాజ్యసభ సభ్యుడు భాష్యం రామకృష్ణ, నగర మేయర్ కోవెలమూడి లక్ష్మీఅపర్ణ, పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి,హజ్ కమిటీ చైర్మన్ హసన్ బాషాతో కలిసి ఎమ్మెల్యే నసీర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ... సీఎం నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లిం మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్‌ను పునరుద్ధరించడంతో పాటు, అక్కడి నుండి విమానాశ్రయానికి చేరుకునేందుకు రవాణా, బస ఏర్పాట్లను అత్యున్నత ప్రమాణాలతో కల్పిస్తున్నట్లు వివరించారు. యాత్రికుల ఆరోగ్య భద్రత దృష్ట్యా ఉచిత టీకాలు, వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు, సౌదీ అరేబియాలో కూడా తెలుగు మాట్లాడే వలంటీర్లు, వైద్య బృందాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి హజ్‌కు వెళ్లే ప్రతి హజీకి ప్రభుత్వం లక్ష రూపాయలు అందిస్తోందని చెప్పారు. రెండేళ్ల కాలంలో 333 మంది హజీలకు లక్ష చొప్పున అందించామని తెలిపారు. షాదీఖానాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు విడుదల చేశారన్నారు. ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనాల పెంపుతోపాటు గత ప్రభుత్వం పెండింగ్ లో ఉంచిన బకాయిలు సైతం అందించామని చెప్పారు. జీవితంలో అత్యంత పవిత్రమైన హజ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని, అల్లాహ్ ఆశీస్సులతో క్షేమంగా తిరిగి రావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. యాత్రలో పాటించాల్సిన నియమ నిబంధనలు, ఆరోగ్య జాగ్రత్తలపై శిక్షకులు అందించే సూచనలను ప్రతి ఒక్కరూ తప్పకుండా పాటించాలని కోరారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని మక్కా, మదీనాలో ప్రత్యేక ప్రార్థనలు చేయాలని ఆయన యాత్రికులను కోరారు.

నందిగామ గ్రామ పంచాయతీ ఎన్నికల పరిశీలకుడిగా మాజీమంత్రి నెట్టెం



నందిగామ (చైతన్యరథం): నందిగామ నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా సమన్వయంతో పనిచేసేందుకు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, నందిగామ నియోజకవర్గ గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రత్యేక పరిశీలకుడిగా మాజీ మంత్రి, కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాంని నియమించారు. ఈ నేపథ్యంలో నందిగామ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్యతో సమావేశమైన నెట్టెం రఘురాం... నియోజకవర్గంలోని గ్రామ పంచాయతీ ఎన్నికల పరిస్థితులు, మండలాల వారీగా పార్టీ బలాబలాలు, అభ్యర్థుల విజయావకాశాలు తదితర అంశాలపై చర్చించారు. అదేవిధంగా పార్టీ రాష్ట్ర కార్యాలయ నాయకులతోనూ ఎన్నికల పరిస్థితులపై వివరాలు పంచుకుని, సమన్వయంతో ముందుకు సాగేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. గత రెండు రోజులుగా నియోజకవర్గంలోని నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులతో మాట్లాడి, క్షేత్రస్థాయి రాజకీయ పరిస్థితులు, గ్రామాల వారీగా ఎన్నికల పరిస్థితులు, సర్పంచ్ అభ్యర్థుల ఎంపిక, అభ్యర్థుల విజయావకాశాలు, పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా కంచికచర్ల మండల పార్టీ అధ్యక్షులు కోగంటిబాబు, చందర్లపాడు మండల పార్టీ అధ్యక్షులు కోట వీరబాబు, వీరులపాడు మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ కుమార్, నందిగామ మండల పార్టీ అధ్యక్షులు వీరంకి వీరస్వామితో ఎన్నికల కార్యాచరణపై చర్చించి, గ్రామస్థాయిలో పార్టీ శ్రేణులంతా సమష్టిగా పనిచేసేలా సమన్వయం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా కొడవాటికల్లు గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మద్దినేని సావిత్రి విజయాన్ని కాంక్షిస్తూ గ్రామ నాయకులు, పార్టీ శ్రేణులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎన్నికల పరిస్థితులను సమీక్షించి, ప్రచార కార్యాచరణ, నాయకులు మరియు కార్యకర్తల బాధ్యతలపై చర్చించారు. కంచికచర్ల మండలం కీసర గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పరిటాల దివ్య విజయమే లక్ష్యంగా స్థానిక గ్రామ నాయకులు, పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశమై ఎన్నికల ప్రచారం, గ్రామస్థాయి సమన్వయం, నాయకుల బాధ్యతలు, ప్రచార కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు.

ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన దేవినేని ఉమా



రాజమండ్రి (చైతన్యరథం): బార్ కౌన్సిల్ వేడుకల్లో పాల్గొనేందుకు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం విచ్చేసిన తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు

అభినందనల వెల్లువ.. ఆత్మీయ పలకరింపులతో సందడిగా మేయర్ కార్యాలయం!

●నూతన మేయర్ లక్ష్మీ అపర్ణని కలిసేందుకు తరలివచ్చిన ప్రముఖులు, నాయకులు, అభిమానులు, శ్రేయోభిలాషులు!



గుంటూరు (చైతన్యరథం): గుంటూరు నగర మేయర్‌గా ప్రమాణ స్వీకారం చేసి నూతన బాధ్యతలు చేపట్టిన కోవెలమూడి లక్ష్మీ అపర్ణని అభినందించేందుకు మేయర్ ఛాంబర్‌కు పెద్ద సంఖ్యలో ప్రముఖులు, వివిధ సంఘాల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు తరలివచ్చారు. ఈ సందర్భంగా మేయర్‌ని ఆత్మీయంగా సత్కరించి, హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. పలువురు తమ కార్యక్రమాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను అందజేయగా, మరికొందరు వివిధ సమస్యలు, అభ్యర్థనలను మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. తనను కలిసేందుకు వచ్చిన ప్రతి ఒక్కరినీ మేయర్ లక్ష్మీ అపర్ణ ఆప్యాయంగా పలకరిస్తూ, వారి అభ్యర్థనలను ఆలకించారు. తనపై చూపిస్తున్న ప్రేమాభిమానాలకు, అందిస్తున్న శుభాకాంక్షలకు ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజల ఆత్మీయత.. శ్రేయోభిలాషుల ఆశీస్సులు.. అభినందనల సందడితో మేయర్ కార్యాలయంలో ప్రత్యేక సందడి నెలకొంది!

ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్‌కు బుద్దా వెంకన్న పరామర్శ



విజయవాడ (చైతన్యరథం): మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు సతీమణి వసంత హైమావతి మృతి పట్ల పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బుద్ధా వెంకన్న సంతాపం వ్యక్తం చేశారు. శనివారం వసంత నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. హైమావతి మృతికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. ఈ విషాద సమయంలో ఆ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, దివంగత వసంత హైమావతి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, రేపాల మోహన్‌రావు, ప్రభాకర్, కోగంటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో ప్రేమను పంచుతూ వందల మందికి స్ఫూర్తిగా నిలవాలి

●హజ్ యాత్రకు వెళ్లే ప్రతి ఒక్కరూ ప్రేమ, మానవత్వం, సేవాభావాన్ని జీవితాంతం ఆచరించాలి: ఎమ్మెల్యే గళ్లా మాధవి



హజ్ యాత్రకు వెళ్లే ప్రతి ఒక్కరూ ప్రేమ, మానవత్వం, సేవాభావాన్ని జీవితాంతం ఆచరిస్తూ, సమాజంలో ప్రేమను పంచుతూ వందల మందికి స్ఫూర్తిగా నిలవాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. శనివారం గుంటూరు పట్టాభిపురంలోని షాదీఖానాలో నిర్వహించిన హజ్ యాత్రికుల సమావేశానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మరియు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గళ్లా మాధవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హజ్ యాత్రకు వెళ్లనున్న యాత్రికులను ఉద్దేశించి ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ... హజ్ యాత్రకు వెళ్లేందుకు సిద్ధమైన మీ అందరినీ ఒకే వేదికపై కలుసుకోవడం, మీ ఆశీర్వాదాలు తీసుకోవడం మా అదృష్టంగా భావిస్తున్నానని, జీవితంలో ఒక్కసారైనా హజ్ యాత్ర చేయాలని ప్రతి ముస్లిం సోదరుడు, సోదరి కోరుకుంటారు. అలాంటి అత్యంత పవిత్రమైన యాత్రకు మీరు ఎంపిక కావడం నిజంగా భగవంతుడి ప్రత్యేక అనుగ్రహం. గుంటూరు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో యాత్రికులకు 40 రోజుల పాటు పవిత్ర ప్రదేశాల్లో గడిపే అవకాశం రావడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా పూలే దంపతుల విగ్రహాల ఏర్పాటు

మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమంలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు బీద రవిచంద్ర



నెల్లూరు (చైతన్యరథం): నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో, మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలతో టీడీపీ జిల్లా అధ్యక్షులు, శాసనమండలి సభ్యుడు బీద రవిచంద్ర నివాళులు అర్పించారు. షేక్ అబ్దుల్ అజీజ్, డూండీ రాకేష్, చేజర్ల వెంకటేశ్వర రెడ్డి, రూప్ కుమార్ యాదవ్, పాల్ శెట్టి, పిల్ రావు, ధర్మవరం సుబ్బారావు, కొమరి విజయ తదితరులు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలోనే బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమం, అభివృద్ధి పూర్తి స్థాయిలో అందుతోందని బీద రవిచంద్ర అన్నారు. బలహీనవర్గాలకు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా గౌరవప్రదమైన హోదా, అవకాశాలు కల్పించింది తెలుగుదేశం పార్టీయేనన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జ్యోతిరావు పూలే పేరుతో బీసీ భవనాలు, జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాల స్థాపనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రాజధాని అమరావతిలో జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాల ఏర్పాటు కోసం కూటమి ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని 42 మండల కేంద్రాలలో, మునిసిపాలిటీ కేంద్రాలలో జ్యోతిరావు పూలే విగ్రహాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. పూలే విగ్రహాల ఏర్పాటు కార్యాచరణపై బీసీ సంఘాల ప్రతినిధులు, కుల సంఘ నేతలు, ఉద్యోగ, విద్యార్థి, యువజన సంఘ నేతలతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. చాకలి ఐలమ్మ, ఒడ్డె ఓబన్న, నెల్లూరు జిల్లా వాసి, శాలివాహన కుటుంబంలో జన్మించిన కవయిత్రి ఆతుకూరి మొల్ల విగ్రహాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు చేశామన్నారు. స్వాతంత్ర సమరయోధులు, ఆంధ్రప్రదేశ్ తొలితరం నాయకులు సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహ ఏర్పాటు కోసం ఇదివరకే జిల్లా అధికారులను కలిశామని గుర్తు చేశారు. అట్టడుగు వర్గాలు, గిరిజనుల సంక్షేమం కోసం జీవితకాలం పనిచేసిన గొప్ప నాయకుడు, జిల్లా వాసి, గిరిజన గాంధీగా పేరొందిన వెన్నెలకంటి రాఘవయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. మాజీ రాష్ట్రపతి, మిస్సైల్ మాన్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహాన్ని నగరంలో ఏర్పాటు చేయాలని రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ గతంలో కోరారని, పూలే ఫౌండేషన్ ద్వారా ప్రముఖ బీసీ నేతలు, చరిత్రకారుల విగ్రహాల ఏర్పాటుకు అవసరమైన కార్యాచరణను ఈ నెల 20వ తేదీన సిద్ధం చేస్తున్నామన్నారు. పార్టీలకు అతీతంగా బీసీ, కుల, విద్యార్థి యువజన సంఘ నేతలను సమన్వయం చేసుకొని బీసీ ప్రముఖుల విగ్రహాలను జిల్లాలో ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.



చిరస్మరణీయుడు మహాత్మా పూలే

కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి

కావలి (చైతన్యరథం): మహాత్మా జ్యోతిబా ఫూలే వర్ధంతి సందర్భంగా స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాజిక సమానత్వం, అణగారిన వర్గాల అభ్యున్నతి, విద్యాభివృద్ధి మహిళా సాధికారత కోసం జ్యోతిబా ఫూలే చేసిన అవిరళ కృషిని స్మరించుకున్నారు. కుల వివక్ష లేని సమాజ నిర్మాణం కోసం ఆయన చేసిన పోరాటాలు ఎప్పటికీ చిరస్మరణీయమని కొనియాడారు. ఫూలే ఆశయాలు, ఆలోచనలు నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని, ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అరాచకాల కాకాణికి అభివృద్ధిని అడ్డుకోవడమే అలవాటు

సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శ



సర్వేపల్లి (చైతన్యరథం): అభివృద్ధి పనులను అడ్డుకోవడం మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి అలవాటుగా మారిందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు దోపిడీకి పాల్పడటం, అధికారం కోల్పోయిన తర్వాత అభివృద్ధి పనులకు లిటిగేషన్లు సృష్టించడం ఆయన రాజకీయ విధానమని ఆరోపించారు. పంచాయతీ ఎన్నికల్లో తాము బలపరిచిన అభ్యర్థులను గెలిపించి గ్రామాల అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వెంకటాచలం మండలం చెముడుగుంట, మనుబోలు మండలం కాగితాలపూరు, మనుబోలు పంచాయతీల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో సోమిరెడ్డి పాల్గొని మాట్లాడారు. ఇటీవల జరిగిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో సర్వేపల్లి ప్రజలు తమకు మద్దతుగా నిలిచి ఐదు ఎంపీపీలు, ఐదు జెడ్పీటీసీ స్థానాలను గెలిపించారని తెలిపారు. అదే మద్దతును పంచాయతీ ఎన్నికల్లోనూ కొనసాగించాలని కోరారు. కూటమి ప్రభుత్వంలో చిన్న పంచాయతీల్లోనూ కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని సోమిరెడ్డి పేర్కొన్నారు. ఇటీవల సాగునీటి కొరత ఏర్పడినప్పుడు కాగితాలపూరులో రూ.29 లక్షలతో యుద్ధప్రాతిపదికన పైపులైన్లు ఏర్పాటు చేసి పంటలను కాపాడామని చెప్పారు. గ్రామాల్లో కమ్యూనిటీ హాళ్లు, అంగన్‌వాడీ భవనాలు, తాగునీటి ట్యాంకులు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు నిర్మిస్తున్నామని వివరించారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రతి గ్రామంలోనూ ప్రజలకు కోట్లాది రూపాయల మేర లబ్ధి చేకూరుతోందన్నారు. పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను గ్రామాల అభివృద్ధికే ఖర్చు చేసేలా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పనులు చేయకుండానే ఇరిగేషన్ శాఖలో రూ.150 కోట్ల బిల్లులు చేసుకున్నారని సోమిరెడ్డి ఆరోపించారు. 20 వేల ఎకరాలకు పైగా సాగునీరు అందించాలనే లక్ష్యంతో డేగపూడి-బండేపల్లి కాలువ పనులను గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 35 శాతం పూర్తి చేశామని పేర్కొన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కమీషన్ల కోసం పనులను అర్ధంతరంగా నిలిపివేశారని, ఇందుకు కాకాణి గోవర్ధన్‌రెడ్డి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. మనుబోలులో డేగపూడి, బండేపల్లి కాలువ, పొదలకూరులో సోమశిల దక్షిణ కాలువ పనులను నిలిపివేశారని ఆరోపించారు. పొదలకూరులోని మెగా మినరల్ వాటర్ ప్లాంటు కూడా నిర్లక్ష్యం కారణంగా శిథిలావస్థకు చేరిందని విమర్శించారు. మనుబోలు మండలంలో జాతీయ రహదారి పక్కన ఉన్న 19 ఎకరాల భూమిని బినామీ పేర్లతో నమోదు చేసుకున్నారని, వీరంపల్లిలో హైస్కూల్ స్థలాన్ని ఆక్రమించారని కాకాణిపై సోమిరెడ్డి ఆరోపణలు చేశారు. అధికారంలో ఉన్నప్పుడు చేసిన పనులపై సమాధానం చెప్పకుండా ఇప్పుడు ఓట్లు ఎలా అడుగుతారని ప్రశ్నించారు. పంచాయతీలు ఏకగ్రీవమైతే రూ.15 లక్షలు, రూ.25 లక్షలు, రూ.50 లక్షల చొప్పున నిధులు వస్తాయని సోమిరెడ్డి తెలిపారు. అయితే ఆ నిధులు గ్రామాలకు అందకూడదనే ఉద్దేశంతో ఏకగ్రీవ ఎన్నికలకు కాకాణి అడ్డుపడ్డారని ఆరోపించారు. అభివృద్ధి పనులకు సహకరించే అభ్యర్థులను ప్రజలు ఆశీర్వదించాలని కోరారు.



నెల్లూరులో జెట్టింగ్, సక్షన్ మెషిన్ ట్రయల్ రన్ విజయవంతం

త్వరలో మంత్రి డాక్టర్ నారాయణ చేతుల మీదుగా ప్రారంభం

నెల్లూరు (చైతన్యరథం): నగరంలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను మరింత పటిష్ఠం చేసి, పారిశుద్ధ్య నిర్వహణను ఆధునికీకరించే దిశగా రీసైక్లింగ్ సదుపాయంతో కూడిన అత్యాధునిక జెట్టింగ్ అండ్ సక్షన్ వెహికల్ ట్రయల్ రన్‌ను శనివారం అజాద్ సెంటర్‌లో నిర్వహించారు. ఈ ఆధునిక యంత్రం అధిక పీడన నీటి ప్రవాహంతో భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్లలో పేరుకుపోయిన మట్టి, ఇసుక, ఇతర వ్యర్థాలను తొలగించడంతో పాటు, శక్తివంతమైన సక్షన్ వ్యవస్థ ద్వారా వాటిని బయటకు తీస్తుంది. రీసైక్లింగ్ సాంకేతికత ద్వారా వినియోగించిన నీటిని తిరిగి ఉపయోగించుకునే సదుపాయం కూడా ఇందులో ఉంది. దీంతో డ్రైనేజీ పైప్‌లైన్లలో అడ్డంకులను వేగంగా తొలగించడం, మురుగునీటి ఓవర్‌ఫ్లో సమస్యలను నియంత్రించడం, నీటి వినియోగాన్ని తగ్గించడం, పారిశుద్ధ్య కార్మికుల భద్రతను మెరుగుపరచడం సాధ్యమవుతుందని అధికారులు వివరించారు. ఈ ఆధునిక యంత్రాన్ని త్వరలోనే రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ప్రారంభించనున్నారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు సూచనల మేరకు 65వ డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ ధర్మవరం గణేష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ట్రయల్ రన్‌లో యూజీడీ సూపర్‌వైజర్ రాజేష్, టీడీపీ జనరల్ సెక్రటరీ కలవకుంట భాస్కర్, గౌరవ అధ్యక్షుడు సిద్ధకళాచారి, మైనారిటీ అధ్యక్షుడు ఫిరోజ్ భాయ్, యూనిట్ ఇన్‌చార్జ్ చందశేఖర్ అద్దంకి, కంచి కృష్ణ, పెరంబలం కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతమైన పాలన అందించండి

కొత్త సర్పంచులు, వార్డు మెంబర్లకు ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపు



రాప్తాడు (చైతన్యరథం): పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు ఎంతో నమ్మకంతో మరోసారి మనకు ఓటు వేసి గెలిపించారని, ఐదేళ్లపాటు సమర్థవంతమైన పాలన అందించాలని.. నూతన సర్పంచులకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత దిశా నిర్దేశం చేశారు. పంచాయతీ ఎన్నికలలో ఘనవిజయం సాధించిన నూతన ప్రజాప్రతినిధుల రాకతో శనివారం అనంతపురంలోని క్యాంప్ కార్యాలయం సందడిగా మారింది. నియోజకవర్గ పరిధిలోని మరూరు, కక్కలపల్లి, కాటిగానికాలువ, సింగంపల్లి, సింగంపల్లి తండా, పంపనూరు తండా, కొడిమి (జనసేన), కనగానపల్లి, కోనాపురం మరియు గంతిమర్రి గ్రామ పంచాయతీలలో కూటమి తరపున నూతనంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు మెంబర్లు ఆయా గ్రామాల టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే పరిటాల సునీతని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు మెంబర్లందరినీ ఎమ్మెల్యే సునీత శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి ప్రత్యేకంగా అభినందించి ఘనంగా సత్కరించారు. మరోవైపు, ఎన్నికల్లో తమకు పూర్తిస్థాయిలో మద్దతు తెలిపి, అండగా నిలిచి తమ గెలుపునకు కారణమైన ఎమ్మెల్యే పరిటాల సునీతని నూతన సర్పంచులు, ఆయా గ్రామాల నాయకులు ఘనంగా సత్కరించి తమ కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం నూతన ప్రజాప్రతినిధులను ఉద్దేశించి ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ.. "ప్రజలు ఎంతో నమ్మకంతో కూటమి బలపరిచిన మిమ్మల్ని సర్పంచులుగా, వార్డు మెంబర్లుగా గెలిపించారన్నారు. ఈ గెలుపు మనపై బాధ్యతను మరింత పెంచిందని.. గెలుపుతో ఎవరూ గర్వపడకుండా, రానున్న ఐదేళ్లపాటు గ్రామ ప్రజలకు సమర్థవంతమైన, పారదర్శకమైన పాలనను అందించాలని సూచించారు. గ్రామాలలో ఏ చిన్న సమస్య తలెత్తినా తక్షణమే స్పందించి ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని దిశానిర్దేశం చేశారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి నిధుల కొరత లేకుండా చూసే బాధ్యత తనదని, అందరూ సమన్వయంతో పనిచేసి గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.

ఓడిపోయిన అభ్యర్థులతో ప్రత్యేక భేటీ

మరోవైపు ఎన్నికలలో స్వల్ప తేడాతో ఓడిన కొన్ని గ్రామాల సర్పంచ్ అభ్యర్థులు కూడా అనంతపురం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీతని కలిశారు. వారితో ఎమ్మెల్యే ప్రత్యేకంగా సమావేశమై ధైర్యం చెప్పారు. ఓటమికి గల కారణాలను గ్రామాల వారీగా లోతుగా సమీక్షించారు. క్షేత్రస్థాయిలో ఎక్కడ తప్పు జరిగింది? ఓట్ల బదిలీలో ఏమైనా లోపాలు తలెత్తాయా? అన్న విషయాలపై ఆరా తీశారు. ముఖ్యంగా ఎన్నికల సమయంలో పార్టీ అభ్యర్థులకు వ్యతిరేకంగా ఎవరెవరు పనిచేశారు? వెన్నుపోటు రాజకీయాలకు పాల్పడిన వారు ఎవరు? అన్న పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓడిపోయిన అభ్యర్థులెవరూ నిరాశ చెందవద్దని, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే సునీత భరోసా ఇచ్చారు.. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ మండలాల టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

డీలిమిటేషన్‌తో ఏపీకి మేలు

పెరగనున్న రాజకీయ ప్రాతినిధ్యం, దక్షిణాది రాష్ట్రాల సీట్ల నిష్పత్తికి భరోసా, బీసీ, బీసీ మహిళలకు మరిన్ని అవకాశాలు మహిళా రిజర్వేషన్ల బిల్లుకు అన్ని పార్టీలు మద్దతివ్వాలి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్



తిరుపతి (చైతన్యరథం): డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లకు సంబంధించి కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాలు దేశ ప్రజాస్వామ్యంలో కీలక పరిణామాలని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గత కొద్ది నెలలుగా చేసిన కృషి, ఎన్డీయే భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్‌తో పాటు దక్షిణాది రాష్ట్రాలకు ప్రయోజనం కలిగే నిర్ణయాలు వచ్చాయని పేర్కొన్నారు. జనాభా ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు పార్లమెంట్ స్థానాలు తగ్గుతాయన్న ఆందోళన ఉందని నరసింహ యాదవ్ తెలిపారు. అయితే దేశంలోని అన్ని రాష్ట్రాల్లో సమానంగా 50 శాతం సీట్లు పెంచడం, 2051 వరకు ప్రస్తుత సీట్ల నిష్పత్తిని కొనసాగించే ప్రతిపాదనలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిందని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనలు అమలైతే ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ స్థానాలు 25 నుంచి 38కి, శాసనసభ స్థానాలు కూడా 50 శాతం పెరిగే అవకాశం ఉంటుందని వివరించారు. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించే దిశగా ఈ నిర్ణయాలు మార్గం సుగమం చేస్తాయని నరసింహ యాదవ్ అన్నారు. ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా, చంద్రబాబు నాయుడు దశాబ్దాలుగా మహిళా రాజకీయ ప్రాతినిధ్యం కోసం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఎవరి ప్రాతినిధ్యానికీ ఇబ్బంది కలగకుండా మహిళలకు చట్టసభల్లో మరిన్ని అవకాశాలు కల్పించే దిశగా ముందడుగు పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రతిపాదనల వల్ల ఆంధ్రప్రదేశ్‌లో బీసీ వర్గాలకు, ముఖ్యంగా బీసీ మహిళలకు ఎంపీ, ఎమ్మెల్యేలుగా పోటీ చేసే అవకాశాలు మరింత పెరుగుతాయని నరసింహ యాదవ్ అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా ఉన్న బీసీ సోదరులు కూడా ఈ బిల్లుకు మద్దతుగా ఉన్నారని తెలిపారు. మహిళలు, వెనుకబడిన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం పెరగడం ప్రజాస్వామ్యాన్ని మరింత విస్తృతం చేస్తుందని అన్నారు. నవంబర్ 30 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ల బిల్లుకు రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలని తెలుగుదేశం పార్టీ తరపున కోరుతున్నట్లు నరసింహ యాదవ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలతో పాటు దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యానికి భరోసా కల్పించే అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషికి సహకరించాలని పిలుపునిచ్చారు.

సుగవాసికి శుభాకాంక్షల వెల్లువ

రాయచోటి (చైతన్యరథం): అన్నమయ్య జిల్లా పరిషత్ చైర్మన్, రాజంపేట పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షు సుగవాసి ప్రసాద్ బాబును రాయచోటిలోని టీడీపీ కార్యాలయంలో పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామస్థాయి నాయకులు, సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొత్తకోట మున్సిపల్ అభ్యర్థి కుడుం శ్రీనివాసులు, సుండుపల్లి మండలం రాయవరం గ్రామం సర్పంచ్ భర్త శంకర్,పెదినేనికాల్వ గ్రామ సర్పంచ్ ఓబులయ్య నాయుడు, గ్రామ నాయకులు, నందలూరు మండలం టంగుటూరు గ్రామ సర్పంచ్ గుజ్జల ఈశ్వరయ్య నాయకులు, కార్యకర్తలు, రాయచోటి పట్టణానికి చెందినఎన్నెమ్ యూపీ ప్రతినిధులు ప్రసాద్ బాబును కలిశారు. నూతనంగా అన్నమయ్య జిల్లా పరిషత్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ బాబు అందరితో ఆప్యాయంగా ముచ్చటిస్తూ, తనపై చూపిస్తున్న అభిమానానికి, ఆదరణకు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా అన్నమయ్య జిల్లా సమగ్ర అభివృద్ధికి, గ్రామీణ ప్రాంతాల ప్రగతికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.



అరాచకంగా ఓడించారు

వీలేకరుల సమావేశంలో తెదేపా సర్పంచి అభ్యర్థిని రోజా ఆవేదన



కమలానగర్ (చైతన్యరథం): తమకు న్యాయం జరిగే వరకూ పోరాడుతామని తెదేపా సర్పంచి అభ్యర్థిని రోజా పేర్కొన్నారు. ఎన్నికల్లో రీకౌంటింగ్ కోరితే ఆర్వో కాంతరాజు, ఎస్సై వైకాపా నాయకులకు సహకరించారని తిమ్మాపురం తెదేపా సర్పంచ్ అభ్యర్థిని రోజా ఆరోపించారు. అనంతపురంలోని ప్రెస్ క్లబ్లో శనివారం తెదేపా మహిళా నేతలు, తన భర్త నగేష్ కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. 14 ఓట్ల తేడాతో కళ్యాణదుర్గం నియోజకవర్గం కంబదూరు మండలం తిమ్మాపురం గ్రామపంచాయతీలో తాను ఓడిపోయినట్లు ఆర్వో ప్రకటించారన్నారు. కౌంటింగ్ కేంద్రంలో రీకౌంటింగ్ చేయాలని ఆర్వోను కోరితే, వైకాపా నాయకులకు మద్దతు ఇస్తూ తమను ఓడిపోయేలా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కౌంటింగ్ కేంద్రంలోని తనతోపాటు తన భర్తను చంపుతామని బెదిరించారన్నారు. రీకౌంటింగ్కు సహకరించడం లేదని జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేశామన్నారు. ఈ విషయంలోనే ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆర్వోకు ఫోన్ చేసి మాట్లాడారన్నారు. దీనిపై వైకాపా నాయకులతో కలిసి ఆర్వో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అధికారులు ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించకుండా వైకాపా నేతలకు ఎలా సహకరిస్తారని ప్రశ్నించారు. తమకు న్యాయం కావాలని డిమాండ్ చేశారు. కౌంటింగ్ కేంద్రంలోని తమపై దాడి చేసి బెదిరింపులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆస్ట్రేలియా ఎన్నికల్లో ప్రవాస తెలుగు వ్యక్తి తొలి విజయం



ఆస్ట్రేలియా: ఆస్ట్రేలియా రాజకీయాల్లో ప్రవాసీ తెలుగు వ్యక్తి అరుదైన ఘనత సాధించారు. విక్టోరియా రాష్ట్ర ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రాజారెడ్డి (రాజా రమేష్‌రెడ్డి) ఘన విజయం సాధించారు. పాయింట్ కుక్ నియోజక వర్గం నుంచి లిబరల్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన.. సిటింగ్ ప్రతినిధిపై స్పష్టమైన ఆధిక్యంతో గెలుపొందారు. తద్వారా విక్టోరియా శాసనస భకు ఎన్నికైన తొలి తెలుగు వ్యక్తిగానూ ఘనత దక్కించుకున్నారు. విక్టోరియా రాష్ట్రంలోని పాయింట్ కుక్ నియోజకవర్గం దశాబ్దాలుగా లేబర్ పార్టీకి కంచుకోట. తాజాగా ఈ స్థానాన్ని లిబరల్ పార్టీ చేజిక్కించుకోవడంలో రాజారెడ్డి కీలక పాత్ర పోషించారు. అతడి విజయంపై మెల్‌బోర్న్‌లోని ప్రవాసీ తెలుగు సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. రాజారెడ్డి స్వస్థలం రాజమండ్రిలో కుటుంబసభ్యులు, బంధుమిత్రులు ఆనందంలో మునిగిపోయారు. ఆస్ట్రేలియా చట్టసభల్లో తొలిసారి ఓ తెలుగు వ్యక్తి అడుగుపెట్టడం యావత్ తెలుగు జాతికి గర్వకారణమన్నారు.

జీడబ్ల్యూటీసీఎస్ ఉపాధ్యక్షుడు యష్ బొడ్డులూరికి అభినందనల వెల్లువ



అమెరికా: అమెరికాలో మొట్టమొదటి తెలుగు సంస్థగా 54 ఏళ్ల ఘనచరిత్ర కలిగిన గ్రేటర్ వాషింగ్టన్ తెలుగు కల్చరల్ సంఘం (జీడబ్ల్యూటీసీఎస్) సంస్థకు ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన యష్ బొడ్డులూరిని పలువురు అభినందించారు. ఐదు దశాబ్దాలకు పైగా తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను అమెరికాలో నిలబెట్టిన ఈ ప్రతిష్ఠాత్మక సంస్థలో బాధ్యత దక్కడం గర్వకారణమని కొనియాడారు. గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గానికి చెందిన యష్ బొడ్డులూరి యువకుడిగా, ఉన్నత విద్యావంతుడిగా, టీడీపీ నాయకుడిగా అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీలో పార్టీ కార్యక్రమాలను చురుగ్గా నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తనదైన గొంతు వినిపిస్తున్నారు. ఈ కొత్త బాధ్యతతో ఆయన సేవా ప్రయాణం మరింత విస్తరించాలని, తెలుగు ప్రజలకు, సమాజానికి మరిన్ని సేవలు అందిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వాషింగ్టన్‌లోని ప్రవాసాంధ్రులు ఆకాంక్షించారు.

జీఆర్‌టీఏ ఆధ్వర్యంలో 'లేడీస్ నైట్'





అమెరికా: గ్రేటర్ రిచ్‌మండ్ తెలుగు అసోసియేషన్ (జీఆర్‌టీఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన 'లేడీస్ నైట్' వేడుకలు అత్యంత ఉత్సాహంగా విజయవంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా అనేకానేక సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించారు. ఇక్కడికి విచ్చేసినవారందరూ కూడా ఎంతో ఉత్సాహంగా కార్యక్రమాన్ని ఎంజాయ్ చేశారు. ఈ వేడుక విజయవంతం కావడానికి అనేక మంది సహాయ సహకారాలు అందించారు. ఈ కార్యక్రమానికి నవసర టీ, వెజ్, నాన్ వెజ్ స్టార్టర్లతో పాటు రుచికరమైన చికెన్ బిర్యానీని కూడా అందించారు. అలాగే తావా వాళ్లు రుచికరమైన వెజ్ బిర్యానీ, నూడుల్స్, స్వీట్లను కూడా సమకూర్చారు. మరోవైపు నవరస, తావా, మార్కెట్ కేఫ్ విజేతలు, అతిథుల కోసం గిఫ్ట్ కార్డులను కూడా స్పాన్సర్ చేశారు. జీఆర్‌టీఏ కమ్యూనిటీ పట్ల దాతలు చూపుతున్న నిరంతర ఆదరణ, ప్రోత్సాహం ఎంతో అభినందనీయమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సాయంత్రాన్ని ఇంత ప్రత్యేకంగా తీర్చిదిద్దడానికి సమష్టిగా కృషిచేసిన వాలంటీర్లు, కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న సభ్యులు, కార్యవర్గ సభ్యులకు జీఆర్‌టీఏ అధ్యక్షులు జయపాల్ కాసర్ల, టీమ్ జీఆర్‌టీఏ తరఫున పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

జీడబ్ల్యూటీసీఎస్ నూతన కార్యవర్గం ఎంపిక

అమెరికా: గ్రేటర్ వాషింగ్టన్ తెలుగు కల్చరల్ సంఘం (జీడబ్ల్యూటీసీఎస్) నూతన కార్యవర్గం ఏర్పాటైంది. గ్రేటర్ వాషింగ్టన్ తెలుగు కల్చరల్ సంఘం అధ్యక్షునిగా సుశాంత్ మన్నె ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ బృందం మొత్తానికి కమిటీ ప్రతినిధులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా సుశాంత్ మన్నె, ఉపాధ్యక్షుడు (సంస్థాగత)గా యశస్వి బొడ్డులూరి, ఉపాధ్యక్షురాలు (సాంస్కృతిక)గా శ్రీవిద్య సోమ, ఉపాధ్యక్షుడు (యూత్)గా యువ సిద్ధార్థ బోయపాటి, కార్యదర్శి (సంస్థాగత)గా భానుప్రకాష్ మాగులూరి, కార్యదర్శి (సాంస్కృతిక)గా పావని పూదోట, కోశాధికారి (సంస్థాగత)గా శ్రీనివాస్‌బాబు గంగ, సంయుక్త కోశాధికారిగా సూర్యతేజ కోసరాజు, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌గా యుగంధర్ ముక్కామల, కృష్ణ గుడిపాటి, పద్మజ బెవర, అశ్విన్ పుప్పాల ఎంపికయ్యారు. 2027-2028 పదవీకాలానికి కూడా తమ సేవలను కొనసాగిస్తున్న మా బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు ఉమాకాంత్ రఘుపతి, శివాజీ మేడికొండకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. 2027-2028 నూతన బృందం తమ బాధ్యతలలో ఘన విజయం సాధించాలని ప్రతినిధులు పేర్కొన్నారు.



దుబాయిలో తెలుగు సీఏల వనభోజనాలు



దుబాయి: మహాభారతంలో నారద మహర్షి కాలం మొదలు నేటి వరకూ ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నులను నిరంతరం పర్యవేక్షిస్తూ కచ్చితమైన ప్రశ్నలడిగే చార్టర్డ్ అకౌంటెంట్ల పాత్ర విలక్షణమైనది. సరళీకృత దుబాయి మహానగర ఆర్థిక వ్యవస్థలో తెలుగు ప్రవాసీ చార్టర్డ్ అకౌంటెంట్లు తమకంటూ ఒక ప్రత్యేకతను కలిగి ఉన్నారు. నిరంతరం లెక్కల్లో మునిగి తేలే వీరు ఆదివారం మొక్కల మధ్య చెట్ల కింద ఉల్లాసంగా గడిపేందుకు రెక్కలు కట్టుకొని వాలారు. దుబాయిలోని తెలుగు చార్టర్డ్ అకౌంటెంట్ల సమాజం నిర్వహించిన కార్తీక మాసం వన భోజనాల కార్యక్రమం ఆధ్యాత్మికతో పాటు వినోదభరితంగా జరిగింది. దేవతా వనాల మధ్య వేద శ్లోకాలతో, దీపారాధనతో ఆధ్యాత్మికత వెల్లివిరిసిన ఈ కార్యక్రమానికి తెలుగు వారి ఆత్మీయత కూడా తోడు కావడంతో సభికులు పరవశించిపోయారు. కార్యక్రమంలో దుబాయిలోని భారతీయ కాన్సుల్ జనరల్ ఇ. విష్ణువర్ధన్‌రెడ్డి కూడా ప్రత్యేక శ్రద్ధతో పాల్గొనడంతో అందరు ఆనందించారు. హనుమత్ కుమార్, గోపి ఆరె, సురేంద్రనాయుడు, బలరాం వుచ్చిడి, శ్రీనివాసరావు ఎడరా, శ్రీనివాసరావు చెరుకూరి, రామకృష్ణ సుబ్రమణ్యం, జయకృష్ణ పత్తిపాటి, వెంకట్‌లు కార్యక్రమ నిర్వహణలో సహకరించినట్లుగా నిర్వాహకులు తెలిపారు. దుబాయి, ఇతర ఎమిరేట్లలో పని చేస్తున్న అనేకమంది సీఏలు కుటుంబసమేతంగా వచ్చి వనభోజనాలు చేసినట్లుగా కూడా వారు పేర్కొన్నారు.



గ్రేటర్ డెలావేర్ వ్యాలీ తెలుగు సంఘం ఆధ్వర్యంలో

సంక్రాంతి సంబరాలకు ఆహ్వానం



అమెరికా: గ్రేటర్ డెలావేర్ వ్యాలీ తెలుగు సంఘం (టీఏజీడీవీ) ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించేందుకు సమాయత్తం అవుతున్నారు. ఇందులో భాగంగానే జనవరి 23న ఈ సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు గ్రేటర్ డెలావేర్ వ్యాలీ తెలుగు సంఘం ఓ ఫ్లయర్‌ను విడుదల చేసింది. జనవరి 23వ తేదీన మధ్యాహ్నం 2:00 గంటల నుంచి ఈ వేడుకలు ప్రారంభం అవుతున్నాయి. E.N.Peirce Middle school, 1314 burke rd, west chester PA 19380 వేదికగా ఈ వేడుకలు నిర్వహిస్తున్నారు. గ్రేటర్ డెలావేర్ వ్యాలీ తెలుగు సంఘం అధ్యక్షుడు హరీశ్ అన్నాబత్తిన సారథ్యంలో సురేశ్ బొందుగుల (వైస్ ప్రెసిడెంట్), శివ అనంతుని (సెక్రెటరీ), మధు బూదాటి (ట్రెజరర్), లవకుమార్ ఐనంపూడి (జాయింట్ సెక్రెటరీ), స్వాతి కొండేటి (జాయింట్ ట్రెజరర్) ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరగనున్నాయి. సంక్రాంతి అనేది ఆంధ్రులకు అతిపెద్ద ముఖ్యమైన పండగ అని, దీనిని అందరూ కలిసి జరుపుకోవడం ద్వారా మరిచిపోలేని అనుభూతులను మిగిల్చుకోవడానికి అవకాశం ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఇందులో భాగంగానే ముందుగానే తేదీని ప్రకటించామని, అందరూ ఈ తేదీని సేవ్ చేసుకుని సంక్రాంతి సంబరాలకు తప్పకుండా రావాలని ఆహ్వానిస్తున్నారు. మరిన్ని వివరాలకు www.tagdv.com వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చును.

తానా ఆధ్వర్యంలో 'శివ-శంభో స్వయంభో'

అమెరికా: నిరంతరం సామాజిక, సేవా కార్యక్రమాలతో సేవ చేస్తున్న సంస్థ తాఎ అమెరికాలో వైభవంగా 'శివ– శంభో స్వయంభో' లైవ్ స్పెక్టాకిల్ నిర్వహించేందుకు సిద్ధమైంది. సంగీతం, నృత్యం, నాటకం, స్టేజ్‌క్రాఫ్ట్‌ల మేళవింపుతో కూడిన ఒక అద్భుతమైన లైవ్ స్పెక్టాకిల్ డిసెంబరు 6న మధ్యాహ్నం 3:00 గంటల నుంచి సాయంత్రం 6:00 గంటల వరకూ నిర్వహిస్తున్నారు. విల్లార్డ్ మిడిల్ స్కూల్, 40915 బ్రాడాక్ రోడ్, ఆల్డీ, వీఏ 20105 వేదికగా కార్యక్రమం జరగనుంది. కార్యక్రమాన్ని "కళావేదిక" వారు ప్రొడ్యూస్ చేస్తుండగా... "నాట్యమార్గం– ఇంద్రాణీ" సహకారంతో చేస్తున్నారు. తానా అధ్యక్షుడు నరేన్ కొడాలి, కల్చరల్ కోఆర్డినేటర్ సాయి సుధా పాలుడుగు నేతృత్వంలో కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

లోక్‌సభ పరిశీలనకు డీలిమిటేషన్ బిల్లు

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సిఫార్సు



నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన డీలిమిటేషన్ బిల్లును లోక్‌సభ పరిశీలనకు తీసుకోవాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సిఫార్సు చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన శాసన ప్రక్రియలో ఇది కీలక ముందడుగుగా మారింది. ఈ నెల 30వ తేదీ నుంచి నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ప్రారంభం కానున్నాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 117(3) కింద రాష్ట్రపతి ఈ సిఫార్సు చేసినట్టు లోక్‌సభ సచివాలయం శనివారం తెలిపింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 117(3) ప్రకారం కొన్ని కీలక బిల్లులను పార్లమెంట్‌లో ఆమోదించడానికి ముందు రాష్ట్రపతి సిఫార్సు అవసరం. ఇది రాజ్యాంగపరమైన ప్రక్రియలో భాగం. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన కొత్త విధానం ప్రకారం లోక్‌సభ గరిష్ఠ సభ్యుల సంఖ్యను 550 నుంచి 850కి పెరిగే అవకాశం ఉంది. ఇందులో రాష్ట్రాల నుంచి గరిష్ఠంగా 815 మంది, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 35 మంది ప్రాతినిధ్యం వహించే అవకాశం ఉంది. అలాగే రాష్ట్రాల శాసనసభల్లో సభ్యుల గరిష్ఠ సంఖ్యను 500 నుంచి 650కి పెంచే ప్రతిపాదన కూడా ఉంది. మొత్తం మీద పార్లమెంట్, రాష్ట్రాల శాసనసభల్లో ప్రస్తుత స్థానాల సంఖ్యను 50 శాతం పెంచాలన్నది కేంద్రం ప్రణాళిక. లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కేంద్రం ఈ ప్రతిపాదనలను ముందుకు తీసుకొచ్చింది. నియోజకవర్గాల పునర్విభజన ద్వారా మహిళలకు రిజర్వ్ చేసే స్థానాలను గుర్తించి, 2029 సాధారణ ఎన్నికల నాటికి ఈ విధానాన్ని అమల్లోకి తీసుకురావాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యం.

మహిళా రిజర్వేషనపై

మాది ముందడుగే

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టీకరణ



పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మోదీ 'ఎక్స్' ద్వారా ఈ ప్రకటన చేశారు. మహిళా రిజర్వేషన్ల అమలుతో ముడిపడిన నియోజకవర్గాల పునర్విభజన బిల్లుపై కేంద్ర ప్రభుత్వం మరోసారి ముందడుగు వేస్తున్న తరుణంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మహిళలకు చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలన్న పోరాటం దశాబ్దాలుగా కొనసాగుతోందని మోదీ పేర్కొన్నారు. ఈ లక్ష్య సాధన కోసం తాను కూడా ఎన్నో ఏళ్లుగా కృషి చేస్తున్నానని తెలిపారు. దేశంలోని అనేక మంది మహిళలు ఈ అంశంపై తనకు లేఖలు రాశారని, వ్యక్తిగతంగా కూడా తమ ఆకాంక్షలను వెల్లడించారని చెప్పారు. మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన కొత్త బిల్లులను నవంబరు 30 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో చర్చకు తీసుకురానున్నారు. నారీశక్తికి ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. పార్లమెంట్‌తో పాటు రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో ఎలాంటి అడ్డంకులు ఎదురైనా వాటిని తొలగిస్తామని భరోసా ఇచ్చారు. మహిళలకు రాజకీయాల్లో మరింత ప్రాతినిధ్యం కల్పించాలన్న లక్ష్యం నుంచి వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

నారీశక్తికి అగ్రతాంబూలం

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వెల్లడి



నారీ శక్తి వందన్ చట్టంతో మహిళలకు రాజకీయంగా కొత్త అవకాశాలు రానున్నాయని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. నారీ శక్తికి రాజకీయాల్లో పెద్దపీట వేస్తున్నామని ఉద్ఘాటించారు. ఎన్నికైన ప్రజాప్రతినిధుల వ్యవస్థలో మహిళలకు మరింత ప్రాధాన్యం కల్పించడం ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వ నిబద్ధత అని పేర్కొన్నారు. శనివారం ఢిల్లీ వేదికగా మీడియాతో అమిత్ షా మాట్లాడారు. ప్రధాని నాయకత్వంలో నిన్న కేంద్ర క్యాబినెట్ 132వ రాజ్యాంగ సవరణ బిల్లుకు ఆమోదం తెలిపిందని తెలిపారు. దశాబ్దాలుగా మహిళలు ఎదురుచూస్తున్న 33 శాతం రిజర్వేషన్లు సాకారం కానున్నాయని పేర్కొన్నారు. లోక్‌సభతో పాటు రాష్ట్రాల శాసనసభల్లోనూ మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు కానున్నాయని వెల్లడించారు. నారీ శక్తి వందన్ చట్టం ద్వారా మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యంలో కీలక అవకాశాలు వస్తాయని అమిత్ షా వివరించారు. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల శాసనసభల్లో కనీసం మూడో వంతు మహిళల ప్రాతినిధ్యం కల్పించాలని అన్నారు. మహిళల భాగస్వామ్యంతో ప్రభుత్వ విధానాలు మరింత సమ్మిళితంగా, ప్రజలకు చేరువగా మారుతాయని చెప్పుకొచ్చారు. లోక్‌సభలో మహిళల ప్రాతినిధ్యం పెరగడం వల్ల విధాన రూపకల్పన, చట్టాల తయారీ, జాతీయ ప్రాధాన్యతల నిర్ణయంలో కొత్త కోణం ఆవిష్కృతమవుతుందని తెలిపారు. మహిళలను పాలనలో బలమైన భాగస్వాములుగా మార్చే ఈ చారిత్రాత్మక కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలని అమిత్ షా కోరారు.

మాజీ న్యాయమూర్తుల పర్యవేక్షణలో ...

తిరుపరంకుండ్రం కొండపై

దేదీప్యంగా వెలిగిన కార్తీక దీపం

తమిళనాడులోని మదురై తిరుపరంకుండ్రం కొండపై కార్తీక దీపం వెలిగింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కొండపై ఉన్న దీపతూన్ (రాతి స్తంభం) వద్ద శనివారం సాయంత్రం 5 గంటలకు దీపాన్ని వెలిగించారు. సుప్రీంకోర్టు నియమించిన మద్రాస్ హైకోర్టు మాజీ న్యాయమూర్తులు జస్టిస్ ఎస్. వైద్యనాథన్, జస్టిస్ వి. పార్థిబన్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ వేడుక కోసం కొండపై భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. కేంద్ర రిజర్వ్ పోలీసు బలగాలు (సీఆర్‌పీఎఫ్) భద్రతా బాధ్యతలు చేపట్టాయి. ఈ వేడుకను చూసేందుకు సాధారణ భక్తులకు కొండపైకి వెళ్లేందుకు అనుమతి ఇవ్వలేదు.

అధికారికంగా అనుమతి పొందిన 50 మంది భక్తులకు మాత్రమే దీపం వెలిగించే కార్యక్రమాన్ని వీక్షించే అవకాశం కల్పించారు. నవంబరు 24న జరిగిన కార్తీక దీపోత్సవం సందర్భంగా ఉచ్చి పిళ్లయార్ ఆలయం సమీపంలోనే మహాదీపాన్ని వెలిగించారు. దీపతూన్ వద్ద కూడా దీపం వెలిగించాలని ఇచ్చిన ఆదేశాలను అమలు చేయలేదన్న అంశం వివాదానికి దారితీసింది. దీనిపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంది. నవంబర్ 27న తమిళనాడు ప్రభుత్వానికి ధిక్కార నోటీసులు జారీ చేసింది. గతంలో ఇచ్చిన ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా, బహిరంగంగా ఉల్లంఘించారని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. నవంబర్ 28న దీపతూన్ వద్ద దీపం వెలిగించాలని మరోసారి ఆదేశించింది. ఆలయ పాలక మండలిని తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. దీపం వెలిగించే కార్యక్రమం పర్యవేక్షణ కోసం మద్రాస్ హైకోర్టు మాజీ న్యాయమూర్తులు శనివారం ఉదయం చెన్నై నుంచి మదురై చేరుకున్నారు. ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం దీపం వెలిగించేందుకు అవసరమైన ఏర్పాట్లను పరిశీలించారు.



మా రాజకీయ పిచ్‌పైకొచ్చి ఆడండి

అఖిలేశ్‌కు ఆదిత్యనాథ్ పిలుపు



ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో అయోధ్య రామమందిరం అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ డిసెంబర్ 12న అయోధ్య రామమందిరాన్ని సందర్శించనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అఖిలేశ్ యాదవ్ తమ రాజకీయ పిచ్‌పైకి వచ్చి ఆడాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. అయితే అయోధ్యకు వెళ్లే ముందు కరసేవకులపై కాల్పుల ఘటనకు సంబంధించి హిందువులకు క్షమాపణ చెప్పాలని సూచించారు. రామమందిర ఉద్యమాన్ని గతంలో వ్యతిరేకించిన వారే ఇప్పుడు అయోధ్యకు వెళ్లాలని అనుకోవడం ఆసక్తికరమని సీఎం యోగి అన్నారు. 1990లో అయోధ్యలో రామమందిర నిర్మాణ ఉద్యమం సందర్భంగా కరసేవకులపై పోలీసులు కాల్పులు జరిపిన ఘటనను యోగి ప్రస్తావించారు. అప్పట్లో సమాజ్‌వాదీ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉందని పేర్కొన్నారు. రామమందిరం కోసం నినాదాలు చేసిన కరసేవకులపై లాఠీచార్జి, కాల్పులు జరిగాయని ఆరోపించారు. అయోధ్య రామమందిరాన్ని సందర్శించాలనుకుంటే ముందుగా ఆ ఘటనకు సంబంధించి రామభక్తులకు అఖిలేశ్ క్షమాపణ చెప్పాలని యోగి డిమాండ్ చేశారు. ఇటీవల అఖిలేశ్ యాదవ్ గోరఖ్‌పూర్ పర్యటనను కూడా యోగి ప్రస్తావించారు. బుల్డోజర్ గురించి మాట్లాడటం సులభమే కానీ దాన్ని నడపాలంటే ప్రత్యేకమైన సంకల్పబలం ఉండాలని వ్యాఖ్యానించారు. బుల్డోజర్ స్టీరింగ్ పట్టుకోవడం అందరికీ సాధ్యం కాదంటూ అఖిలేశ్‌పై విమర్శలు చేశారు. రాబోయే ఎన్నికల్లోనూ రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ, దాని మిత్రపక్షాలు విజయం సాధిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ వరుసగా మూడోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వారణాసి శాశ్వతమైన నగరమని, భారత రాజకీయాల్లో బీజేపీ కూడా శాశ్వతమైన రాజకీయ శక్తిగా కొనసాగుతుందని వ్యాఖ్యానించారు.

ఇటలీలో బురఖాపై నిషేధానికి ఆమోదం

ఇటలీ: బురఖా, నిఖాబ్‌లపై ఇటలీ ప్రభుత్వం నిషేధం విధించింది. బురఖా, నిఖాబ్‌లతో ముఖాన్ని పూర్తిగా కప్పుకోవ డంపై ఇటలీ పార్లమెంటు ఆంక్షలు విధించింది. పాఠశాలల్లో నిర్వహించే కార్య క్రమాల సమయంలో విద్యార్థుల ముఖం స్పష్టంగా కనిపించాలని, వారి గుర్తింపును నిర్ధారించేందుకు వీలుగా ఉండాలని స్పష్టంచేసింది. 'డిక్రీ స్కూలా'లో భాగంగా తీసుకొచ్చిన ఈ నిబంధనలకు ఇటలీ పార్లమెంటు ఆమోదం తెలిపింది. ఈ ఏడాది సెప్టెంబర్ 30న జారీ చేసిన డిక్రీ లా 170లో ఈ నిబంధనలను పొందు పరిచింది. దీనిపై నిర్వహించిన ఓటింగ్‌లో దిగువ సభలో 142మంది సభ్యులు అనుకూలంగా, 112మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. నలుగురు తటస్థంగా ఉన్నారు. అనంతరం ఈనెల 20న సెనేట్ కూడా ఈ బిల్లుకు ఆమోదం తెలిపింది. కొత్త నిబం ధనల ప్రకారం పాఠశాలల కార్యకలాపాల్లో పాల్గొనే విద్యార్థులు తమ ముఖాన్ని కప్పరాదు. ముఖాన్ని



పూర్తిగా లేదా గుర్తింపును అడ్డుకునే బురఖా, నిఖాబ్‌లకు ఈ ఆంక్షలు వర్తిస్తాయి. అయితే తల (హెడ్), మెడను మాత్రమే కప్పి ముఖాన్ని కనిపించేలా ఉంచే హిజాబ్‌కు ఈ నిబంధనల నుంచి మినహాయింపు ఇచ్చారు. నిబంధనలను ఉల్లంఘిస్తే గరిష్టంగా వెయ్యి యూరోల వరకు జరిమానా విధించవచ్చు. విద్యార్థులు మైనర్లయితే వారి తల్లిదండ్రులు లేదా సంరక్షకులను బాధ్యులుగా చేస్తారు. పాఠ శాలల్లో విద్యార్థుల గుర్తింపును సులభంగా నిర్ధారించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నా మని ఇటలీ ప్రభుత్వం పేర్కొంది.

తరగతుల్లో విదేశీ విద్యార్థులకు 30 శాతం పరిమితి

డిక్రీ స్కూలా చట్టం ద్వారా పాఠశాల విద్యా విధానంలో మరికొన్ని మార్పులు కూడా తెచ్చారు. మొదటి సంవత్సరం తరగతుల్లో విదేశీ మూలాలున్న విద్యార్థుల సంఖ్యను 30 శాతానికి పరిమితం చేయాలని నిర్ణయించారు. అయితే ఇటాలియన్ భాషపై పరిజ్ఞానం ఉన్న విద్యార్థులకు ప్రత్యేక వెసులుబాటు కల్పించారు. అంతేకాకుండా, తమ పిల్లలు ఇటలీ విద్యావ్యవస్థలో కలిసిపోవ డంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న విదేశీ తల్లిదండ్రులకు ఇటాలియన్ భాషా తరగతులు నిర్వహించనున్నారు.

స్పెయిన్‌లో నేడు సార్వత్రిక ఎన్నికలు

గృహ సంక్షోభం, వలసలే నిర్ణయాత్మక అంశాలు!

మాడ్రిడ్: తీవ్రమైన గృహ సంక్షోభం, అక్రమ వలసల వివాదం, అవినీతి ఆరోపణల నేపథ్యంలో స్పెయిన్‌లో ఆదివారం ముందస్తు సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ప్రధాని పెడ్రో శాంచెజ్ నేతృత్వంలోని మైనారిటీ ప్రభుత్వం ప్రతిపాదించిన గృహ ఉప శమన చర్యలకు పార్లమెంటులో ఆమోదం లభించకపోవడం, దేశవ్యాప్తంగా అద్దెలు, ఇళ్ల ధరలపై నిరసనలు వెల్లువెత్తడంతో ఆయన ముందస్తు ఎన్నికలకు పిలుపునిచ్చారు. 350 స్థానాలున్న స్పెయిన్ దిగువ సభతో పాటు 209 సెనేట్ స్థానాలకు ఆదివారం పోలింగ్ జరగనుంది. సుమారు 3.87 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు 350 స్థానాలున్న దిగువ సభలో 176 స్థానాల (సగం కంటే ఎక్కువ) మెజారిటీ అవసరం. ఆదివారం ఉదయం 9 గంటలకు పోలింగ్ ప్రారంభమవుతుండగా, అర్ధరాత్రి లోపు ఫలితాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



ఎనిమిదేళ్లుగా అధికారంలో ఉన్న ప్రధాని పెడ్రో శాంచెజ్ నేతృత్వంలోని స్పానిష్ సోషలిస్ట్ వర్కర్స్ పార్టీ, అల్బెర్టో నూనెజ్ ఫీజూ నాయకత్వంలోని సెంటర్-రైట్ పీపుల్స్ పార్టీ, శాంటియాగో అబాస్కల్ నేతృత్వంలోని మితవాద వోక్స్ పార్టీల మధ్య ప్రధాన పోటీ నెలకొంది. ఎన్నికల ముందస్తు సర్వేల ప్రకారం పీపుల్స్ పార్టీ అతిపెద్ద పార్టీగా అవతరించే అవకాశం ఉన్నప్పటికీ, మెజారిటీ మార్కును చేరుకోవడానికి వోక్స్ పార్టీ మద్దతు అవసరమని అంచనా వేస్తున్నారు.



ట్రంప్-జిన్‌పింగ్ భేటీ వేదిక సమీపంలోనే..

నిషేధిత ఎన్విడియా చిప్‌ల విక్రయాలు

- ఒక్కో సర్వర్ ధర 34 లక్షల డాలర్లు

- అమెరికాలో దాని వెల 5 లక్షల డాలర్లే

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఇటీవల భేటీ అయినవేదికకు కూతవేటు దూరంలోనే...అమెరికా నిషేధిత ఎన్విడియా అత్యాధునిక ఏఐ చిప్స్‌ను బహిరం గంగా విక్రయి స్తుండడం సంచలనం రేపుతోంది. చైనాలోని షెన్‌జెన్ నగరంలో ఉన్న హువాచి యాంగ్‌బే ఎలక్ట్రానిక్స్‌మార్కెట్లో బ్లాక్‌వెల్ సిరీస్‌కు చెందిన బీ300 చిప్స్‌తో కూడిన సర్వర్లను విక్రయిస్తున్నట్లు వాషింగ్టన్ పోస్టు ప్రత్యేక కథనం వెల్ల డించింది. ఆ మార్కెట్‌కు వెళ్లిన ఓ అమెరికా విలేకరికి కూడా ఈ చిప్స్ అమ్ముతామని వ్యాపారులు ఆఫర్‌చేయడం విశేషం. అమెరికాలో ఎగుమతి ఆంక్షలు ఉన్నప్పటికీ ఈ చిప్స్ చైనా మార్కెట్‌కు ఎలా చేరుతున్నాయన్నది చర్చనీయాంశంగా మారింది. ఒక్కో సర్వర్‌లో ఎనిమిది బీ300 చిప్స్ ఉండగా, దాని ధరను 30-34 లక్షల డాలర్లుగా విక్రయదారులు చెబుతున్నట్లు పత్రిక పేర్కొంది. అమెరికాలో ఇదే తరహా సర్వర్ ధర కేవలం 5 నుంచి 6 లక్షల డాలర్లేనని బ్రూకింగ్ ఇన్‌స్టిట్యూషన్ నిపుణుడు కైల్ చాన్ వెల్లడించారు. అయితే విక్రయానికి ఉంచిన చిప్స్ నిజమైనవో కాదో నిర్ధారించలేకపోయినట్లు వాషింగ్టన్ పోస్టు పేర్కొంది.

వలసదారుల పడవ మునిగి 8 మంది మృతి

మాడ్రిడ్: స్పెయిన్‌కు చెందిన కానరీ దీవుల సమీపాన అట్లాం టిక్ సముద్రంలో విషాదం చోటుచేసుకుంది. నిన్న పశ్చిమ ఆఫ్రికా నుంచి అక్రమంగా యూరప్‌కు బయలుదేరిన వలసదారుల పడవ ప్రమాదానికి గురైంది. వీరిని రక్షించే క్రమంలో 8 మంది మృతదేహాలు లభ్యమయ్యాయని స్పెయిన్ సముద్ర రక్షణ విభాగం వెల్లడించింది. సుమారు 100 మందితో ప్రయాణిస్తున్న ఈ పడవలో తీవ్ర అస్వస్థతకు గురైన మరో ఆరుగురిని హెలికాప్టర్ ద్వారా ఆసుపత్రికి తరలించారు. ఎల్ హియెర్రో ద్వీపానికి దక్షిణంగా సుమారు 72 కిలోమీటర్ల దూరంలో ఈ పడవను గుర్తించిన రక్షణ సిబ్బంది, దానిని లా ఎస్తాకా ఓడరేవుకు లాక్కొచ్చారు. మరో ఘటనలో ఎల్ హియెర్రో ప్రధాన ఓడరేవైన లా రెస్టింగాకు 84 మంది వలసదారులతో కూడిన మరో పడవ సురక్షితంగా చేరుకుంది. అక్కడ ఏర్పాటు చేసిన తాత్కాలిక ఆసుపత్రిలో వారికి వైద్య సేవలు అందిస్తున్నారు. వాయువ్య ఆఫ్రికా తీరానికి సమీపంలో ఉన్న కానరీ దీవులు.. పశ్చిమ ఆఫ్రికా నుంచి స్పెయిన్, యూరోపియన్ యూనియన్ దేశాల్లోకి ప్రవేశించే వలసదారులకు ప్రధాన కేంద్రంగా మారాయి. సెనెగల్, మౌరిటానియా, మొరాకో తీర ప్రాంతాల్లో నిఘా పెరగడంతో వలసదారులు మరింత దక్షిణాన ఉన్న గాంబియా, గినియా-బిస్సావు, గినియా దేశాల నుంచి సుదూర సముద్ర ప్రయాణాలు చేస్తున్నారు. దీనివల్ల ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారింది. అక్టోబర్ నుంచి వలసదారుల రాక భారీగా పెరిగింది. కేవలం 11,400 మంది జనాభా ఉన్న ఎల్ హియెర్రో ద్వీపానికి ఈ వారం ప్రారంభంలో ఒక్కరోజే రికార్డు స్థాయిలో 2,100 మంది వలసదారులు చేరుకోవడంతో స్థానిక అధికారులు అత్యవసర పరిస్థితిని ప్రకటించారు.





అఫ్గానిస్థాన్‌లో భారీ పేలుడు

ఆరుగురు విద్యార్థుల మృతి, 97 మందికి గాయాలు

కాబూల్: అఫ్గానిస్థాన్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కునార్ ప్రావిన్స్‌లోని అందర్ సెర్ ప్రాంతంలో ఓ పాఠశాల వద్ద భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఆరుగురు విద్యా ర్థులు మరణించగా.. మరో 97 మంది తీవ్రంగా గాయపడినట్లు తెలుస్తోంది. శనివారం ఉదయం సుమారు 10 గంటల సమయంలో విద్యార్థులంతా పాఠశాలలో ఉండగా.. పక్కనే ఉన్న ఇంట్లో పేలుడు సంభవించినట్లు అనుమానాలు వ్యక్తమవు తున్నాయి. ఈ ఘటనపై కునార్ ప్రావిన్షియల్ పోలీస్ ప్రధాన కార్యాలయ ప్రతినిధి ఫరీద్ దెహ్మోన్ స్పందించారు. పేలుడు కారణంగా పలువురు విద్యార్థులు మరణించారని, మరికొందరు గాయపడినట్లు ఆయన వెల్లడించారు. పాఠశాల సమీపంలోని ఓ ఇంట్లో మైనింగ్ కార్యకలాపాలకు ఉపయోగించే డైనమైట్‌ను నిల్వ ఉంచినట్లు తెలిపారు. ప్రమాదవశాత్తూ ఆ డైనమైట్లు పేలినట్లు అనుమానిస్తున్నామని పేర్కొన్నారు. అయితే, ప్రమాదానికి ఇదే కారణమని అధికారులు ఇంకా నిర్ధారించలేదు. పేలుడు అనంతరం ఘటనాస్థలికి సహాయక బృందాలు చేరుకున్నాయి. వెంటనే పలువురు విద్యార్థులను ఆస్పత్రికి తరలించాయి. మరోవైపు అధికారులు విచారణ చేపట్టారు. మృతుల సంఖ్య, వారి వివరాలు, పేలుడుకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. విచారణలో ప్రమాదానికి సంబంధించి మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. కాగా, భారీ పేలుడుతో పలువురు విద్యార్థులు మృతిచెందడం స్థానికంగా తీవ్ర ఆందోళనకు దారితీసింది.

వాషింగ్టన్‌లో ఢీకొన్న

రెండు విమానాల రెక్కలు



అమెరికా: వాషింగ్టన్ డీసీలో ఉన్న రొనాల్డ్ రీగన్ నేషనల్ విమానాశ్రయంలో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. రన్‌వేపై టేకాఫ్‌కు సిద్ధమవుతూ ట్యాక్సీయింగ్ చేస్తున్న రెండు అమెరికన్ ఎయిర్‌లైన్స్ ప్రయాణికుల విమానాల రెక్కలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. శు క్రవారం సాయంత్రం 5.10 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. డల్లాస్-ఫోర్ట్ వర్త్‌కు వెళ్లాల్సిన అమెరికన్ ఎయిర్‌లైన్స్ ఫ్లైట్ 638, చికాగోకు బయలుదేరాల్సిన ఫ్లైట్ 2152 విమానాలు కదులుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. రెండు బోయింగ్ 737-800 విమానాల రెక్కల చివరి భాగాలు పరస్పరం తగలడంతో ప్రయాణికులు ఒక్కసారిగా తీవ్ర కుదుపునకు గురయ్యారు. విమానం రెక్కకు సంబంధించిన ఓ భాగం నేలపై పడినట్లు ప్రయాణికులు గుర్తించారు. ఈ ఘటనలో ఒక విమానం వింగ్‌లెట్ దెబ్బతిన్నట్లు పైలట్ నివేదించినట్లు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సంభాషణల్లో వెల్లడైంది. విమానాశ్రయ సిబ్బంది ప్రమాద స్థలాన్ని పరిశీలించి.. విడిపోయిన శకలాలను స్వాధీనం చేసుకున్నారు. నిర్వహణ పరీక్షలు పూర్తయ్యే వరకు రెండు విమానాలను సేవల నుంచి తొలగించినట్లు అమెరికన్ ఎయిర్‌లైన్స్ ప్రకటించింది. ట్యాక్సీయింగ్ సమయంలో రెండు విమానాలు ఎలా ఢీకొన్నాయనే అంశంపై ఎఫ్ఏఏ దర్యాప్తు చేపట్టనుంది.



ముగిసిన రెండో రోజు ఆట

భారత్ స్కోర్ 116/6

భారత్, న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న రెండో టెస్టు రెండో రోజు ఆట ముగిసింది. 46 ఓవర్లకు భారత్ 6 వికెట్లు కోల్పోయి 116 పరుగులు చేసింది. న్యూజిలాండ్ బౌలర్ల ధాటికి భారత బ్యాటర్లు వరుసగా పెవిలియన్ బాట పట్టారు. అంతకుముందు కివీస్ 356 పరుగులకు ఆలౌటైంది. దీంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ ఇంకా 240 పరుగుల వెనుకంజలో ఉంది. యశస్వి జైస్వాల్(0) విఫలమయ్యాడు. కేఎల్ రాహుల్ (25), దేవదత్ పడిక్కల్(21), శుభ్‌మన్ గిల్(17), రిషభ్ పంత్(23), వాషింగ్టన్ సుందర్(10) స్వల్ప స్కోరుకే ఔటయ్యారు. ధ్రువ్ జురెల్(7) క్రీజులో ఉన్నాడు. కాగా న్యూజిలాండ్ బౌలర్లలో జెమీసన్ 2, డఫీ 2, హెన్రీ, నాథన్ స్మిత్ తలొక వికెట్ చొప్పున పడగొట్టారు.

‘ముంబై’ పగ్గాలు మళ్లీ రోహిత్‌కే

ముంబై: హార్దిక్ పాండ్యా సారథ్యంలో విఫలమైన ముంబై ఇండియన్స్... పాత నాయకుడు రోహిత్ శర్మ (39)నే ఆశ్రయిం చింది. మరోసారి అతడినే కెప్టెన్‌గా నియమిస్తున్నట్టు ఫ్రాంచైజీ శుక్రవారం ప్రకటించింది. దాంతో 2027 సీజన్ నుంచి హిట్‌మ్యాన్ నేతృత్వంలో ముంబై ఐపీఎల్ బరిలో దిగనుంది. రోహిత్ కెప్టెన్సీలో



ముంబై ఇండియన్స్ ఐదుసార్లు ఐపీఎల్ విజేతగా నిలిచిన విషయం తెలిసిందే. కానీ 2024లో రోహిత్‌ను తప్పించి హార్దిక్ పాండ్యాకు నాయకత్వ బాధ్యతలు అప్పగించింది. అప్పటినుంచి ముంబై ఇండియన్స్ ఆట పూర్తిగా చతికిలపడింది. ఆ ఏడాది ముంబై 10 జట్ల లీగ్‌లో ఆఖరి స్థానంలో నిలిచింది. దాంతో ముంబై అభిమానులు హార్దిక్ పాండ్యాతో పాటు ఫ్రాంచైజీపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంజేశారు. 2025లో లీగ్ దశలో నాలుగో స్థానం సాధించిన ఆ జట్టు క్వాలిఫయర్-2తో వెనుదిరిగింది. ఇక ఈ సీజన్‌లో అయితే తొమ్మిదో స్థానంతో ముగించింది. దాంతో హార్దిక్‌ను వదులుకోవాలని ముంబై నిర్ణయించుకుంది. ఈ నేప థ్యంలోనే హార్దిక్‌ను ఈసారి ట్రేడింగ్‌లో పంజాబ్ కింగ్స్ తీసుకు న్నది. బదులుగా పంజాబ్ నుంచి పేసర్ అర్ష్‌దీప్ ముంబైకి వెళ్లాడు. 2013లో తొలిసారి ముంబై ఇండియన్స్ పగ్గాలు చేపట్టిన రోహిత్‌ను 2023 సీజన్ తర్వాత కెప్టెన్సీ నుంచి తప్పించారు. ఇక..రోహిత్ సారథ్యంలో 2013, 2015, 2017, 2019, 2020లో ముంబై ఐపీఎల్ చాంపియన్‌గా నిలిచింది. 2013లో చాంపియన్స్ లీగ్ టీ20 టైటిల్‌ను రోహిత్ కెప్టెన్సీలో ముంబై తన ఖాతాలో వేసుకుంది. హిట్‌మ్యాన్ నాయకత్వంలో 158 మ్యాచ్‌లు ఆడిన ముంబై 87 పోటీలలో గెలుపొందింది.

38 ఏళ్లకే డబ్ల్యూడబ్ల్యూఈ స్టార్ కన్నుమూత

ప్రపంచ రెజ్లింగ్ ఎంటర్‌టైన్‌మెంట్ స్టార్ బ్రాన్సన్ రీడ్ కన్నుమూశారు. ఆస్ట్రేలియాకు చెందిన రీడ్.. 38 ఏళ్ల వయసు లోనే అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఈ విషయాన్ని డబ్ల్యూడబ్ల్యూఈ ఆర్గనైజేషన్ ధ్రువీకరించింది. రీడ్ అసలు పేరు జెర్మైన్ హేలీ. నవంబర్ 7న సౌదీ



అరేబియా వేదికగా జరిగిన ‘క్రౌన్ జెవెల్’ ఈవెంట్‌లో బరిలోకి దిగాడు. ఇంతలోనే రీడ్ మరణవార్త రావడంతో రెజ్లింగ్ అభిమానులు దిగ్భ్రాంతికి గురవుతున్నారు. నవంబరు 7న సౌదీ అరేబియాలో జరిగిన క్రౌన్ జెవెల్ ఈవెంట్ సందర్భంగా రీడ్ గాయపడినట్లు గతంలో వార్తలు వచ్చాయి. ఆ లైవ్ ఈవెంట్‌లో మరో రెజ్లర్ ఆయనను పైకెత్తి టేబుల్‌పై పడేయడంతో తీవ్రంగా గాయపడినట్లు, దీంతో అతడు సౌదీ అరేబియాలోనే ఆసుపత్రిలో చేరినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. అయితే ఈ విషయంపై స్పందించిన డబ్ల్యూడబ్ల్యూ ఈ.. గాయాల వల్ల రీడ్ చనిపోలేదని స్పష్టం చేసింది.

91 బంతుల్లో 12 పరుగులే! భారత్ టెస్టు చరిత్రలో చెత్త భాగస్వామ్యం



న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండో టెస్టు రెండో రోజు ఆటలో టీమిండియా బ్యాటింగ్ లైనప్ ఘోరంగా తడబడింది. తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ జట్టును 356 పరుగులకు కట్టడి చేసిన ప్పటికీ, ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఆట ముగిసే సమయానికి 46 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 116 పరుగులు మాత్రమే చేసింది. ఫాలో-ఆన్ తప్పించుకోవాలంటే భారత్ ఇంకా 41 పరుగులు చేయాల్సి ఉంది. భారత ఇన్నింగ్స్‌లో యశస్వి జైస్వాల్ (0) తొలి ఓవర్లోనే పెవిలియన్ చేరగా, దేవదత్ పడిక్కల్ (21), శుభ్‌మన్ గిల్ (17), రిషభ్ పంత్ (23), కేఎల్ రాహుల్ (25) వరుసగా వికెట్లు కోల్పోయారు. 104/5 వద్ద క్రీజులోకి వచ్చిన ధ్రువ్ జురెల్ (7 నాటౌట్), వాషింగ్టన్ సుందర్ (10) ఆరో వికెట్‌కు 91 బంతులు ఆడి కేవలం 12 పరుగులే జోడించారు. తద్వారా టెస్టు ఇన్నింగ్స్‌లో టీమిండియా తరఫున ఏ వికెట్‌కైనా రన్‌రేటు పరంగా అత్యల్ప భాగస్వామ్యం నెలకొల్పిన జోడీగా చెత్త రికార్డు మూటగట్టుకున్నారు. 0.79 రన్‌రేట్‌తో సాగిన ఈ భాగ స్వామ్యం.. కనీసం 90 బంతులు ఎదుర్కొన్న భారత టెస్టు భాగస్వామ్యాల్లో అత్యంత తక్కువ రన్‌రేట్ జోడీగా నిలిచింది. 1999లో ఆస్ట్రేలియాపై సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవిడ్ (1.13 రన్‌రేట్‌తో 17 పరుగులు) పేరిట ఉన్న చెత్త రికార్డును తాజాగా ధ్రువ్, వాషింగ్టన్ జోడీ అధిగమించింది. అయితే, శనివా రం నాటి రెండో రోజు ఆట పూర్తయ్యేసరికి వాషింగ్టన్ సుందర్.. నాథన్ స్మిత్ బౌలింగ్‌లో అవుటయ్యాడు. మొత్తంగా అతడు 60 బంతులు ఎదుర్కొని కేవలం 10 పరుగులు చేసి నిష్క్రమించాడు. ధ్రువ్ జురెల్ 45 బంతుల్లో ఓ ఫోర్ బాది ఏడు పరుగులతో అజేయంగా నిలిచాడు. అంతకుముందు కివీస్ తొలి ఇన్నింగ్స్‌లో టామ్ బ్లండెల్ (89), గ్లెన్ ఫిలిప్స్ (36), డారిల్ మిచెల్ (31), డెవాన్ కాన్వే (31) రాణించగా, భారత పేసర్ ఆకాశ్ దీప్ 5 వికెట్లతో సత్తా చాటాడు. హేగ్లీ ఓవల్ మైదానంలో ఐదు వికెట్ల ఘనత సాధించిన తొలి భారత బౌలర్‌గా ఆకాశ్ నిలిచాడు.

టెస్ట్ ఇన్నింగ్స్‌లో భారత్ తరఫున ఏ వికెట్‌కైనా అత్యల్ప భాగస్వామ్యాల రన్‌రేట్ (కనీసం 90 బంతులు):

- 0.79 – ధ్రువ్ జూరెల్–వాషింగ్టన్ సుందర్ జం న్యూజిలాండ్, క్రైస్ట్‌చర్చ్, 2026 (91 బంతుల్లో 12 పరుగులు, 6వ వికెట్)
- 1.13 – రాహుల్ ద్రవిడ్–సచిన్ టెండూల్కర్ జం ఆస్ట్రేలియా, అడిలైడ్, 1999 (90 బంతుల్లో 17 పరుగులు, 4వ వికెట్)
- 1.15 – రాహుల్ ద్రవిడ్–సచిన్ టెండూల్కర్ జం ఇంగ్లండ్, అహ్మదాబాద్, 2001 (114 బంతుల్లో 22 పరుగులు, 3వ వికెట్)
- 1.17 – రాహుల్ ద్రవిడ్–ఇర్ఫాన్ పఠాన్ జం ఆస్ట్రేలియా, బెంగళూరు, 2004 (164 బంతుల్లో 32 పరుగులు, 7వ వికెట్)
- 1.18 – రాహుల్ ద్రవిడ్–వీవీఎస్ లక్ష్మణ్ జం వెస్టిండీస్, కింగ్‌స్టన్, 2006(157 బంతులు 31 పరుగులు, 3వ వికెట్)

క్లోయ్ ట్రయాన్ విధ్వంసం

16 బంతుల్లోనే హాఫ్ సెంచరీ



ఉమెన్స్ బిగ్ బాష్ లీగ్ (డబ్ల్యూబీఎల్) 2026 సీజన్‌లో దక్షిణా ఫ్రికా వెటరన్ ఆల్‌రౌండర్ క్లోయ్ ట్రయాన్ మెరుపు ఇన్నింగ్స్ ఆడింది. ఈ టోర్నీలో మెల్‌బోర్న్ రెనెగేడ్స్‌కు ప్రాతినిధ్యం వహి స్తున్న క్లోయ్.. శనివారం మెల్‌బోర్న్ స్టార్స్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో అద్భుత అర్ధ శతకంతో చెలరేగింది. ఈ విజయంతో మెల్‌బోర్న్ రెనెగేడ్స్ జట్టు పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో నిలిచింది. ఈ మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించడంతో తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 8.5 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యపడింది. తొలుత బ్యాటింగ్ చేసిన మెల్‌బోర్న్ స్టార్స్ 8.5 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 75 పరుగులు చేసింది. అనంతరం డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం మెల్‌బోర్న్ రెనెగేడ్స్ ముందు 8 ఓవర్లలో 100 పరుగుల భారీ లక్ష్యం నిర్దేశించబడింది. అనంతరం లక్ష్య ఛేదనలో రెనెగేడ్స్ 29 పరుగులకే 4 కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన క్లోయ్ ట్రయాన్ ఆకాశమే హద్దుగా చెలరేగింది. కేవలం 17 బంతుల్లోనే 6 ఫోర్లు, 4 సిక్సర్లతో అజేయంగా 56 పరుగులు సాధించింది. మరో బంతి మిగిలి ఉండగానే జట్టుకు ఐదు వికెట్ల తేడాతో విజయాన్ని అందించింది. ఈ క్రమంలో కేవలం 16 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసిన ట్రయాన్.. డబ్ల్యూబీబీఎల్ చరిత్రలో రెండో వేగవంతమైన అర్ధ శతకం నమోదు చేసింది. 2022లో టెస్ ఫ్లింటాఫ్ కూడా 16 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించింది. కాగా, ఈ జాబితాలో లారా హారిస్ (15 బంతులు) తొలిస్థానంలో కొనసాగుతోంది.

భారత్ ఫీల్డింగ్‌పై గవాస్కర్ అసహనం

క్రైస్ట్‌చర్చ్ వేదికగా న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో టీమిండియా ఫీల్డింగ్‌లో వైఫల్యాలు కనిపించాయి. రెండో రోజు ఆటలో ఆకాశ్ దీప్ బౌలింగ్‌లో నాథన్ స్మిత్ బ్యాట్ అంచు తాకిన బంతి.. రెండో స్లిప్‌లో ఉన్న కేఎల్ రాహుల్ ముందు పడటంతో త్రుటిలో క్యాచ్ మిస్సైంది. దీంతో కామెంట్రీ బాక్స్‌లో మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. దీనికి



సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. రెండో ఆట ముగిసిన తర్వాత తన ఆగ్రహానికి గల కారణాన్ని గావస్కర్ వివరిం చారు. క్యాచ్‌లు జారవిడవడం ఆటలో సహజమే అయినా, ఫీల్డర్ల స్థానాల (పొజిషన్) విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకో వాలని సూచించారు. తొలి రోజు ఆట నుంచే భారత స్లిప్ ఫీల్డర్లు కొంచెం ముందుకు వచ్చి నిల్చోవాలని తాను చెబుతు న్నానని, సరైన స్థానంలో ఉంటే మరికొన్ని క్యాచ్‌లు అందుకునే అవకాశం ఉండేదని పేర్కొన్నారు. చిన్న చిన్న తప్పులను సరిదిద్దుకుంటేనే పెద్ద విజయాలు అందుతాయని గావస్కర్ హితవు పలికారు. న్యూజిలాండ్ పర్యటనలో భారత్‌కు క్యాచ్‌ల సమస్య వెంటాడుతోంది. వెల్లింగ్టన్‌లో జరిగిన తొలి టెస్టులో కూడా టీమిండియా ప్లేయర్లు హెన్రీ నికోల్స్ (175), డారిల్ మిచెల్ క్యాచ్‌లను వదిలేయడం జట్టుపై ప్రభావం చూపింది. ఇక క్రైస్ట్‌చర్చ్ టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లోనూ పలు ఈజీ క్యాచ్‌లను చేజార్చడంతో కివీస్ 356 పరుగులు చేయగలిగింది. మరోవైపు స్పిన్ కోచ్ సాయిరాజ్ బహుతులే మీడియా సమావేశంలో జట్టు ఫీల్డింగ్‌ను సమర్థించుకున్నారు. ప్రాక్టీస్ సెషన్లలో క్యాచుల విషయంలో కఠోరంగా శ్రమిస్తున్నామని, మ్యాచ్‌లోనూ అదే స్థాయిలో రాణించాల్సి ఉందని అన్నారు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే..తొలి ఇన్నింగ్స్‌లో ఆకాశ్ దీప్ 5 వికెట్లు తీసినా, ఆ తర్వాత బ్యాటింగ్‌లో తడబడిన భారత్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి 6 వికెట్ల నష్టానికి 116 పరుగులు చేసి కష్టాల్లో నిలిచింది.

చైతన్య రథం
సినిమా
ఆదివారం 29 నవంబరు 2026 X

విడుదలకు సిద్ధమైన విశ్వక్ 'లెగసీ'



మాస్‌కా దాస్ విశ్వక్ సేన్ ప్రధాన పాత్రలో నటిస్తోన్న ఇంటె న్స్ పొలిటికల్ యాక్షన్ డ్రామా 'లెగసీ' షూటింగ్ విజయ వంతంగా పూర్తయింది. 'పిండం' చిత్రంతో దర్శకుడిగా విమర్శ కుల ప్రశంసలు అందుకున్న సాయికిరణ్ రెడ్డి దైదా ఈ సినిమాకు రచన, దర్శకత్వం వహిస్తున్నారు. కళాహి మీడియా బ్యానర్‌పై యశ్వంత్ దగ్గుమాటి, సాయికిరణ్ రెడ్డి దైదా సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తవడంతో చిత్ర బృందం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులను శరవేగంగా జరుపుతోంది. నిర్మాణానంతర కార్య క్రమాలు తుది దశకు చేరుకుంటున్న నేపథ్యంలో 'లెగసీ' చిత్రాన్ని 2027 ఫిబ్రవరిలో ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ గా థియేటర్లలో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. దర్శకుడు సాయికిరణ్‌రెడ్డి దైదాకు, అలాగే కళాహి మీడియా సంస్థకు ఇది రెండో సినిమా కావడం విశేషం. కథా నేపథ్యం ఏంటంటే.. "పొలిటిక్స్ ఈజ్ పర్సనల్' అనే ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ చిత్రం అధికారం, ఆశయం, కుటుంబ బంధాలు, ప్రేమ, ద్రోహం వంటి బలమైన భావోద్వేగాల చుట్టూ సాగుతుంది. తన తండ్రి రాజకీయ వారసత్వం కారణంగా అనూహ్య పరిస్థితులను ఎదుర్కోవాల్సి వచ్చిన ఓ వారసుడి జీవిత ప్రయాణమే ఈ సినిమా ప్రధాన ఇతివృత్తం. రాజకీయాల ప్రభావం వ్యక్తిగత జీవితాలపై ఎలాంటి తీవ్ర పరిణామాలను చూపిస్తుందనే అంశాన్ని దర్శకుడు ఆసక్తికరంగా ఆవిష్కరించ నున్నట్లుగా తెలుస్తోంది.

స్విట్జర్లాండ్ వేదికపై అన్నమయ్య కీర్తన



అంతర్జాతీయ వేదికపై భారతదేశం గర్వించేలా అరుదైన ఘటన చోటుచేసుకుంది. గ్రామీ అవార్డు విజేత, ప్రఖ్యాత శాన్ ఫ్రాన్సిస్కో అకాపెల్లా సంగీత బృందం చాంటిక్లియర్ అంతర్జాతీ య వేదికపై భారతీయ సంగీత వైభవాన్ని, తెలుగు కీర్తి పతాకాన్ని సగర్వంగా ఎగురవేసింది. స్విట్జర్లాండ్‌లోని రైన్‌ఫెల్డెన్‌లో జరిగిన 2026 సోల్స్‌బర్గ్ ఫెస్టివల్‌లో ఇండో-అమెరికన్ టెనర్ గాయకుడు వినీల్ గరిశ మహల్ లీడ్ వోకల్స్‌తో పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు రచించిన బ్రహ్మమొక్క టే కీర్తనను అద్భుతంగా ఆలపించారు. ఎలాంటి సంగీత వాయిద్యాల సహా యం లేకుండా కేవలం గాత్ర మాధుర్యంతోనే సాగిన ఈ ప్రదర్శన విదేశీ ప్రేక్షకులను సైతం మంత్రముగ్ధులను చేసింది. ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ సంగీత వారసత్వాన్ని స్విట్జర్లాండ్ వేదికపైకి తీసుకెళ్లి, భారతదేశపు ఆధ్యాత్మిక లోతును ప్రపంచానికి పరిచయం చేశారంటూ సంగీత ప్రియులు ప్రశంసలు కురిపిస్తున్నారు. విదేశీ గడ్డపై ఈ కీర్తన వినిపించడం ప్రతి తెలుగువాడికి, ప్రతి భారతీ యుడికి గర్వకారణమని, ఇది కదా తెలుగోడి పవర్ అని నెటిజన్స్ నెట్టింట కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. ఇక ఈ వీడియోని డైరెక్టర్ హరీష్ శంకర్ కూడా పోస్ట్ చేస్తూ.. ప్రశంసలు కురిపించాడు.

అల్లు అరవింద్‌కు రాజమౌళి సలహా



వెర్సటైల్ స్టార్ దుల్కర్ సల్మాన్ లేటెస్ట్ బ్లాక్‌బస్టర్ 'ఆకాశంలో ఒక తార'. పవన్ సాధినేని దర్శకత్వంలో గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా, లైట్‌బాక్స్ మీడియా బ్యానర్లపై సందీప్ గున్నం, రమ్య గున్నం ఈ చిత్రాన్ని నిర్మించారు. సాత్విక వీరవల్లి హీరోయిన్‌గా నటించ గా, శ్రుతి హాసన్, రుహాని శర్మ కీలక పాత్రల్లో కనిపించారు. నవంబర్ 20న వరల్డ్‌వైడ్‌గా ప్రేక్షకుల ముందుకు వచ్చి న ఈ చిత్రం ట్రెమండస్ రెస్పాన్స్‌తో ప్రేక్షకులు, విమర్శకుల ప్రశంసలు అందుకుంటూ సక్సెస్‌ఫుల్‌గా రన్ అవు తోంది. ఈసందర్భంగా మేకర్స్ శుక్ర వారం సక్సెస్ సెలబ్రేషన్స్‌ను నిర్వహిం చారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథి గా దర్శక ధీరుడు ఎస్ఎస్ రాజమౌళి హాజరయ్యారు.ఇంత మంచి సినిమాకు ఇంతగొప్ప ఆదరణ ఇచ్చిన ప్రేక్షకులకు థాంక్యూ. 'ఆకాశంలో ఒక తార' ఇంత అద్భుతంగారావడానికి స్వప్నే కారణం. తనే ఈ స్థాయిలో రూపొందించింది. అల్లు అరవింద్ గారు అవార్డు విన్నింగ్ సినిమాలు చేస్తున్నారు. కాకపోతే నాకు ఒక కోరిక ఉంది. ఇలా కలిసి చేస్తున్న ప్పుడు ఈ యంగ్ ప్రొడ్యూసర్స్ అంద రూ క్రెడిట్ మొత్తం తీసేసుకుంటున్నా రు. ఆయన 'మగధీర' చేసినట్టు సోలో ప్రొడక్షన్‌లో ఒక సినిమా చేయాలి. లేదంటే క్రెడిట్ అంతా వాళ్లే కొట్టేస్తు న్నారు అని చెప్పుకొచ్చారు.

మోక్షజ్ఞ చిత్రంలో ఎన్టీఆర్!



మహానటుడు నందమూరి తారక రామారావు నట వారసుడిగా బాలకృష్ణ వచ్చినట్టుగానే.. ఇప్పుడాయన నట వారసుడిగా మోక్షజ్ఞ రంగంలోకి దిగాలని అభిమానులు ఎంతో కాలంగా ఆశిస్తున్నారు. అయితే రకరకాల కారణాల వల్ల మోక్షజ్ఞ ఎంట్రీ ఆలస్యమవుతూ వచ్చింది. మధ్యలో కొన్ని ప్రకటనలు వచ్చినా అవి కార్యరూపం దాల్చలేదు. కానీ ఇప్పుడు మైత్రీ మూవీ మేకర్స్ ద్వారా మోక్షజ్ఞ హీరోగా ఎంట్రీ ఇవ్వబోతున్నారని, దానికి 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహిస్తారని అధికారిక సమాచారం వచ్చింది. ఈ క్రేజీ కాంబోలో రాబోయే సినిమాపై ఇప్పటినుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. అంతేకాదు థియేటర్లు తగలబడిపోయే రేర్ న్యూస్ ఒకటి ఇప్పుడు ఫిల్మ్ సర్కిల్స్‌లో తిరుగుతోంది. అదేమిటంటే... మోక్షజ్ఞ మూవీలో మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్‌తో గెస్ట్ అప్పీయరెన్స్ ఇప్పించే పనిలో దర్శకుడు వశిష్ఠ ఉన్నాడట. నందమూరి మోక్షజ్ఞను తండ్రి బాలకృష్ణే హీరోగా పరిచయం చేయాలని భావించారు. కానీ యంగ్ డైరెక్టర్స్ చేతిలో మోక్షజ్ఞను పెడితే దాని ఫలితం వేరేగా ఉంటుందని కుటుంబ సభ్యులు భావించినట్టు తెలుస్తోంది. దాంతో ముందుగా ప్రశాంత్ వర్మతో సినిమా అనుకున్నా.. ఇప్పుడది వశిష్ఠ చేతిలోకి వెళ్ళింది. ట్రైమ్ ట్రావెల్, పునర్జన్మల నేపథ్యంలో తెరకెక్కే ఈ సోషియో ఫాంటసీ మూవీలో నందమూరి బాలకృష్ణ కూడా నటించబోతున్నారట. ఆ రకంగా ఇటు బాల కృష్ణ, అటు ఎన్టీఆర్.. మధ్యలో మోక్షజ్ఞ ఒకే ఫ్రేమ్‌లో కనబడితే.. బాక్సాఫీస్ విధ్వంసం ఖాయం. ఇంతవరకూ బాలకృష్ణ, జూ. ఎన్టీఆర్ కలిసి స్క్రీన్‌ను పంచుకున్నది లేదు. ఇప్పుడు మోక్షజ్ఞ కోసం అది జరిగితే రేర్ ఫీట్ అవుతుంది. సో.. ఈ క్రేజీ మాస్ కాంబో కోసమే వశిష్ఠ తాపత్రయపడుతున్నాడని అంటున్నారు. గత కొంతకాలంగా నందమూరి బాలకృష్ణకు, జూనియర్ ఎన్టీఆర్‌కు మధ్య సయోధ్య సరిగా లేదనే వార్తలు వినిపిస్తున్నాయి. రూమర్స్ మాట ఎలా ఉన్నా... ఫ్యామిలీ విషయానికి వచ్చేసరికీ నందమూరి తారక రామారావు వారసులంతా ఒక్క త్రాటిపై నిలుస్తారని అందరూ అంటున్నారు.

చిన్న చిన్న పొరపొచ్చాలు ఉన్నా.. వాటిని కలిసి కూర్చుని సరిచేసుకుంటారని చెబుతున్నా రు. మోక్షజ్ఞ హీరోగా ఎంట్రీ ఇవ్వబోతున్న శు భతరుణంలో అతని కోసం ఎన్టీఆర్ ముందుకు వస్తాడని, గెస్ట్ అప్పీయరెన్స్ ఇవ్వడానికి వెనుకాడడనీ టాక్. పైగా బాలయ్య బాబాయి అంటే అభిమానం ఉన్న ఎన్టీఆర్.. ఆయనతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకునే ఛాన్స్ వస్తే మిస్ చేసుకోడని అంటున్నారు. ఇటు బాలకృష్ణ, అటు ఎన్టీఆర్ ఇద్దరూ తమ సినిమాల షూటింగ్స్‌తో బిజీగా ఉన్నా.. మోక్షజ్ఞ చిత్రంలో చేసేది అతిథి పాత్రే కాబట్టి.. వీలు చూసుకుని లేదంటే వీలు చేసుకుని నటిస్తారని భావిస్తున్నారు. అంతే కాదు.. ఈ ముగ్గురితో పాటు వశిష్ఠను 'బింబిసార'తో దర్శకుడిగా పరిచయం చేసిన కళ్యాణ్‌రామ్ కూడా స్క్రీన్ మీద కనిపిస్తే నందమూరి అభిమానులను థియేటర్లలో పట్టుకోవడం ఎవరికీ సాధ్యం కాదు. చూద్దాం మరి.. ఏం జరుగుతుందో?

వింటేజ్ కామెడీతో ఎన్టీఆర్ మూవీ



ఎన్టీఆర్‌తో నిర్మించే సినిమాపై ఆసక్తికర విషయాలను దర్శకు డు అనిల్ రావిపూడి పంచుకున్నారు. ఈ చిత్రంలో అభిమానులు ఏమేమి కోరుకుంటున్నారో అవన్నీ పుష్కలంగా ఉంటాయని భరోసా ఇచ్చారు. ముఖ్యంగా మాస్ ఆడియెన్స్‌తో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్‌ను అలరించేలా, గత పదేళ్లుగా ఎన్టీఆర్ సినిమాల్లో మిస్ అవుతున్న ఆ వింటేజ్ కామెడీ యాంగిల్‌ను ఇందులో పూర్తి స్థాయిలో చూపించబోతున్నట్టు రావిపూడి స్పష్టం చేశారు. అంతేకాదు ఇది ఏదో చిన్న స్థాయి సినిమా కాదని, ఎన్టీఆర్ ఇమేజ్, స్కేల్‌కు ఏమాత్రం తగ్గకుండా భారీ స్థాయిలో ఉండబో తోందని ఆయన చెప్పడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. నిజం చెప్పాలంటే ఎన్టీఆర్‌ను పూర్తిస్థాయి ఫన్ మోడ్‌లో చూసి దాదాపు పుష్కరం దాటిపోయింది. 'అదుర్స్, బృందావనం, బాద్ షా' వంటి చిత్రాల్లో తారక్ కామెడీ టైమింగ్ ఏ రేంజ్‌లో ఉంటుందో అందరికీ తెలిసిందే. ముఖ్యంగా 'అదుర్స్' సినిమాలో చారి పాత్రలో ఆయన చేసిన అల్లరిని ప్రేక్షకులు ఇప్పటికీ మర్చి పోలేరు. కానీ ఆ తర్వాత వచ్చిన 'టెంపర్', 'నాన్నకు ప్రేమతో', 'జనతా గ్యారేజ్', 'అరవింద సమేత వీర రాఘవ', 'ఆర్ఆర్ఆర్', 'దేవర', 'వార్-2'.. ఇలా వరుసగా అన్నీ సీరియస్, ఇంటెన్స్ యాక్షన్ సినిమాలే చేస్తూ వచ్చారు. ఆయా చిత్రాల్లో అక్కడక్కడా ఒకటి రెండు పంచ్‌లు వేయించారు తప్ప, వి.వి. వినాయక్ లాగా తారక్‌లోని పూర్తిస్థాయి కామెడీ క్యాలిబర్‌ను బయటకు తీసిన దర్శకులు లేరనే చెప్పాలి. సరిగ్గా ఆ లోటునే ఇప్పుడు అనిల్ రావిపూడి భర్తీ చేయబోతున్నారు.

పరాజయాలతో నాని రూట్ మారిందా?



టాలీవుడ్‌లో విభిన్నమైన కథలు, సహజమైన నటనతో తన కంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు హీరో నాని. ఇప్పుడు కథల ఎంపికలో కొత్త ఆలోచన తో ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. కెరీర్ ఆరంభం నుంచి కుటుంబ ప్రేక్షకు లకు దగ్గరైనకథలతో అలరించిన ఆయన, కొంతకాలంగా మాస్ ఇమేజ్‌పై దృష్టి పెట్టారు.'దసరా'తో వచ్చిన క్రేజ్‌తో ప్రయో గాత్మక చిత్రాల వైపు అడుగులు వేశారు. ఈ క్రమంలో 'హిట్ 3', 'ది ప్యారడైజ్' వంటి సినిమాల్లో రక్తపాతం, హింసతో కూడిన పాత్రలు పోషించారు. అయితే, వరుసగా యాక్షన్ నేపథ్యంలో సినిమాలు చేయడం వల్ల తన నేచురల్ స్టార్ ఇమేజ్ కు దూరమవుతున్నా రనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఆయన తాజా చిత్రం 'ది ప్యారడైజ్' ఆశించినస్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోవడంతో తదుపరి ప్రాజెక్టు ల విషయంలో నాని కొత్త నిర్ణయం తీసుకు న్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇకపై కొంతకాలం తీవ్రమైన హింస, రక్తపాతంతో కూడిన సినిమాలకు దూరం గా ఉండాలని భావిస్తున్నారట. కుటుంబ సభ్యులంతా కలిసి చూసి ఆస్వాదించే చిత్రాలకు ప్రాధాన్యం ఇవ్వాలనుకుంటు న్నట్లు సమాచారం.

'96' దర్శకుడితో భావోద్వేగ ప్రేమకథ?

తదుపరి సినిమాల విషయంలోనూ నాని కొన్ని మార్పులు చేసుకుంటున్నట్లు సమాచారం. గతంలో ఒక సినిమా కోసం ఎక్కువ సమయం కేటాయించిన ఆయన, ఇకపై తక్కువ వ్యవధిలో పూర్తయ్యే ప్రాజె క్టులను ఎంచుకోవాలని భావిస్తు న్నారట. తమిళం లో '96', 'సత్యం సుందరం' వంటి భావోద్వేగభరిత చిత్రాలను తెరకె క్కించిన దర్శకుడు ప్రేమ్ కుమార్ చెప్పిన ఓ కథ నానికి బాగా నచ్చిందని, ఈ ప్రాజెక్టుకు ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అదే నిజమైతే నాని మరోసారి తన సహజమైన నటనతో ప్రేక్షకులను భావోద్వేగాలకు గురిచేసే అవకాశం ఉంది.